# మాదిరెడ్డి సులోచన

# సంసార నౌక



సంసార నౌక

మాదిరెడ్డి సులోచన



సంసార నౌక

రచన :
మాదిరెడ్డి సులోచన

ముద్రణ :
జనవరి 1986

ముద్రణ :
విజయశ్రీ ప్రింటర్సు
విజయవాడ-3

ముఖ చిత్రం :
చంద్ర

ప్రచురణ :
డీలక్స్ పబ్లికేషన్స్
విజయవాడ-2.

వెల :

# సంసార నౌక

శ్రీపురం స్టేషన్‌లో బండి ఆగింది. నిర్మలకు నేమ్‌బోర్డు చదువుతుంటే, అదోలా ఉంది.

"వాసూ, చందూ! దిగండి." మొగవాళ్ళ పెట్టె నుండి దిగి హడావుడిగా వచ్చాడు భాస్కర్ రావు.

"వచ్చేస్తున్నాం." తన భుజం మీద తలాన్చి నిదుర బోతున్న నందినిని లేపింది నిర్మల.

"ఊరు వచ్చిందా అమ్మా?" కళ్ళు నులుపుకుంటూ లేచింది నందిని. అప్పటికే వాసు, చందు సామాన్లు దింపేస్తున్నారు. మరచెంబు, క్యారియరు పట్టుకుని దిగింది నిర్మల. వెంటనే చంగున దూకింది నందిని.

"నెమ్మదిగా దిగాలమ్మా, కాలో, చెయ్యో అవిటి అయితే ..." మురిపెంగా కూతుర్ని మందలించాడు భాస్కర్ రావు.

"కొయ్యకాలుతో నడుస్తుంది నాన్నా" చందు వెక్కిరించాడు.

"చాల్లే అశుభపు మాటలు." నిర్మల కసిరింది కొడుకును.

"దండాలు, రాయన దొరా ... దండాలు." తలపాగా బిగించుకుంటూ వచ్చాడు అంజయ్య.

"బావున్నావా అంజయ్యా? ఆ ప్రశ్న అడుగుతుంటే భాస్కర్ గొంతు వణికింది. పదేళ్ళ తరువాత మళ్ళీ ఈనాడు ఊరిలో అడుగు పెడుతున్నాడు. పదేళ్ళు!

"ఇన్నాళ్ళు మేం యెవ్వరం గుర్తురాలేదా రాయన దొరా?"

"దొరల కాలం పోయింది అంజయ్యా! అమ్మా, నాన్నా అంతా కులాసా?"

"అంతా కులాసే బాబూ! మీరు దగ్గర లేరన్న దిగులుతప్ప."

"ఊఁ." అతను భారంగా నిట్టూర్చాడు.

"ఒసోస్! చిన్న దొరసానే!" ఆశ్చర్యంగా కళ్ళింత చేసుకుని నందినిని చూశాడు. పచ్చని ఛాయతో, రెండు జడలు భుజాల మీదుగా వ్రేళ్ళాడుతుండగా, సిల్కు పరికిణీలో బంగారుబొమ్మలా కన్పించింది.

"ఛ! దొరసాని ఏంటి? నా పేరు నందిని" అన్నది.

"అయితే మాత్రం! నేను పేరుతో పిలుస్తానేమిటి? చిన్న దొరలా ... చందరంబాబు చెడ్డీ కట్టుకోవటాని కెంత పేచీపెట్టేవాడని ..." సంబరంగా కుటుంబం వంక చూచాడు.

"చూచావా నీ పక్షపాతం పోనిచ్చుకున్నావ్ కాదు. మా దొరలనే కాని నన్ను గూర్చి అడిగావా?" నిర్మల నిష్ఠూరంగా నవ్వింది.



"అమ్మమ్మ ... యెంతమాట? ఆనాడు ఊరు విడిచేసి తీసుకు వచ్చి వదిలింది నేనే ఈనాడు మళ్ళీ యెదురొచ్చాను."

"అక్కయ్యా, పిల్లలు జాగున్నారా?"

"వారం రోజుల క్రితమే భాగ్యమ్మ ప్రసవించింది." నిర్మల నిట్టూర్పును బలవంతంగా అదిమిపట్టింది.

"రండమ్మా! బండి తెచ్చాను."

"సార్ జీప్ ..." ప్రభుత్వపు జీపు తీసుకు వచ్చిన డ్రయివరు నిల్చున్నాడు.

"నువ్వా రషీద్! బావున్నావా?"

"అల్లా దయవల్ల సార్!" వినయంగా రషీద్ చేతులు జోడించాడు.

"నువ్వు వెళ్ళు. అన్నయ్య బండి పంపాడు."

"క్వార్టర్‌లో ఉండరా సార్?"

"ఇంకా ఏం ఆలోచించ లేదు."

"బండిలో కంటే జీపులో అయితే బావుంటుంది నాన్నగారూ!" చందు గుణిశాడు.

"అప్పుడప్పుడు బళ్ళలో కూడా సవారి చెయ్యాలోయ్ చందూ!" వాసు ముందుకు వచ్చాడు. అంజయ్య ముఖం వికసించింది.

"వాసుబాబు అంతా నిర్మలమ్మ పోలిక" సంబరంగా నవ్వాడు.

"వింటున్నావా నిర్మలా?"

"వింటున్నానులెండి. నిర్మలమ్మకు బండయినా, కార

యినా సర్దుకుంటుంది. మా దొరలు సర్దుకోరని మీ అంజయ్య బడాయి."

"అమ్మమ్మ ... యెంతమాట" సామానులు తీసుకుని ముందుకు నడిచాడు. వాసు, చందు కూడ సామానులు మోశారు.

"అయ్యగారిక్కడే ఉద్యోగం చేస్తారని విన్నాం. సామాను ఇంతేనా తల్లీ?

"లారీలో వస్తుంది" అందరూ బండెక్కారు. శ్రీపురం ప్రక్కన పెద్ద చెరువుకు కట్ట కడుతున్నారు. అక్కడికి అసిస్టెంటు ఇంజనీరుగా వచ్చాడు భాస్కర్.

"మీ రెక్కరేమిటి?" అడిగింది భర్తను.

"నేను నడుస్తాను."

"అలా అయితే నేను నడుస్తాను నాన్నా!" వాసు బండి దూకేశాడు, చందు తనూ దూకాడు.

"అమ్మా! సరదాగా నేనూ నడుస్తాను." నందిని గుణిశింది.

"ఆ పని మాత్రం చేయకు. వెడుతూనే మీనాయనమ్మ చేత చీవాట్లు తినాలి" కూతురి చేయిపట్టి ఆపింది నిర్మల.

"నడిస్తే తప్పా?"

"నీకెలా చెప్పేది నందీ! వారం రోజులలో నీకే అర్థం అవుతుంది. మీ నాయనమ్మ వెలమ దొరసాని. ఆడపిల్లలంటే బుద్ధిగా వంటయింట్లో ఉండాలంటారమ్మా."

"నడవటం బుద్ధితక్కువ యెలా అవుతుందమ్మా?"



"నందిని, ఇది పల్లెకానిపట్నం తల్లీ! అందరూ వింతగా చూస్తారు" భాస్కర్ రావు చెప్పాడు.

"ఇక్కడెవరూ నడవరా నాన్నా?"

"ఇక్కడ సిటీల మాదిరిగా కాదమ్మా, జాతులు, వర్ణాలు చాలా గోల. మనం ఒకప్పుడు దొరలుగా చెలామణి అయ్యాం. అందుకు ఇంకా జాగ్రత్తగా ఉండాలి."

తండ్రి చెప్పే మాటలు మనసుకు యెక్కనే లేదు. నందినికి, ఏదో ఆలోచిస్తుంది. నిర్మల మాత్రం మోకాళ్ళు దగ్గరగా పట్టుకుని వాటి మీద తల పెట్టుకుంది. బండి కుదుపులకు అన్నట్టు ఆలోచనా తరంగాలు గతాన్ని కుదుప సాగాయి.

## 2

"అమ్మా! నిర్మలా, ఇంకా తయారు కాలేదూ?" హడావుడిగా వచ్చాడు తండ్రి వేమారావు.

"వారు వచ్చారా?" తల్లి సత్యమ్మ అడిగింది. ఆమె పేరు సత్యవతి. అందరు సత్యమ్మ అనే పిలుస్తారు.

"వస్తూనే ఉండాలి. రైలు వచ్చింది."

"నేను సిద్ధంగా ఉన్నాను నాన్నగారూ!" నిర్మల వచ్చింది.

"అలాగే వారి ముందుకు వస్తావా?" ఆయన వెర్రిగా కూతురి వంక చూశాడు. సన్నంచు మామిడి పండు రంగు కోవ్వాయిచీర కట్టుకుంది. ఒక్కజడ, నుదుట తిలకం.

"అక్కయ్య నగలు అమ్మ దగ్గరే ఉండాలి కదమ్మా!"

"ఉంటే?"

"ఏమిటా మొండి ప్రశ్నలు? చదవేస్తే ఉన్న మతి పోయిందని. పెట్టుకోమంటున్నారు నాన్నగారు" సత్యమ్మ కసిరింది.

"పెళ్ళివారు ఆ నగలన్నీ నావేననుకుంటే ప్రమాదం"

"అది నిజమే. ఊర్మిళ పెళ్ళిలో అత్తగారెంత గొడవ చేశారు?" తల పంకించాడు, వేమారావు.

"మరిలా బోడి బొమ్మలా కూర్చుంటుందా వారి ముందు? పోనీ నా పట్టు చీరయినా కట్టుకో."

"అమ్మా! మీరింకా పట్టుచీరల దగ్గరే ఉన్నారా? అవతల వాళ్ళు వచ్చి కూర్చున్నారు" గదిమాడు వేమారావు పెద్దకొడుకు రాఘవ.

"అలాగా!" భుజాల నిండుగా ముసుగు కప్పుకుని వాకిలి దగ్గరకు వెళ్ళింది. అప్పటికే రాఘవ భార్య వారికి మర్యాదలు చేస్తుంది. స్త్రీలంతా లోపల గదిలో కూర్చున్నారు. పురుషులు బయటి చావడిలో కూర్చున్నారు. నిర్మల నిర్భయంగా, మర్యాదగా వెళ్ళి స్త్రీలకు నమస్కరించి దగ్గర చాపపై కూర్చుంది.

"శ్యామనా, మీ అమ్మాయి నగలు ఏం పెట్టుకోలేదు?" పాతికేళ్ళ స్త్రీ ప్రశ్న వేసింది. నిర్మల తలెత్తి చూసింది. మెడలో నాలుగయిదు రకాల గొలుసులు, పైన



తెల్లరాళ్ళ నెక్లెసు, చేతినిండా బంగారు, మట్టిగాజులు, కుచ్చులు పెట్టి కుట్టిన జాకెట్టుతో నిండుగా ఉంది.

"మా మరదలుకు నగలంటే పెద్దగా మోజులేదు" నవ్వుతూ రాఘవ భార్య చెప్పింది.

"అదేమన్న మాట! స్త్రీకి నగలు శృంగారం కదూ?" పెద్దావిడ అంది.

"నిర్మలా!" అన్నగారి పిలుపుతో అక్కడి నుండి బయటికి వచ్చింది.

"హాల్లోకి రా. వాళ్ళు చూడాలట." రాఘవ వెనుకాలే తల వంచుకుని వెళ్ళింది. తలెత్తి అందరికీ నమస్కరిస్తూ ఒక చోట చిక్కుపడిపోయాయి ఆమె చూపులు. పొడవుగా బలంగా నిర్లక్ష్యంగా కనిపించే వ్యక్తి పెళ్ళికొడుకని తెలుసుకుంది. పైజామా, లాల్చీలో నిరాడంబరంగా కన్పిస్తున్నాడు. చామన చాయతో హుందాగా ఉన్నాడు. వెంటనే తల వంచుకుంది.

"రామాయణం, భారతం చదవటం వచ్చా?" మామగారి ప్రశ్న.

"ఇంటర్ మీడియట్ వరకు చదువుకున్నానండీ." వినయంగా జవాబు ఇచ్చింది.

"ఏమిటి కాలేజి చదువులా?" కాబోయే బావగారి ఆరా!

"తోచక చేరిందండి ..." తడబాటుగా చెప్పాడు వేమారావు.

"మాకు అణకువగా ఉండే పిల్ల కావాలండీ."

"చదివిందే కాని నిర్మల చాలా అణుకువ గల పిల్లండి!" తండ్రి తాపత్రయం నిర్మలకు తెలుసు. అందుకే హృదయం భగ్గుమన్నా సహించింది. అప్పటికే రెండు సంబంధాలు తప్పిపోయాయి. చదువుల మీద వాద, ప్రతి వాదాలు జగురుతున్నాయి. వెళ్ళటమా, మానటమా అర్థంకాక నిలబడి పోయింది నిర్మల.

"మీ పేరు తెలుసుకో వచ్చా?"

తలెత్తింది ఉలికిపాటుగా. చిరునవ్వుతో తననే చూస్తున్నాడు పెళ్ళికుమారుడు.

"నిర్మల" అంది.

"నా పేరు భాస్కరరావు. లోపలికి వెళ్ళండి" మృదువుగా చెప్పాడు. అతని తీరుకు ముగ్ధురాలయింది.

"ధన్యవాదాలు!" మెల్లగా పరదాలోపలికి తప్పుకుంది. తరువాత కట్నం దగ్గర చాలా గొడవ జరిగింది. ఎనిమిది వేలకు ఒక్కపైసా తగ్గించేది లేదని మొగ పెళ్ళివారు, అయిదు వేలకన్నా ఒక్కపైసా ఇవ్వలేమని ఆడపెళ్ళివారు హఠం వేసుకున్నారు. ఇటు నిర్మల, అటు భాస్కరరావు ఉత్కంఠత భరించ లేకుండా ఉన్నారు.

"ఏమండీ బావగారూ! మీరు తహసిల్‌దారు పని చేశారు. పదివేలయినా ఇవ్వవచ్చు" వరుని తండ్రి చిన్నారావు అంటారు.

"మీకు తెలియందేముంది? నల్గురి ఆడపిల్లలకు పెళ్ళి చేశాను. ఆఖరుదని ఆ మాత్రం ధైర్యం చేస్తున్నాను."



"మేం చెప్పేది చెప్పాం మీ యిష్టం" వరుని అన్నగారు వెంకటరావు లేచారు.

"మీరంత నిక్కచ్చిగా అంటే నేనేం చేసేది?" వేమారావు చేతులు నులుముకున్నాడు.

"అన్నయ్యా!" భాస్కరరావు అన్నను పిలిచి, కాసేపు మంతనాలు జరిపాడు. అతను తండ్రితో గుసగుసలాడాడు.

"ఏదో చదువుకున్న అమ్మాయి అని అబ్బాయి సరదా. లాంఛనాలు సరిగ్గా జరపాలి" తమ పట్టు వదిలారు చిన్నారావు.

"ఎంతమాట!" నిర్మల మనసు కుదుటపడ్డా తృప్తిగా లేదు. సంతలో బేరం ఆడినట్టుంది. ఏమీ చేయలేదు. నిర్లిప్తంగా నిట్టూర్చింది. వెంకట్రావు పిల్లలు ఏడ్పు మొదలు పెట్టారు. నల్గురు పిల్లలు - ముగ్గురు ఆడపిల్లలు, ఒక పిల్లవాడు. అప్పటికే రాఘవ అతని భార్య భోజనాల కేర్పాటుచేశారు. పిల్లలకు కలిపి పెట్టింది నిర్మల కాబోయే తోడికోడలు భాగ్యలక్ష్మి.

వాళ్ళు వెళ్ళిపోయారు. తల్లి సంబరంగా చెబుతుంటే నిర్మల ముఖం ముడుచుకుంది.

"ముప్పై కాసుల బంగారం పెడతారట, బాగా ఉన్న వారండి."

"ఉన్న వారికి ఈ అయిదువేలు ఎందుకు కావల్సి వచ్చిందో?" వెటకారంగా అడిగింది.

"రావల్సింది రాబట్టుకోవటం వారి అధికారం."

"తరువాత అహోరాత్రులు బాధపడటం మీ వంతు."

"ఆడపిల్లలను కన్న వారికి ఇవి తప్పవుగా."

"తప్పిస్తే మహారాజులా తప్పుతాయి."

"ఏదో నా తరం ఇలా వెళ్ళనియ్యి. నీ పిల్లలకు నీ యిష్టం వచ్చినట్టు చేయి" మురిపెంగా నవ్వింది సత్యమ్మ. ఆ నవ్వులో యెంత తృప్తి, యెంత ఆనందం ?

## 3

"నిర్మలా !"

"ఊఁ."

"కోపంగా ఉందా ?"

"కోపం దేనికి ?"

"అదిగో మళ్ళీ ఆమాటే అంటావు. నిన్ను విడిచి ఉండటం నాకు మాత్రం సంతోషమా ? వివాహం కాగానే భార్య మాట వింటున్నాడని నిన్ను అంటే భరించలేను సుమా !"

"చతురులు" ఫక్కున నవ్వింది.

"ఏది ఏరుకోని మల్లెలు ..." ముందుకు జరిగాడు భాస్కర్.

"చాల్లెండి సరసం. వెళ్ళగానే ఉత్తరం రాయాలి." అంది అతనికి దగ్గరగా జరుగుతూ.

"రాయకుండా వుండగలనా ?" అన్నాడు. వివాహం కాగానే, తన కొత్తకాపురం గూర్చి ఎన్నో కలలు కన్నది నిర్మల. వాటిపై చల్లటి నీరు గుమ్మరించినంత పని చేసింది అత్త అన్నమ్మ.



"ఈ ఉద్యోగాలు మా ఇంటా వంటా లేవు. ఏదో చిన్నవాడు సరదాపడుతున్నాడని తండ్రి పంపాడు. ఇంకా కోడలు కూడా వెళ్ళటమా ? అయినా ఈ ఇల్లు చూడటం నా ఒక్క దానివల్ల ఏమవుతుంది ! భాగ్యమ్మకు కాన్పులతోనే సరిపోతుందాయె" తల్లిని ఎదిరించే శక్తి భాస్కరరావుకు లేదు.

"అక్కడ కష్టం కాదు వంటకు -" నసిగాడు.

"వంటకేం భాగ్యంరా అప్పిగాడిని తీసుకువెళ్ళు, మీ వదినకు నెలలు నిండుతున్నాయి. అమ్మ ఒక్కర్తీ చేయ లేదు" వెంకటరావు తేల్చేశాడు.

"అవునురా !" చిన్నారావు బలపరిచాడు. తన పక్షం బలహీనం అని తెలియగానే జాలిగా చూచాడు భాస్కర్.

అతను 'ఓవర్ సీర్ కోర్స్' చదివాడు. నల్గొండలో పని. శ్రీపురం అక్కడికి దూరం అయినా, అప్పుడప్పుడు రాక తప్పదు. నిర్మల చాలా మొండిపట్టు పడుతుందని భావించాడు.

"నిర్మలా !"

"ఏం ?"

"నాకు చాలా గర్వంగా వుంది."

"ఎందుకో !"

"నీ వ్యక్తిత్వముపట్ల, మొదటిరోజు నిన్ను చూడగానే నీ కళ్ళల్లో ఓ విజ్ఞానపు మెరుపు చూచాను."

"దాని వెల అయిదు వేలు" అన్నది కొంటెగా.

"అబ్బబ్బ ... ప్రతిదానికో సాకు. నువ్వే చెప్ప

ముక్కు, మొహం తెలియని అమ్మాయి కోసం తల్లి దండ్రుల్ని బాధించడం? ..."

"బావుండదు మహాశయా! నా ముక్కు, మొఖం చూడలేదా?" అన్నది వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"ఉహుఁ!" ఆమె వంక ఆరాధనా పూర్వకంగా చూచాడు. "విజ్ఞానంతో నిండి, రోషంగా చూసే కళ్ళను మాత్రం చూచాను" అన్నాడు.

"ఓ చిన్న అభ్యర్థన."

"కాదు ఆజ్ఞ!"

"వద్దు లెండి. భార్యా విధేయుడన్న పేరు మీకు అంటగట్టి పాపం మూటకట్టుకోలేను" అన్నది.

"చెప్పు"

"బి. ఏ. చదువుదామని వుంది."

"ప్రయివేటుగానా?"

"మరంతేగా!"

"టీచర్ కాండిడేట్స్‌ను మాత్రమే ప్రయివేటుగా కట్టనిస్తారు."

"పుస్తకాలు తెండి తరువాత చూద్దాం."

"అలాగే." అప్పటికే అర్ధరాత్రి గడిచింది. తెల్లవారితే అతను వెళ్ళిపోతాడు. ఆ భావనే ఇద్దరికీ చేదుగా అప్రియంగా వుంది. పోనీ నాన్నగారన్నట్టు ఇంటి పట్టునే వుండి పోదామా, అని అనుకున్నాడు భాస్కర్. కాని [illegible] ఆలోచనాపరుడు. ఉన్న పొలంలో ఆడంబరాలకు కరిగిపోయి, కొంతే మిగిలింది. దానిపై తమ అన్నదమ్ముల జీవితం గడవటం కష్టం.



"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు పడుకో." ఆమె చేతిని తన మెడచుట్టూ వేసుకున్నాడు.

"ఈ రాత్రి ఇలా తెల్లవారకుండా వుండిపోతే బావుండును" అన్నది బాధగా. తెల్లవారుజామున కన్ను మూశారు.

"బ్బాయ్... భాస్కర్..." తల్లి పిలుపుకు ఉలికిపడి లేచాడు. తనను పెనవేసుకున్న భార్యను మృదువుగా దూరం జరిపి లేచాడు.

"అప్పుడే తెల్లవారిందా?" ఆవులిస్తూ నిర్మల కూడా లేచింది. అతను తయారు అవుతున్నాడు. ఆమె హృదయం బారంగా తయారయింది. ఇదేం చిత్రం —అమ్మా-నాన్నా అంత ప్రేమగా పెంచారు. వారిని వదిలినప్పుడు ఇంత బాధ పడలేదు. పదిహేను రోజుల నరకు అపరిచితుడుగా ఉన్న ఈయన పట్ల ఇంత ప్రేమా? పెద్దవారంతా ఇంట్లో ఉండటంతో కళ్ళతోనే వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయాడు భాస్కర్.

"పడకగది కిటికీలోనే యెంతసేపు నిల్చుంటావు?"

ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది. భాగ్యలక్ష్మి నిల్చుంది. సిగ్గుపడి కంటినీరు ఒత్తుకుంది.

"అప్పుడే మరిదిమీద దిగులా?" నవ్వింది.

"అదేంకాదు." ఆమె వెనకాలే వంట ఇంట్లోకి వెళ్ళింది.

## 4

"అయ్యో! అదేం—చెక్కు తియ్యటం?" అన్నమ్మ

ముక్కున వేలుంచుకుంది. తను చెక్కు తీస్తున్న బీరకాయల వంక చిత్రంగా చూసింది నిర్మల. అందులో వింత ఏం కన్పించింది.

"ఇదిగో ఇలా చెయ్యాలి."

"అందులో సారం అంతా పోతుంది అత్తయ్యా!"

"సారం పోతుందని కసుక్కుమన్నా తింటామా?" కత్తిపీట లాక్కుంది. అక్కడినుండి హాల్లోకి వచ్చింది. తోడికోడలు పిల్లలకు తలలు దువ్వింది. పెద్దవారిద్దరికి జడలు వేసింది.

"అదేం జడలమ్మా, అలా యోగదువ్వావు?" ఆవిడ జడలు విప్పి మళ్ళీ వేయసాగింది. నిర్మల మాన్పడిపోయింది.

"ఇదిగో నిన్నే ... మీ మామ పూజ చేసుకుంటారు. దేవుడిగది శుభ్రం చెయ్యి" అత్తమాటకు గదిలో అడుగుపెట్టింది. గది అంతా నానా చీదరగా ఉంది. ఒకవంక ఆవకాయ జాడీలు, మరోవంక పాత ట్రంకు పెట్టెలు.

"అత్తయ్యా!"

"ఏమిటమ్మా ఆ అరుపులు? ఆడపిల్లవు అణకువగా ఉండాలి."

"పొరపాటు జరిగిపోయింది. ఆవకాయజాడీలు అక్కడెందుకు? స్టోర్ రూమ్‌లో పెడితే."

"ఇంకానయం సడింట్లో పడేస్తానని లేదు." ఆవిడ గొణుక్కుంది. ఆ ఇంట్లో తనమాట ఏమాత్రం చెల్లదని వారంరోజులలోనే తెలిసిపోయింది. ఒక పని పూర్తిచేసి



కొంతసేపు విశ్రాంతిగా వుండాలంటుంది నిర్మల. అవి వారికి పూర్తిగా విరుద్ధం. ఆరు నూరయినా నూరు ఆరయినా ఒకే పొయ్యిమీద మిట్టమధ్యాహ్నము వరకు వంట సాగాలంటుంది అన్నమ్మ. లోకం తలక్రిందులయినా సరే,! రెండు గంటలు కూర్చుని పిల్లలు వద్దో అని ఏడుస్తున్నా వారిచేత బలవంతంగా అన్నాలు మింగిస్తుంది భాగ్యలక్ష్మి. పెత్తనాలు ముగించుకుని చిన్నారావు, పొలంనుండి వెంకటరావు వచ్చేసరికి యిల్లు అడవిలాగా, సగం వంట అవుతూ వుంటుంది. మధ్యాహ్నపువేళ ఆకలితో వచ్చిన మొగవారు చిరుబురుమంటుంటారు.

"ఏమంత పొద్దయిందని?" అన్నమ్మ గుణుపు. అలా అలా అంటూ భోజనాలు అయ్యేసరికి మూడు గంటలు అవుతుంది. పిల్లలు మళ్ళీ అన్నాలకు తయారవుతారు. ఎవరికీ విశ్రాంతి వుండదు. పనులు కావు నిర్మలకు ప్రాణసంకటంగా వుంది. ఉదయం లేస్తూనే టీ డికాక్షన్ తీసి, పాలు కలిపి, ఆ టీ పడేస్తుంది. అది అలా మధ్యాహ్నము వరకు పడి వుంటుంది.

"యెవ్వరూ పళ్ళు తోముకోక పూర్వమే అలా కాయటం దేనికత్తయ్యా?" అంది ఓనాడు.

"ఒక్కొకరు ముఖాలు కడిగితే, అన్నిసార్లు టీ కాయాలా?"

"అందరూ తొమ్మిది దాటాకే త్రాగుతారు కదా! తొమ్మిదింటికి పెడదాం."

"ఏమో నాకిలాగే అలవాటయింది."

"అలా కాగిన టీ ఆరోగ్యానికి మంచిది."

అన్నమ్మ ఫక్కున నవ్వింది. నిర్మలకు అవమానంగా వుంది.

"అది కాదే అమ్మాయ్ ! మేం పదేళ్ళబట్టీ ఇలాగే త్రాగుతున్నాం. మాకే రోగాలూ రాలేదు. నీకంటే బాగానే ఉన్నాము."

నిర్మలకు ఒక విషయం అర్థం అయిపోయింది. వాళ్ళు అంటిపెట్టుకున్న పాత పద్ధతులు మాన్పించటం మామూలు పనికాదని, మర్నాడు తొందరగా ముఖం కడిగి టీ ఒంపగానే త్రాగేసింది.

"నిర్మలా !" భాగ్యలక్ష్మి పిలిచింది.

"ఏమక్కా !"

"మీ యింట్లో ఏం నేర్పలేదా ?"

"ఏమిటి ?" అంది తనేం జేసిందని.

"అలా అందరికంటే ముందు టీ త్రాగవచ్చా ?"

"తప్పేం ఉంది ? ఎవరిది వాళ్ళు త్రాగుతారు."

"మంచిదానివే. అత్తయ్య త్రాగందే త్రాగావని ఆవిడకు కోపంగా వుంది" అన్నది గుసగుసగా.

"మంచిదక్కయ్యా ! నాకిలాంటివి తెలియవు" యెంత ఆలోచించినా పుట్టినింట్లో తల్లికి, వదినకు యిలాంటి విషయాలలో భేదాభిప్రాయాలు వచ్చినట్టు గుర్తుకు రాలేదు.

మధ్యాహ్నము రెండుకావస్తుంది. ఆకలి నకనకలాడుతుంది. అత్తగారు తీరికగా కొడుకుతో హస్కు వేసుకుంది. భాగ్యలక్ష్మికో అలవాటుంది. ఏ పిల్ల వదిన అన్నం పార



వేయదు. అటోముద్దా ఇటోముద్దా కడుపులో అడవుగా వుండే వుంటుంది.

"కంచాలు పెట్టాను అత్తయ్యా!"

"వస్తున్నా" మాటేగాని మరో గంటకు గాని కదలదు. ఇది పనికాదని రెండురోజులు అన్నం మానింది. యెవరూ అంతగా పట్టించుకో లేదు. తనను అలా గాలికి వదిలివేసిన భర్తపై విపరీతమైన కోపం ముంచుకు వచ్చేది. తనను విరహ వేదన వర్ణిస్తూ ఉత్తరాలు చూడగానే అంతా మరిచిపోయేది.

"తండ్రికి రాస్తుండె ... ఇంక నీకేం ప్రత్యేకంగా రాస్తాడే !?" అత్తగారు అడిగేది. మాకేం తెలుసు ! "చదువా సంధ్యా ?" గొణుక్కునేది. పది గంటలకు దాహంగా అనిపించి లేచింది. అత్తగారు తోడికోడలి మాటలు సన్నగా విన్పించాయి.

"నా కంటే చిన్నతనాన పెళ్ళి అయింది అత్తా! నిర్మల నా కంటే పెద్దదని అనుమానం."

"కావచ్చు."

"అదేం మనిషో ! ఒంటరిగా పడుకోకపోతే లతనో, పాపనో, దగ్గర వేసుకోరాదూ !"

"మొగరాయుడి వేషాలే తల్లీ ..." ఇక వినలేక పోయింది. చాలా సేపు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. వాళు నాల్గుగోడల మధ్యే ఉండి సంకుచితంగా ఆలోచిస్తారు. తనే సహసం వహించాలి. వెంటనే ఓ రేడియో తీసుకు రమ్మని భర్తకు ఉత్తరం రాసి నిదురబోయింది.

"అమ్మా!" వెంకటరావు వచ్చాడు.

"అత్తయ్య బావిదగ్గరుంది పిలవమంటారా?" వినయంగా బావగారిని అడిగింది.

"వద్దమ్మా! ఈ పాలచెంబు లోపల పెట్టించు." అతనిచ్చిన పాలచెంబు తెచ్చింది. తోడికోడలు కళ్ళు అప్పగించి చూడసాగింది.

"ఏమిటక్కా!"

"బావగారితో నేనా మాట్లాడింది?"

"అవును ఏం?"

"మీ రసలు వెలమదొరలేనా?"

తోడికోడలి ఆంతర్యం గ్రహించాలని చాలా దీక్షగా చూసింది నిర్మల.

"అలా చూస్తావేం? మీ యింట్లో ఘోషా లేదా?"

"ఉండవల్సినంతవరకు ఉంది" అన్నది ఆవిడతో వాదించి లాభం లేదు. వాస్తవం గ్రహించని మనుష్యులు. ఘోషా పేరుకే. మామగారు తిరుగుతుంటారు. పిల్లలకు పాలు కుడుపుతూ యెక్కడ పడితే అక్కడే కూర్చుంటుంది భాగ్యలక్ష్మి. చీర పైకెత్తి పనిచేస్తుంటే మినిగౌన్లులా ఉండి కాళ్ళన్నీ బయటపడతాయి. ఆ తరువాత మళ్ళీ బావగారి యెదుటికి వెళ్ళలేదు.

"ఏమిటో అన్నమ్మా! యిద్దరు కోడండ్లు. నువ్వే చేయాలి పనులు." యె[illegible]న్న అడిగితే టక్కున జవాబు యిస్తుంది.

"నాకు శుభ్రంగా ఉంటేగాని నచ్చదమ్మా ఈ కాలం



వాళ్ళు చేసిన పనికి పొందికా పాడా?" అనేది ఆవిడ. ఆవిడకు శుభ్రతంటే ఏమిటో తెలియదని నిర్మలకు బాగా తెలుసు. కూరకలిపిన గరిటె నేలమీద పడేస్తుంది. అదే మళ్ళీ వాడుతారు. అన్నంలో గంటెవేసే పనేలేదు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు చేయిపెట్టి తోడటమే. మంచినీళ్ళ బిందెలపై మూతలుండవు. ఒక వంక నిర్మల పెడుతుంటే, రెండో వంక పిల్లలు తీస్తారు. గ్లాసులు కడిగే పనేలేదు. అలాగే ముంచి, ఒకరి తరువాత ఒకరు త్రాగేపని. పనిమనిషి చింతపండు మట్టివేసి బిందెలు తోముతుంది. పైన మాత్రమే. లోపల ప్రాకుడు పట్టినా ఎవరికీ పట్టదు. మధ్యాహ్నము అత్త, తోడికోడలు మంచి నిదురలో వుండగా, వాటిని బావిపైకి లాగి తోముతుంది. ఎంత ప్రయత్నించినా వారి పరిధి దాటి ఒక్క అంగుళం బయటికి రారు. ఒకపని జరగటం కంటే వారిమాట చెల్లుబడి అవాలనే పంతము ముఖ్యము వారికి. ఓ నిట్టూర్పు వదిలి ఊరుకుంది.

## 5

"అలా సెలవలు పెడితే ప్రభుత్వం ఊరుకుంటుందట్రా?" తండ్రి ప్రశ్నకు గతుక్కుమన్నాడు భాస్కర్.

శని ఆదివారాలు కలిసివచ్చాయని శుక్రవారం కూడా పెట్టాను. మాకుంటాయిగా!" యిబ్బందిగా అన్నాడు.

"ఇంత డబ్బుపోసి ఈ రేడియో కొనకుంటేనేం?" తల్లి గుణిసింది.

"మరిది మనకోసం కొన్నాడేమిటి అత్తా! నిర్మల ఒంటరిగా వుంటుందని గాని!" భాగ్యమ్మ అంది.

"వదిన భలేగా మాట్లాడుతుంది." హాస్యంతో ఎగురగొట్టాడు భాస్కర్.

"జీతం డబ్బులన్నీ దానికే తగలేశావా? ఈ నెల ఓ జత యొద్దులు కొనాలని వుంది!" వెంకటరావు ముఖం గంటు పెట్టుకున్నాడు.

"లేదన్నయ్యా! ఈ డబ్బు నేను అదనంగా పనిచేసి సంపాదించాను.

"ఇంట్లో ఏదైనా ఖర్చుకు పనికి వచ్చేవిగా?"

"యిది మాత్రం ఇంట్లోకే కదన్నయ్యా!" అన్నాడు చికాకుగా.

"కోపం ఎందుకురా? డబ్బు అనవసరంగా తగలెయ్యటం దేనికి?" పెద్దకుమారుని పక్షం వహించింది.

అతనేం మాట్లాడలేదు. నిర్మలకు చాలా బాధగా వుంది. భర్త అంత దూరం నుండి వస్తే, అతనికిష్టమైనవి చేసి పెట్టుకునే సాతంత్ర్యం లేదు. కరువుతీరా మాట్లాడే అవకాశము లేదు.

"నిర్మలా ఒక కప్పు కాఫీ పెట్టు!" అన్నాడు. టీ అడిగితే పొయ్యిముందు, నిప్పులమీదున్నదే ముందుకు వస్తుందని తెలుసు.

"వారు కాఫీ పెట్టమంటున్నారత్తయ్యా!"

"ఊఁ! పెట్టు" అంది కోపంగా పొయ్యిదగ్గర నుండి జరిగింది.



"పేర్లుపెట్టి పిలుచుకోటాలు, సింగినాదాలు! అలా పిలిస్తేనే మొగుడూ పెళ్ళాలు అంటారు కాబోలు మాయదారి కాలం. పదేళ్ళబట్టి పెద్దది కాపరం చెయ్యటంలే. పిచ్చి సన్యాసి అన్నింటికి 'అమ్మా' అంటూ నన్నే పిలుస్తాడు." బయట గదిలో వున్న భాస్కర్‌కి, వంటింట్లో వున్న నిర్మలకి విన్పిస్తూంది. కాఫీ తీసుకుని గదిలోకి వచ్చింది.

"రోజూ ఈ వాతావరణం ఎలా భరిస్తున్నావ్ నిర్మలా?"

పక్కున నవ్వేసింది నిర్మల.

"నవ్వులాటగా ఉందా?"

"ఏడ్వనా? ...చూడండి ఈసారి వచ్చేసరికి ముసుగు తన్ని పడుకుంటాను" అన్నది.

"అంతపని మాత్రం చేయకు. మరురోజే పరుగెత్తాల్సి వస్తుంది" అన్నాడు కాఫీ మెల్ల మెల్లగా సిప్ చేస్తూ.

"ఏమిటలా చూస్తున్నారు?"

"రోజూ యిలాంటి దృశ్యమే. నువ్వు కాఫీ ఇస్తున్నట్టు ఊహించుకుంటాను."

"ఊహాలు ఎంతో తియ్యగా, మధురంగా ఉంటాయి"

"అనుభవమే అద్భుతంగా, ఆనందంగావుంది" కప్పు టేబుల్ మీద పెట్టి భార్యను దగ్గరకు లాక్కున్నాడు.

"ఓ నిర్మలమ్మా! చాకలికి బట్టలేసి రాసుకో. అది నేనే రాసేదాన్ని. నా అమ్మా; అయ్యలకు చదువు చెప్పించే ఓపిక ఏడ్వలేదే తల్లీ!" అన్నది. నిర్మల చటుక్కున భర్త

బంధం వదిలించుకు వచ్చింది. చాకలి పద్దు రాసింది. ఆ బట్టలలో తోడికోడలి పట్టుచీర తీసి బయటపెట్టింది. అంత ఖరీదయిన చీరలు చాకలికి యెలా వేస్తారో! వెంటనే గుర్తుకు వచ్చినట్టు భర్త దగరికి పరుగెత్తింది.

"ఏమండీ!"

"చెప్పండి" అన్నాడు కొంటెగా.

"ఈసారి ఓ ఇస్త్రీపెట్టె పట్రండి."

"ఏం, లాండ్రీ పెట్టాలనా?"

"నిక్షేపంగా. దొంగతనం, యాచన తప్ప ఏం చేసినా తప్పులేదు. మరచిపోరు కదూ?"

"మళ్ళీ నాకు అక్షింతలు వేయించాలనా?"

"ఆశీస్సులు అనుకోండి. పాతకొత్తల కెప్పుడూ ఘర్షణ తప్పదు. మీరు ప్యాంటు వేయటం మీ నాన్నగారు అంగీకరించరనుకుందాం, మానేస్తారా?"

"గట్టిదానవే, అలాగే తెస్తాను."

"నిర్మలా!" భాగ్యలక్ష్మి పిలిచింది.

"వస్తున్నా నక్కయ్యా!" బయటికి వచ్చింది.

"కాస్త పిల్లలకి నీళ్ళుపోయి. [illegible]యినా దినమంతా తరగని గబుర్లు ఏమున్నాయి?"

"దినమా? ఓ సంవత్సరానికి సరిపడా వున్నాయి" నవ్వుతూ పిల్లలను తీసుకుని వెళ్ళింది. రెండు బకెట్లలో నీళ్ళు తోడి బావిదగ్గరకే తీసుకుపోయింది. వంటకుండలోని నీళ్ళు అన్నం పలుకులు, బూడిద అడ్డనుయిన చెదారం అంతా ఉంది. వాటిని పారబోసి, కాగు పొయ్యిమీద పెట్టింది.



"ఇష్టం లేకపోతే లేదని చెప్పరాదూ? నీళ్ళు పారబోయటం దేనికి?" చర్రున పిల్లలను లాక్కుపోయి చన్నీళ్ళు వాళ్ళమీద దిమ్మరించింది భాగ్యమ్మ.

"నీళ్ళనిండా చెత్త అక్కయ్యా!"

"నాకామాత్రం తెలియదా? నేనే కుక్కపేగుదాన్ని. అందరూ నావారే అనుకుంటాను."

"ఏమయిందే?" అన్నమ్మ అడిగింది.

"ఏమీ లేదు. నా దురదృష్టం! నేను నాల్గు అక్షరాలు చదివివుంటే, అస్తమానం మొగుడితో కబుర్లేసుకు కూర్చుందును. నేనిలా యింటి చాకిరి, ఆయన పాలేరుపని యెందుకు చేద్దుము!" అంది. పిల్లలను అటు దొర్లించి నాలుగు, యిటు దొర్లించి నాలుగు అంటిచ్చింది. నిర్మల మనసు చివుక్కుమంది. ఉమ్మడి కుటుంబంలోని చికాకులు యిలాగే వుంటాయి కాబోలు! క్రొత్త దంపతుల కోర్కెలు తెలియవా?

"ఏమో తల్లీ! ఈ యింటి తీరే మారిపోతూంది" ఆ రోజంతా భర్తను తప్పకునే తిరిగింది. ఉదయం గొడవ భాస్కర్ చెవులలో పడ్డది. అందుకే అతను పొలాల దగ్గరకు వెళ్ళి సాయంత్రం అన్నగారితో పాటు తిరిగివచ్చాడు.

"ఏరా పొలాలమీదికి మళ్ళిందా మనసు?" ఆప్యాయంగా అడిగింది తల్లి. కండువా తీసి ఒంకెకు తగిలిస్తున్న వెంకటరావు యిటు తిరిగి గుంభనగా నవ్వాడు.

"వచ్చే ఆదాయమంతా మనము తింటున్నామేమోనని వాడి అనుమానం."

"అన్నయ్యా !"

"అరుపులు దేనికిరా ? ఎవరి తాపత్రయం వారికుండటం సహజమేగా ? అందునా మరదలు చదువుకుంది కూడాను."

పల్లెలో నివసించేవారు అమాయకులంటారు. నిజానికి మాటలు తిప్పటంలో వారికి వున్న నేర్పు మరెవరికీ లేదేమో !

"మనము మాట్లాడే ప్రతిమాటా బాగా ఆలోచించి మాట్లాడాలన్నయ్యా ?" విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు. నిజానికి వెంకటరావు పని భుజాలు తడుముకున్నట్టు వుంది. పాలలో సగం వేరే అమ్ముడవుతాయి. కాయకూరలు సగం మార్కెట్టుకు వెడతాయి. సగం గంపలవారికి వెడతాయి. మార్కెట్టుకు వెళ్ళిన డబ్బులే లెక్కలోకి వస్తాయి. మిగతా డబ్బులు భాగ్యలక్ష్మి పెట్టెలోకి వెడతాయి. ఆరోజు కూరలమ్మిన డబ్బులు తెచ్చింది కట్టలు నాగి. తమ్ముడుంటం మూలాన కాస్త ఇబ్బందిగా తయారయింది అతని పని.

భాస్కర్ రావు బట్టలు సర్దుకుంటుండగా కాఫీ తీసుకుని వచ్చింది నిర్మల.

"ఏమిటి హడావుడి ?"

"ఊరు వెడుతున్నాను"

"రేపు సెలవేగా !"

"నీకు సెలవు ఉండదుగా !"

"కోపమా ?" అతని భుజంమీద చెయ్యి వేసింది. చూడండి మీకు తెలియదనికాదు. ఒక ఇంట్లో రెండురకాల మనుష్యులు ఇముడడం కష్టం. అలా అని పోనూలేము. ప్లీజ్ !



నా కోసం ఉండండి." ఆఖరుమాట అంటున్నప్పుడామె కంఠం బొంగురు పోయింది. అతను చలించిపోయాడు. ఇటు తిరిగి ఆమెను దగ్గరకు లాక్కొని నుదురు చుంబించాడు.

"ఉంటారు కదూ !"

"ఊఁ !" ఆమెను అలాగే చూస్తూ నిల్చుండిపోయాడు.

## 6

ఆ రోజే కాస్త తీరిక చిక్కింది. యేదో వారపత్రిక తిరగేస్తుంటే, కుటుంబనియంత్రణ ప్రచారంచేసే ఓ ప్రకటన దాని క్రింద వివరాలు కన్పించాయి. వాటిని క్షుణ్ణంగా చదివింది. ఆమె ముందు ప్రసవ వేదన పడుతున్న భాగ్యలక్ష్మి రూపం తిరిగింది. అయిదుగురు సంతానం చాలరా ? వున్న పిల్లలు వృద్ధిలోకి వస్తే చాలు. ఆ పత్రిక అలాగే పట్టుకుని తోడికోడలు గదిలోకి వెళ్ళింది.

"పడుకున్నావా అక్కయ్యా ?"

ఈ పిల్లలతో పడుకున్నట్టే !" అన్నది, చంటాడికి పాలు కుడుపుతూ.

వెళ్ళి మంచం చివర్న కూర్చుంది.

"వీడింతకు మునుపే పాలు త్రాగాడుగా !"

"ఏడుస్తున్నాడు మళ్ళీ"

"అది సరే, నేనో మాట చెప్పనా ?"

"యేమిటి ? యేదో పుస్తకం పట్టుకున్నావ్ ? యేది చదువుదామన్నా తీరితేనా ? వచ్చిన అక్షరపు ముక్కలు మరిచేపోతాను. భగవంతుడు కూడా నిర్దయుడే. 'పిల్లలో,

పిల్లలో' అనే వారికి పిల్లల నివ్వకూడదూ? నేను కావాలన్నానా యేం?"

"ఆ మాటే చెప్పపోతున్నాను అక్కయ్యా!"

"యేమిటో!"

"యిదేం పురాతన కాలంకాదు. మనము కావాలనుకుంటే పిల్లలు పుడతారు, లేకుంటే లేదు." కుటుంబ నియంత్రణ గూర్చి చక్కగా విడమరిచి చెప్పింది.

"ఏ పద్ధతి యిష్టమయితే అది అవలంబించవచ్చు. నీ ఆరోగ్యం చూస్తుంటే నాకు దిగులుగా ఉందక్కా!"

"ఇవన్నీ ఉన్నాయా? నాకు తెలియదు సుమా!"

"అవునక్కా! మన కుటుంబం పెరుగుతుంది గాని భూమి పెరగటం లేదు. పరిమిత కుటుంబం యెంతో అవసరం అక్కా!" తనెంతో ఘనకార్యము చేసినట్టు నిట్టూర్చింది నిర్మల.

"చదువుతుంటే నాల్గు విషయాలు తెలుస్తాయమ్మా! మీ బావకారితో చెబుతాను!" అన్నది. ఆ తరువాత ఆ సంగతులే మరిచిపోయింది. అన్నమ్మకు నడుము పట్టుకుంది ఇంటిపని, వంటపని, పిల్లలతో క్షణం తీరిక దొరకలేదు. ఉత్తరం, పత్తరం లేకుండా వచ్చిన భర్తను చూచి, విస్మయానందాలతో ఉక్కిరి బిక్కిరి అయింది.

"అకస్మాత్తుగా వచ్చేశారేం? [illegible]గ్యం బావుందా?" టీ ఇచ్చి ప్రశ్నించింది.

"ఆరోగ్యానికేం దివ్యంగా వుంది. నిన్ను చూడాలనిపించింది! వచ్చేశాను!" అన్నాడు.



"కొయ్యకండి కోతలు."

"ఊఁ... నీకలాగే కన్పిస్తాయి. యెన్ని రాత్రులు నిదరలేక నీ ఆలోచనలతో గడుపుతానో నీకేం తెలుసు?"

"అయితే ధీరతను చూపించండి. అమ్మా నాన్నను కాదని తీసుకు వెళ్ళండి" అన్నది కవ్వింపుగా.

"చూస్తూ ఉండు."

"భాస్కర్ వచ్చాడా!" చిన్నారావు కంఠం విన్పించింది.

బుద్ధిమంతుడిలా బయటకు వచ్చాడు.

"ఏమిటి నాన్నా! తొందరగా రమ్మని రాశారు?"

"కారణం ఉంది గనకే." ఆయన ఈజీ ఛైర్లో కూర్చున్నాడు."

"అసలు సంగతేమిటి?"

"అన్నయ్య రాని." వారిలా మాట్లాడుతుండగానే వెంకటరావు వచ్చాడు. సభ తీర్చినట్టు కూర్చున్నారు.

"ఏమిటన్నయ్యా ఈ సస్పెన్స్?"

"నీకలాగే వుంటుంది మరి!" అతని ముఖం గంభీరంగా తయారయింది.

"నీ భార్యను అదుపులో పెట్టు."

"ఏం జరిగింది?"

"వాడెలా చెబుతాడురా? ఏదో ఎద్దులాగ కష్టం చెయ్యటమే కాని, ఇగరం తగరం తెలుసా! నీ పెళ్ళాం నోటికి హద్దూపద్దూ లేదు." అన్నమ్మ ప్రారంభించింది.

"అసలు సంగతి చెప్పక ఈ సస్పెన్సు దేనికమ్మా?"

"పెద్దాడి వయసు యెంతుందని? నీ కంటే నాలుగేళ్ళ

యెక్కువ. అప్పుడే ముసలివాడయ్యాడా? పిల్లలు పుడితే సుఖం లేదు. మందులు మింగమని అంటుందా? ఆపరేషన్ చేయించుకోవాలా?" అన్నమ్మ నిలదీసింది.

"ఎవరన్నారమ్మా!"

"అదే నీ చదువుకున్న పెళ్ళాం. పెద్దంతరం, చిన్నంతరం ఏం లేదా?"

"అది కాదమ్మా! నా పిల్లలు మొగుడి సంపాదన తినిపోతారేమోనన్న ఏడుపు!" వెంకటరావు అన్నాడు.

"ఎందుకొచ్చిన గోలండీ! ఈ బాదరబందీ యెందుకు? మీకు యేదేనా బంట్రోతు వుద్యోగం దొరక్కపోదా? వెళ్దాం. ఎంతలేసి మాటలు పడ్డాను!" జ్రరున చీదేసింది భాగ్యలక్ష్మి.

"నా యింటికి తెచ్చుకున్న దాన్ని పొమ్మనటానికా!" యెవరి పుట్టిటి సొమ్మేం తినటం లేదు. నువ్వూరుకో." అత్త ఓదార్చింది.

భాస్కరరావుకు మెల్లగా అర్థం అయింది. నిర్మల కుటుంబనియంత్రణ ప్రతిపాదన పెట్టి ఉంటుందని.

"నిర్మలేదో అంటే నన్ను పిలిపించి నిలదీయటం దేనికమ్మా! తనేదో చెప్పింది, యిష్టం లేకపోతే మానెయ్యొచ్చుగా!"

"యెంత అందంగా సమర్థిస్తు[illegible]వ్? యింత దౌర్భాగ్యపు టాలోచన ఆవిడ కెలా [illegible]చిందట? సృష్టిని అరికట్టటం పరిహాసం కాదా?"

"చూడన్నయ్యా! ఇలాంటి విషయాలు వ్యక్తుల అభి



ప్రాయాలపై ఆధారపడి వుంటాయి. నన్నేం చేయమంటావో చెప్పు."

"గాజులు వేసుకు ఊరేగు. సిగ్గులేదట్రా! ఆడదాని, మాటలకు వంత పలుకుతావా? హాయిగా మీరే వెళ్ళి ఆపరేషన్ చేయించుకోండి. లింగి, లింగడు ఊరేగుదురుగాని" చిన్నారావు హూంకరించాడు.

"చిన్న విషయానికి...?"

"మరిదిగారు! వివాహమై వచ్చిన దగ్గరనుండి చూస్తున్నాను. మీ ఆవిడ తత్వం అంతా వింతగావుంది. నా పిల్లల పొడ అంటే గిట్టదు. మా పిల్లలు మాకు బరువా?"

అప్పటి వరకు అంతా వింతగా వింటున్న నిర్మల మేల్కొంది. ఆమెకు ఒక్కసారి జ్ఞానోదయ మయినట్టు అన్పించింది.

"అక్కయ్యా! నేను యెప్పుడయినా పిల్లలను కసరటం చూచావా?"

"కసరకపోతేనేం? నీ ముఖం చూస్తే తెలియదా?"

"నిజంగానే నాముఖం చూస్తే మతిలేనిదానినని తెలుస్తుంది. నీకు సలహా యిచ్చాను..."

"నీకు, నీ సలహాలకో నమస్కారం తల్లీ! మమ్మల్నిలా బ్రతకనివ్వు."

"నీకెందరు పిల్లలు అంటారేగాని నీ దగ్గర యెంతధనం కూడింది అని యెవరూ అడగరు" ఈసడింపుగా అంది.

"అత్తయ్యా! నిజంగా చెబుతున్నాను. అక్కయ్య బాధ చూడలేక అన్నాను" తనను సమర్థించుకోబోయింది

"కావ్యాలు, కష్టాలు తియ్యగా ఉంటాయటమ్మా! యెంత సంగనాచివే. అయినా దాని సంగతి అది చూసుకో లేదా ?"

"పొరపాటు జరిగిపోయిందత్తయ్యా, క్షమించండి."

"అంత ఇంగిత జ్ఞానముంటే ఇలాంటి మాటలు మాట్లాడవు" తీక్షణంగా చూశాడు భాస్కర్.

"పొరపాటు అంటున్నాను కదా..."

"ఎంత ధైర్యమే. కట్టుకున్న వాడిని అలా నిలదీయటమే" ముక్కున వేలుంచుకుంది అన్నమ్మ. వాళ్ళంతా భర్తలకెంత గౌరవమిస్తారో నిర్మలకి తెలియంది కాదు—యే కాస్త విసుగు వచ్చినా "ఈముదనష్టపాడిని కట్టుకు యేం సుఖపడ్డాను" అనో "చీకుచస్తే పీడ విరగడ అవును. హాయిగా ఓమూల పడివుండమనో" ఒక్కమాటంటే పది మాటలు ఏడుస్తూనే అంటించడం యెరుగనిది కాదు. అయినా వాదించి లాభం లేదు.

"ఇదిగో అందరు వినండి. పెళ్ళికాకముందు యిలాంటి వన్నీ చదివి యెన్నెని వేషాలు వేసినా చెల్లింది. యిక చెల్లదని చెబుతున్నాను. జాగ్రత్త" వెంకటరావు అన్న మాటలకు నిర్మల రోషపడి, వెనుతిరిగింది. కోపం బలవంతంగా ఆవుకున్నట్టు ఆమె ముఖమే చెబుతూంది.

"మీరు నోటికి వచ్చినట్లల్లా మాట్లాడటం బావుండదు..."

"ఏం! ఏంచేస్తావు? పెళ్ళానికి బాగా నేర్పావురా..."



భాస్కరరావుకు అసలే చికాకుగా వుంది. అన్నగారి మాటలు అగ్నికి ఆజ్యం పోసినట్టు అయ్యాయి. లేచి ముందుకు వచ్చాడు. భార్య చెంప చెళ్ళుమంది.

"అందరిలా పడి ఉండరాదు. పెత్తనాలు దేనికి ?" అంటూ మరోవంక చూడక చికాకుగా బయటికి వెళ్ళిపోయాడు. అతనిలా చేస్తాడని యెవ్వరూ ఊహించలేదు. అందరూ చిత్రపతిమల్లా నిలబడిపోయారు. పదినిమిషాల తరువాత పాలేరు కూరలబుట్టతో ప్రవేశించాడు.

"చిన్నదొర యెప్పుడు వచ్చాడు ? బస్సు యెక్కాడు" అనగానే అంతవరకు విస్మయంలో వున్న నిర్మల ఒక్కసారి కోలుకుంది. చెంప చేత్తో పట్టుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆమె మనసంతా, బాధగా, కలతగా వుంది. ఫలహారం, అన్నం తినకుండా వెళ్ళిపోయారు. ఈ సాంప్రదాయాలు, సమరసాలు యేమిటో ! అటు కొడుకు వివాహం కాకపోకే భరించలేరు. యిటు కోడలి ఉనికి భరించలేరు. తను యెన్ని కలలు కంది. కలతలు రాకుండా ఆదర్శప్రాయంగా వుండాలని. దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

## 7

దీపావళి వచ్చింది, వెళ్ళింది. అత్తవారికి రానని రాశాడట భాస్కర్. ఆశీస్సులు పంపుతూ తండ్రి ఉత్తరం రాశాడు. అది చదువుకుని నిర్లిప్తంగా వుండిపోయింది. పండుగ సాయంత్రం వరకు ఏ చిన్న చప్పుడయినా భాస్కర్

వచ్చాడని యెదురు చూచింది నిర్మల. ఆమెకు ఆశాభంగమే అయింది.

"ఏమిటో పెళ్ళయి ఇన్నేళ్ళు అయినా, అభిమానాలు పోవు. ఖర్చు వద్దో అన్నా మా అన్నయ్య వినడు" భాగ్యలక్ష్మి క్రొత్తబట్టల ప్యాకెట్టు తెచ్చి విప్పింది. పిల్లలకు బట్టలు, తన చీర తీసి సగర్వంగా చూచుకుంది. అన్నమ్మ కూడా బట్టల నాణ్యం పరీక్ష చేసి మెచ్చుకుంది.

"మీ అన్నకు బాగా తెలుసే బట్టల నాణ్యము. అన్నింటికి పెట్టిపుట్టాలి. భాస్కర్‌కి పండుగ పబ్బం ఏం లేదు" నిట్టూర్చింది.

"ఏమిటో పెళ్ళి అయినా ప్రతి పండక్కి బట్ట లెందుకన్నా యెవరూ వినరు మా పుట్టినింట్లో" అలా దినమంతా సాగింది. నిర్మల ఒక్కమాట అనలేదు. మనసు అద్దం లాంటిది. దానిపై దెబ్బపడి, పగిలితే, ఆ అతుకు అతుకు లాగే వుంటుంది. వారిద్దరూ ఒకటయి చిన్నకోడల్ని దూరంగానే చూస్తారు. నిర్మల కది బాధగా వుంటుంది. పోనీ తను కొత్త కోడలని అత్తగారేం కొన్నట్టు ? భోజనాలవేళ మొగవారు కూడా ఓసారి భాస్కర్‌కి జరిగిన అన్యాయానికి విచారించారు. భాగ్యలక్ష్మి పుట్టింటివారు పెట్టిన గుంటూరు చీర కట్టుకుంది. లేని ఉత్సాహం తెచ్చుకుని దీపాలు అలంకరించింది. పిల్లలతో మతాబులు కాల్పించసాగింది.

"మీ అత్తగారు లేరా ?" కోమట్లమ్మాయి పేరంటం పిలవటానికి వచ్చింది.



"లోపల వున్నారు, రండి" ఆదరంగా పిలిచింది. ఆ అమ్మాయి అచ్చు భాగ్యలక్ష్మిలాంటి చీరె కట్టుకుంది.

"మీకు చీర నచ్చిందా భాగ్యలక్ష్మమ్మా !"

"ఊఁ !" యిబ్బందిగా కదిలింది భాగ్యలక్ష్మి.

"అన్నయ్య, మీవారు ఒకే కొట్లో కొన్నారట" ఆ మాట విననట్టే భాగ్యలక్ష్మి అత్తను కేక వేసింది. అందరికీ బొట్టు పెట్టింది.

"బొమ్మలు పెట్టాం. పేరంటానికి రండి" హైద్రాబాద్ తరఫున కొందరు దీపావళికి బొమ్మలు పెడతారు.

"తప్పక వస్తాం. అన్నట్టు ఎన్నేళ్ళేమిటి మకాం."

"ఏమో ... ఆరోగ్యం బావుండ లేదు" ముసిముసిగా నవ్వింది.

"ఏదయినా విశేషమా ?" అలా చెప్పు. మా భాస్కర్ పెళ్ళి అయిన నెలకు నీ పెళ్ళి అయింది కదూ ?"

"ఊఁ !" ఎర్రబడ్డ ముఖంతో అన్నమ్మ నిర్మల వంక చూచింది.

"అన్నింటికీ రాత ఉండాలే తల్లీ ! రాత. ఆడపిల్లల కన్న తల్లిదండ్రులకు అరులుండాలి" అంటూ గొణుక్కుంది. నిర్మలకు మరో విషయం అర్థం అయింది. పుట్టింటి గొప్పలు చాటుకోవటానికి భర్త డబ్బుతో వస్తువులు కొని, పుట్టింటివారిచ్చారని చాటుకుంటారు. అది స్త్రీలకు గొప్ప సంగతి. దోషిలా ఒకమూల గడిపింది.

"అత్తా !"

"ఏమిటే ?"

"నాకో అనుమానమత్తా !"

"దేనిగూర్చి ?"

"అదే - మన నిర్మల ... పిల్లలు పుట్టకుండా మందు తింటోందని. నా కయితే, సరిగ్గా వివాహం అయిన పదినెలలకే కాన్పు రాలే !"

"అవునేవ్. ఎంతకైనా తగుదురు."

"అడిగి చూడండి. యిదేం బుద్ధి ? అంతగా ఇష్టం లేక పోతే, ఓ నలుగురు పుట్టాక తినొచ్చు."

"ఓరోజు అడుగుతాను. నాకేం భయమా ?"

బయటినుండి సంభాషణ విన్న నిర్మల ఓ నిట్టూర్పు వదిలింది. జాలిపడింది. మర్నాడు అన్నమ్మ తలనొప్పని పడుకుంది. భాగ్యలక్ష్మి భర్తకు ఒడ్డిస్తూ కూర్చుంది.

"ఓ మాట వింటారా ..."

"ఏమిటి ?"

"ఈ కాలేజీలలో చదివేవారు పాతికేళ్ళ ఏ కోరికలు లేకుండా యెలా వుంటారు ?"

"ఏమో నాకేం తెలుసు ?"

"ఈ మందులు అదే పిల్లలు కాకుండా వాడుతారే, అది వారికి కల్పవృక్షమండీ ..." గుంభనగా నవ్వింది.

"నువ్వు కొత్త విషయాలు కనిపెట్టడంలో నిపుణురాలివే. నీకో డాక్టరేట్ యివ్వవచ్చు" అతను ఫక్కున నవ్వాడు.



"ఈ కాలేజి చదువులు చదినవారు లోక పతివ్రతలన్నమాట !" అంది.

"అన్నమాటే. గుట్టుగా తమ కోర్కెలు తీర్చుకుని మందులు మింగుతారు. అమ్మో ! మనమ్మాయిలను చదివిద్దాం అనుకున్నాను. ఈ మాయదారి చదువులు వద్దు తండ్రీ !" ప్రతిరోజూ ఇలాంటి సంభాషణ విని విని చెవులు తూట్లు పడుతున్నాయి. అటు భాస్కర్ కొక్క వుత్తరం కూడా రాయటం లేదు. రెండుసార్లు అన్న వచ్చి. పిలిచినా పుట్టింటికి వెళ్ళలేదు.

'ఛీ ! స్త్రీ జీవితం యింత గాడులాంటిదా ? తనలో లోపం యెక్కడుంది ? యెందుకు తనంటే యింట్లోవారికి సదభిప్రాయం లేదు. వారికి తనను మాటలతో బాధిస్తే లాభం ఏమిటి ?' నిర్మలకు ఒక విషయం తట్టలేదు. స్త్రీలు స్వభావ సిద్ధంగా అసూయాపరులు. తన కంటే కొంచెం ఏ విషయంలో ఇతర స్త్రీలు కన్పించినా వారి తప్పులు వెతకాలనే చూస్తారు. కొందరు అసూయను జయిస్తారు మరి కొందరు ప్రతి నిమిషం ప్రదర్శిస్తారు.

రోజుకు రోజుకు చిక్కిపోవడం, పరధ్యానంగా తిరగటం జరిగింది. ఇదేం అని అడిగినవారు లేదు. అభిమానం వదలి రెండు త్తరాలు రాసింది భాస్కర్ కి. జవాబు లేదు ! తండ్రికి రెండు నెలల బట్టి సక్రమంగా డబ్బు అందటంబట్టి అతను క్షేమంగా ఉన్నాడని భావించింది.

అందరూ నిర్మల ఆరాటం, ఆవేదన గ్రహిస్తూనే వున్నారు. ఒక విధంగా వారికి నిశ్చింత కల్గింది. భాస్కర్

చేయిదాటిపోలేదని. ఇంత చిన్న విషయానికి భార్యను శిక్షించినవాడు అన్యాయం చెయ్యాడని గట్టి నమ్మకం కుదిరింది.

"ఉత్తరం వచ్చిందా?" అన్నమ్మ అడిగింది.

"లేదు."

"దిగులు పెట్టుకోకు. అదే వస్తుంది. మొగవారికి కోపం మెండులే!" సానుభూతిగా పలికే అత్త మాటల వెనకాల వున్న భావం గ్రహించలేనంత తెలివితక్కువదేం కాదు. నూతన వివాహ జీవితం మధురం అంటారు. ఇదేనా? తనను తాను మరిచిపోవటానికి పనులన్నీ తనే చేస్తుంది. ఏమంటే ఏం తప్పో అని అవసరం అయితే తప్ప అవును, కాదు అని జవాబు ఇవ్వటం లేదు.

"పొగరు అణిగిందిలే!" అని తోడికోడలు అనడం విన్పించింది. రేడియో దగ్గరకు పోదు. వార్తలవుతుంటే చిన్నారావు చెవి పెట్టి చిన్నగా వేసుకుని, పక్కవారు వింటే ప్రమాదం అన్నట్లు వింటాడు. మధ్యాహ్నము హాల్లోకి రావటానికే తీరిక వుండదు. ఇక సాయంత్రము, రాత్రిపూట వెంకటేశ్వరరావు వుంటాడు. అక్కడికి పోయే పనిలేదు. పిల్లలు తండ్రి ఉండగానే తిప్పి, అటు దొర్లించి, యిటు దొర్లించి ఆడుతాడు.

"తప్పమ్మా! అది పాడవుతుంది!" ఒకసారి పెద్ద పిల్లకు నచ్చచెప్పబోయింది.

"అవునమ్మా! అది బాబాయిది. వీడా నా ... కొన్నాళ్ళ ఆడుకుందువుగాని!" వెంటనే తల్లి జవాబు యిచ్చింది.



నిర్మల దెబ్బతిన్నట్టు చూచింది. ఆ తరువాత దాని జోలికే పోలేదు.

"నిర్మలా! ఈ రేడియో బర్ బర్ అంటుంది చూడు" మామ పిలిస్తే వెళ్ళింది. ఎంత సేపటినుండి ఆన్ అయివుందో బ్యాటరీ అయిపోనట్టుంది. ఆ సంగతే చెప్పింది.

"మరెలా? రేపు యెవరయినా పట్నం వెడితే తెప్పించాలి!" అన్నాడు. మూడు రోజులకు భాస్కర్ తోటి సూపర్ వైజర్ ఉత్తరం రాశాడు. భాస్కర్ కు మశూచి ఏమోనని అనుమానంగా వుందని, హాస్ప్రతిలో చేర్చారని.

"అంటువ్యాధి కదా! పిల్లలుకల యిల్లు. యెవరం పోవటానికి వీలు లేదు. అక్కడ వాడెలా వున్నాడో?" అన్నమ్మ శోకం పెట్టింది.

"డాక్టర్లు ఉన్నారు కదమ్మా!" విసుక్కున్నట్లు అన్నాడు వెంకటరావు.

"నేనోసారి వెళ్ళి చూసివస్తానే!" తండ్రి ప్రయాణం అయ్యాడు.

"మామగారూ!"

"ఏం?"

"నేను వస్తాను." నిర్మల కన్నీరు బిగబట్టి అడిగింది.

"అది అంటువ్యాధి, తెలుసా?"

"తెలుసండీ" దృఢంగా అన్నది. దీనంగావున్న కోడలి చూపులకు కరిగిపోయారు వెంట తీసుకుని ప్రయాణం అయ్యారు.

# 8

మొదట హాస్పత్రికి వెళ్ళారు. అమ్మవారు కాదని, యేదో విష జ్వరమని ఇంటికి పంపారట. జ్వరం తగ్గిందని చెప్పారు. ఊరంతా మశూచి ఉండటంతో అనుమానించామని చెప్పారు. తేలికపడ్డ మనసులతో భాస్కర్ వుంటున్న యిల్లు చేరారు. ఆఫీసు ప్యూన్ కాఫీ కాచి యిస్తున్నాడు.

"అనవసరంగా కోదండం కంగారుపడ్డాడు. మీరు వచ్చారా!" అన్నాడు. నిర్మలకు ఎంత ఆపుకున్నా దుఃఖం ఆగటం లేదు. ప్రక్కగదిలోకి వెళ్ళి కళ్ళు ఒత్తుకోసాగింది.

"భయం లేదమ్మా, ఈ మధ్య రాత్రింబవళ్ళు పని చేశారు. అలసట, ఊరూరి నీళ్ళు త్రాగటంవల్ల వచ్చింది జ్వరం!" అన్నాడు పనివాడు! చిన్నరావు కొడుకుని అంటిపెట్టుకునే తాము యెంత కంగారు పడింది చెప్పసాగాడు! అతని ముందే వెళ్ళి భర్తను మాట్లాడిస్తే ఏం కథలు అల్లుతారో? మరోసారి వేడి కాఫీ యిద్దరికీ యిచ్చింది. యిల్లు సర్దుతుండగానే సాయంత్రం అయింది. వంట చేస్తుంటే రోజూ భాస్కర్ పడే అవస్థ చెప్పి నవ్వుతున్నాడు పనివాడు.

"మీరుండిపొండి అమ్మగారూ! చెయ్యినొప్పి అయినా, కాలునొప్పి అయినా యెవరు చూస్తారు?"

"నువ్వు ఉన్నావుగా!" అంది నవ్వుతూ.

"నేనేంటమ్మా కూలోడిని ఈ మధ్య అన్నం సరిగ్గా తినలేదు. ఎటో చూస్తూ పరధ్యానంగా వున్నారు. మీరు దగ్గరుంటే అన్నీ కనుక్కుంటారు!" అన్నాడు.



"అలాగే" అన్నది. భాస్కర్‌ను చూడటానికి అతనితో పనిచేసేవారంతా వచ్చారు. తండ్రి వున్నందున అతను భార్యను యెవరికీ పరిచయం చేయలేదు.

"మీవారు వచ్చారని తెలిస్తే, మా వాళ్ళను పిలుచుకు వచ్చేవారము" అని నొచ్చుకున్నారు. వారు వెళ్ళిపోయాక తండ్రీ కొడుకులకు వడ్డించింది.

"ఒక్కడవు వుంటావు. ఈ సామాన్లు దేనికిరా?"

"ఒక్కరికయినా, ఇద్దరికయినా ఖర్చు అయ్యేది తప్పదుగా" అన్నాడు.

"అన్నీ అవసరంకొద్దే కొన్నాను."

"అవసరానిదేం వుందిలే. యెంతుంటే అంతా! అటు అన్నకు కాళ్ళూచేతులా పిల్లలు. డబ్బు వెనకేసుకోకపోతే యెలా?" భోజనాలు అయ్యాయి.

"నిర్మలా! నా పక్క ఈ గదిలో వెయ్యి. వాడితో కబుర్లు చెప్పుకుంటూ పడుకొంటాను." నిర్మలకు నవ్వు వచ్చింది. పెద్దాయన కంటె తాపత్రయం మెందుకో, అరపై దాటుతున్నా బయటినుండి వస్తూనే, "అదేది?" అంటారు, అలాంటివారు కొడుకు కోడలికి అంతకాపలా!

"మీరు మంచంమీద పడుకోండి నాన్నా! నేను బయట పడుకుంటాను."

"జ్వరం వచ్చినవాడివి ఈపూటే లేచావ్. కిందెలా పడుకుంటావ్?" అతనికి పక్క వేసి, భోజనాలగదిలో తన పక్క వేసుకుంది నిర్మల. భోజనం చేయాలనిపించలేదు. మన

సంతా అవ్యక్తమయిన బాధతో గిలగిల లాడసాగింది. నిదు
కోసం ప్రయత్నించి విఫలురాలయింది.

దీపం చిన్నదిగా చేసింది. ఎంత ప్రయత్నించినా నిదు
రావటంలేదు. కాని కన్నీరు ఆగకుండా వస్తూంది.

చల్లగా కన్నీరు ఒత్తారు ఎవరో! కళ్ళెత్తి చూచింది
భాస్కర్ ప్రక్కన కూర్చునాడు.

"నిర్మా..." అతని కంఠం అనురాగంగా, ఆర్ద్రంగా
పలికింది. అతను చాచిన చేతులలో ప్రాణం లేనట్టు వా
పోయింది. వెక్కి వెక్కి ఏడవసాగింది. కొద్దిసేపు మౌనంగా
ఆమె తలపై గడ్డం ఆన్చి కూర్చున్నాడు.

"నన్ను క్షమించు నిర్మలా!" అన్నాడు మెల్ల
కంఠంతో.

"ఎందుకు?" అన్నది వెక్కుతూ.

"ఆ రోజు... నీకు తెలియదా? అంత చిన్న విషయా
నికి అలా రాద్ధాంతం కావటం నా కెంతో చికాకు కల్గింది
అతను మెల్లగా ఆమె ముఖం పైకి ఎత్తి కన్నీరు ఒత్తా

"మీారు భర్త. కొట్టే అధికారం మీాకుంది."

"నిర్మలా!" బాధగా వుంది అతని కంఠం.

"నాకేం బాధగా లేదు. స్త్రీకి ఇలాంటివి మామూ
లేగా!"

"నిర్మలా! నన్ను ఇంతేనా అర్థం చేసుకుంది? బాధ
లేదూ? మరి ఇంతగా చిక్కి, నల్లబడిపోయావేం?"

"........."

"మాట్లాడవూ?" ఆమె తల మెల్లగా హృదయా



ఆన్చుకున్నాడు. "నాకు తెలుసు. నువ్వు అభిమానవంతు
రాలివి. లోపల లోపల క్రుంగిపోయావు."

"అంత అర్థం చేసుకున్నవారు రోజుకో ఉత్తరం
రాశారు కదూ!"

"నీమీద కోపంతో కాదు. ముఖం చెల్లక ..."

"మీాకిలా అకస్మాత్తుగా జ్వరం ఎందుకు వచ్చింది?"

"జ్వరం రావడానికి కారణాలుంటాయా?" ఆమెను
దూరం జరిపి, ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు.
అతని తల నిమురుతూ, తన కన్నీరు ఎడంచేత్తో ఒత్తుకుంది.

"నాకు తెలుసు. రాత్రింబవళ్ళు ఆలోచించారుకదూ!
అన్నంకూడ సరిగ్గా తినలేదు."

"నీ కెవరు చెప్పారు?"

"కల పడింది" హాయిగా, తేలికగా నవ్వింది.

"రాముడు చెప్పాడు. వాడొకటే గోల. అమ్మగారిని
పిలుచుకురండని ... నిజంగా నేనెంత మూర్ఖుడినో ఇప్పుడర్థం
అవుతూంది, అక్కడ నిన్ను ఉంచడంవల్ల ఎవరం సంతోషం
పొందాం? ఎవరూ లేరు. వారికి తృప్తా! కాదు! యిటు
మనకా లేదు. కొన్ని విషయాలలో ఆది నిష్ఠూరమే మేలు
నిర్మలా!"

"ఉదయం మాట్లాడుకుందాం. నీరసంగా ఉన్నారు.
నిదురపొండి" అన్నది.

"నిన్ను చూడగానే నీరసం, అశాంతి అన్నీ ఎగిరి
పోయాయి. నామాట ఒకటి వింటావా?"

"చెప్పండి."

"నువ్వు భోజనం చెయ్యలేదు. లేచి పాలు త్రాగు."

అలాగే !" లేచింది, అతని తల దిండుపై పెడుతూ, నిర్మలకు బ్రతిమాలించుకోవడాలు, వేషాలు వెయ్యటం అంటే పరమ చిరాకు. మనసంతా దూది పింజలా తయారయింది.

## 9

నిర్మలతో కాపురం పెట్టాక పెద్దవారి నిష్ఠూరాలు భరించడం కష్టమనిపించింది.

"నాకు తెలుసు ! నా పిల్లలకు చాకిరి చెయ్యాలని కాక పోతే ఇప్పుడు వేరు కాపురం యెందుకూ ?" కంట తడిపెట్టుకుంది భాగ్యలక్ష్మి.

"నేను వాడిలాగే వెళ్ళాల్సింది, పెద్దలు, తల్లి తండ్రి అన్న గౌరవముండాలి" వెంకటరావు గొణిగాడు.

"మాయదారి కాలమమ్మా ! అలా వస్తానే యిలా మొగుడుని అంటిపెట్టుకోవాలంటారు ఆడవారు" అన్నది అన్నమ్మ.

"మన బంగారం మంచిదయితే ఒకరిని అనుకోవడం దేనికే ?" చిన్నారావు మధ్యలో త్రుంచివేశారు.

అన్నీ మౌనంగా విన్నాడు భాస్కర్. తన సామాన్లు సర్దుకుంది నిర్మల. ఎవరి ఆశీస్సులు లేకుండా జీవనరంగంలో కాలు మోపారు.

అలా అని సంబంధ, బాంధవ్యాలు త్రెంచుకోలేదు. ఆరు నెలలు భాస్కర్ డబ్బు ప్రతినెల యింటికి పంపాడు



దాన్ని సద్వినియోగం చేయటంలేదని ఒకటే బాధపడ్డాడు. ఒక నెలలో రెండువందలు పెట్టి భాగ్యమ్మ బనారసు చీర కొంది. తన పెళ్ళినాటిది పాత ఫ్యాషనుదట. రెండో నెలలో చంటివాడికి పుట్టువెంట్రుకలు తీశామంటూ ఖర్చు. మూడో నెలలో పెద్ద అబ్బాయికి అక్షరాభ్యాసం చేయించామని రాశారు.

"నిర్మలా ! యివన్నీ అవసరమంటావా ?"

"నాకేం తెలుసు ?"

"చెబుదూ ! పిల్లలు పెరిగే నాటికి ఒక చిల్లి గవ్వ కూడా మిగలదు అనుకుంటాను."

"అందుకేం సందేహం లేదు."

"మరేంచేద్దాం అంటావు ?"

"బావగారి చేత ఇన్సూర్ చేయించుదాం. ప్రీమియం మనం కడితేసరి."

"బావుంది అయిడియా." ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంటును తీసుకుని ఊరు వెళ్ళాడు. అన్నగారిచేత పదివేలకు పాలసీ, తనో పదివేలకు తీసుకుని, రాతలు కోతలు పూర్తి చేయించి తృప్తిగా నిట్టూర్చాడు.

"కోడలికి... కడుపు...అది..." పూర్తి చేయలేకపోయింది, అన్నమ్మ.

"ఆఁ ! వాళ్ళ కేందుకత్తా! హాయిగా ఉన్నారు. పిల్లా పీచు అంటూ యాతన. ఏమిటో నా అదృష్టం నేను చెప్పినట్టు ఆయన విన్న దెప్పుడు ! పెంచే వాడిని నేనుండగా,

నీకేం అంటారాయె" భాగ్యమ్మ సగం అక్కసుగా, సగం వ్యంగ్యంగా అంది.

"మరింకేం వదినా! బాధ యెందుకు?" తేలికగా తీసి పారేశాడు.

"అమ్మా! అలాంటి శుభవార్త వుంటే నీకు రాస్తాను."

"అది కాదురా. ఓసారి వెళ్ళి డాక్టరుకు చూపించు."

"తొందరేం వచ్చిందమ్మా?"

"అయ్యో మరిదిగారూ! ఈపాటికి నల్గురు పుట్టాల్సింది. నాకు సరిగ్గా పెళ్ళయి పది నెలలలో కాన్పు వచ్చింది."

"నిజమే వదినా! అందరూ ఒకలే కారుగా." భాస్కర్ వారిని తప్పించుకొని వచ్చేశాడు. యెంతో ధైర్యంచేసి యిక తను పంపనని భీమా కిస్తులు మాత్రం కడతానని రాశాడు. అన్నింటికి సిద్ధపడే రాశాడు. కాబట్టి వారు వేసిన నిందలకు నిష్ఠూరాలకు జడువలేదు. తల్లికి మాత్రం పాతిక, యిరవై పంపేవాడు. ప్రతిఉత్తరంలోను పిల్లల చదువు విషయము రాసేవాడు.

"మీ సమస్యలు తీరాయి. నా సమస్య మిగిలి పోయింది."

"ఏమిటో!"

"నా బి. ఏ." అంది.

"నాకు భయంగా వుంది. ఆ ధ్యాసలో మేం గుర్తుంటామా?"

"పోదురూ! అలాంటి అనుమానం వచ్చిన రోజు



మాన్పించివేద్దురు. ఆశ, అవకాశ మున్నప్పుడు మానటం దేనికి? ప్రతి ఒక్కరికీ స్వతంత్రంగా బతికే శక్తి రావాలి."

"సమాన హక్కు లనరాదు?"

"ఏదయినా అనుకోండి"

"ఇంకేం ఓ వ్యాసం రాసి పడెయ్యి."

"వ్యాసాలు రాసేంత జ్ఞానం రాలేదు లెండి. సమాన హక్కు లనగానే- మొగుడు పిల్లలను కనాలి, వంట చేయాలని కాదు. కనీసం అవసరమయితే చేయూత నివ్వాలని."

"సదుద్దేశమే."

"వేళాకోళం అక్కరలేదు"

"ఆడబుద్ది పోనిచ్చుకున్నావు కాదు. కాంప్లిమెంట్ అనరాదూ?"

"మొగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు..."

"ఆపు...ఆపు. మీ అక్కయ్య నీకు పిల్లలు లేరని ఒకటే ఆరాటపడుతూంది."

"ఏ అక్కయ్య? మా భాగ్యలక్ష్మేనా?"

"మరింకెవరు!"

"పాపం! అమాయకురాలు, మారుతున్న కాలానికి ఎదురు ఈదాలనుకుంటుంది" జాలిగా అంది. అలా కులాసాగా, జాలీగా కాలం వెళ్ళిపోతుంది. భాస్కర్ కు ఊహించలేనంత శాంతిగా వుంది. తన ఊహాలకు పూర్తిగా రూపకల్పన నిర్మల. అలాంటి అదృష్టం యెందరు పురుషులకు వుంటుంది?

# 10

"ఎలా వున్నాడు మన అబ్బాయి ?"

"అచ్చు నీలాగే."

"రూపం నాదయినా గుణంమీది వస్తే..."

"ఏం నీ గుణానికి ? నీకో శుభ వార్త చెప్పనా ?"

"నాకు తెలుసు"

"ఏమిటో ?"

"నేను బి.ఏ. పాసయ్యాను. అంతేనా ?"

"నీ కెలా తెలుసు ? యింకా ప్రెస్సుకు రాందే." ఆశ్చర్యంగా చూశాడు భార్యవంక.

"మీ కళ్ళల్లోని మెరుపు చూసి వూహించాను. కొడుకును చూశాక. యింకా సంతోషింపదగ్గ శుభవార్త లేముంటాయి ?"

"ఓహో! అయితే బి.ఏ. స్వంతంగా పాసయ్యావని ఒప్పుకుంటాంలే" అన్నాడు హాస్యంగా.

"ఇంతవరకు కాపీకొట్టానని అనుకున్నారా?"

"ఏమో?"

"స్వానుభవం అయితే నా జవాబు ఏంలేదు."

"చూడు యింత శుభవార్త చెబితే ఏదయినా బహుమతి___"

"నిజమే, మరిచిపోయాను. యేది, చేతులు చాపి కళ్ళు మూసుకోండి" అతనలాగే చేశాడు. వెంటనే పొత్తిళ్ళలో పసివాడిని యెత్తి అతని చేతులలో పెట్టింది. అతను నవ్వుతూ కళ్ళు విప్పాడు.



"నిజంగా అపురూపమయిన బహుమతే సుమా!"

"బయటికి రా భాస్కర్ ! మా స్నేహితులు చూస్తారట!" నిర్మల అన్నగారు పిలిచారు.

"మీ అన్నగారు నన్ను కొత్త పెళ్ళికొడుకును చేశారే!" నవ్వుతూ బయటికి వెళ్ళాడు.

భాస్కర్‌కు అయాచితంగా వచ్చే వస్తువులంటే చికాకు. ప్రతిదీ కష్టపడి సంపాదించుకోవాలనే తత్వం. అత్త గారింటి రేడియోలు, వాచీలు, సూట్లు కావాలని వెలితిపడే వ్యక్తి కాదు. ఏ పండుగకు రమ్మన్నా వద్దని యేదో సాకు పెట్టి తప్పించుకున్నాడు. ఈసారి రాక తప్పలేదు. వస్తూనే వేడుకల పేరిట అనవసరంగా ఖర్చు పెట్టవద్దని చెప్పాడు. పెద్దవారికి పురుడూ, పుణ్యం అని పట్టింపు లుంటాయని తెలుసు. అందుకే వారు శ్రీపురం కబురు చేశారు. నిర్మల అన్న వెళ్ళి స్వయంగా ఆహ్వానించి వచ్చాడు.

సాయంత్రానికల్లా అందరూ వచ్చారు. చిన్నారావు యిష్ట ప్రకారంగా మనుమడికి వాసుదేవరావు అని నామకరణం చేశారు. నిర్మల తల్లి దండ్రులు మనుమడికి ఓ జత బంగారు మురుగులు బహూకరించారు! దంపతులకు కొత్త బట్టలు పెట్టారు. వేడుక ముగియగానే అన్నమ్మ ముఖం మాడ్చుకుంది, భాగ్యలక్ష్మి ముఖాన్నే అడిగింది.

"ఏమమ్మా నిర్మలా తొలి మనుమడు కదా! మీ పుట్టింటివారు ఇంత నాసిగా చేశారేం ?"

"తొలి మనుమడెందుకయ్యాడు అక్కా! వారి కింకా లేరా ?"

"మాట ఎలా తిప్పాలో తెలిసి చావదు. మనకు తొలిచూలు అన్నాను!" అంది.

"మనకు ఆరో వాడు!" చిరునవ్వుతో చూచింది.

"పెద్దమ్మాయి భారతి పుట్టినప్పుడు మా వాళ్ళు యెన్ని వేడుకలు చేశారని ... అత్తకు, మామకు బట్టలు పెట్టారు."

"ఒకరొకరి అదృష్టం, అవకాశం అక్కయ్యా! అందరూ ఒకేలాగుంటారా?"

"అత్తయ్యకు కోపం వచ్చింది."

నిర్మల మరేం మాట్లాడలేదు. తను డబ్బిచ్చి పుట్టింటి గొప్ప చాటుకునే నీచానికి దిగలేదు.

"మీ అన్నయ్య కూడా సంపాదిస్తాడేమో?"

"ఆయనకు కుటుంబం వుంది."

"పాపం! ఇంట్లోకి ఏమీ ఇవ్వడా?"

"అవసరం అయితే యిస్తాడు."

"తండ్రి వుండగా అవసరాలతో యేం పని? అంతా అతని చేతిలో పోసి తన అవసరాలకు అడగాలిగాని, ఏమోనమ్మా! క్రొత్త పద్ధతులు. మాకేం తెలుసు?" నిర్మల సంభావణ పెంచకపోవడంతో భాగ్యలక్ష్మి మౌనం వహించక తప్పలేదు.

మంచి జరుగుతుంది అనుకుంటే నిష్టూరాలు, నిందలు భరించడం నిర్మలకు అలవాటే! తన కొడుకును ముద్దుగా 'వాసూ' అని పిలుచుకునే వారు! వాడుకు మూడో నెల రాగానే భర్త వెంబడి ప్రయాణం అయింది నిర్మల.



"మొదట వూరికి తీసుకురమ్మని అమ్మ చెప్పింది నిర్మలా!"

"తల్లిదండ్రులమాట తప్పవద్దని నా మనవి. శ్రీపురమే పోదాం!" వారు ప్రయాణం అవుతుండగా నిర్మల తల్లి క్రొత్త బట్టల ప్యాకెట్టు తెచ్చి కూతురికిచ్చింది.

"ఎందుకమ్మా?"

"జీవితాంతం నీకు ఎత్తిపొడుపు వుండకూడదు తల్లీ! ఇవి మీ అత్తగారికి ఇవ్వు."

"ఆనాడే యివ్వాల్సిందమ్మా!"

"ఫరవాలేదు, క్షమించమన్నానని చెప్పు!" లడ్లూ, పళ్ళూ, పసుపు, కుంకం ఇచ్చింది.

"నిర్మలా!"

"ఏమన్నయ్యా?"

"ఇదిగో నీ బహుమతి!"

"యేం బహుమతి అన్నయ్యా?"

"ఆఖరి చెల్లెలవి కష్టపడి బి. ఏ. పాసయ్యావు. ఈ వాచీ తీసుకో."

"ఎందుకన్నయ్యా? మీ ఆశీస్సులు చాలు."

"ఆశీస్సులు ఎప్పుడూ వుంటాయి తల్లీ! వాడు ముచ్చటపడి యిస్తున్నాడు తీసుకో!" తండ్రి అనటంతో ఇక కాదనుకుండదని తీసుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'ఈ ఆదరాభిమానాలు కలకాలం ఇలాగే ఉండేటట్టు చూడు భగవాన్' అనుకుంది. అందరికీ నమస్కరించి బయలుదేరింది.

అత్తగారిల్లు చేరిన నిర్మల మనసంతా అశాంతిగా తయారయింది. అత్తా తోడికోడలు ఒకటే విసుర్లు.

"ఆనాడు పదిమందిలో లేని లాంఛనాలు మీ అమ్మకీనాడు తెలిసివచ్చాయా ?"

"పోనీలేం డత్తా! మనము బాధపడతామని తనే తెచ్చిందేమో ? మన విషయాలు మనం బయట పెట్టుకుంటామా ? మొగుడు సంపాదిస్తున్నాడు. ఏమన్నా చెల్లుతుంది." పిర్ర గిల్లి జోలపాడిన చందం వుంది భాగ్యమ్మ సమర్థింపు.

"అక్కయ్యా! కామెర్లరోగి సామెతలా మాట్లాడకండి. నాకంత ఖర్మ ఏం పట్టలేదు."

"అమ్మోయ్! నేనేమన్నానమ్మా తల్లీ! యేదో మొదటి పండక్కి పిలవని పుట్టింటి వారు వాచీలు, గీచీలు కొనిపెట్టారంటే ..." నసిగింది.

"నమ్మకం కలుగటం లేదు. అంతేనా ? ..."

"ఏమిటే ? చిన్నంతరం పెద్దంతరం యేం లేదా ?" అన్నమ్మ కసురుకోవటంతో ఇవతలికి వచ్చింది.

## 11

బి. ఇడి. పరీక్షలు వ్రాశాక ఊపిరి పీల్చుకుంది నిర్మల. ఇద్దరు పిల్లలు, మళ్ళీ గర్భిణి. అవకాశం కల్సిరావటంతో పిల్లలకు పనిమనిషిని పెట్టి కాలేజీలో చేరింది. భాస్కర్ వరంగల్ ట్రాన్స్‌ఫర్ కావటంతో కాలేజీలో చేరింది. అ



గారి వైపు వారికి యింకా తెలియదు. పరీక్షలప్పుడు మాత్రం తల్లికి చెప్పి, పిలిపించాల్సి వచ్చింది.

"అమ్మా! నాన్నగారేం అవస్థపడుతున్నారో ఓసారి వెళ్ళిరా."

"కోడలుందిగా !" నిశ్చింతగా అంది సత్యమ్మ. "అక్కడికి రానంటావు, ఈ పురుడు అయ్యాక వెడతాను."

"అమ్మా !"

"ఏమిటి తల్లీ !"

"ఈసారి ఆపరేషన్ చేయించుకుంటాను."

"అదేమిటే ! అప్పుడే ముసలిదానివి అయ్యావా ?"

"ముసలి, పడుచు కాదమ్మా సమస్య !"

"మరేమిటే ?"

"మనకెన్ని యెకరాల పొలం ఉండేది ?"

"అదేం ?"

"నాన్న ఒక్కరికి పాతిక యెకరా లుండేవి, ఆయన ఆరుగురు సంతానానికీ అన్ని యెకరాలు వచ్చిందా ? పరిమితి కుటుంబము. ఒక కుటుంబ సమస్య కాదమ్మా! దేశంలోని కొరకరాని సమస్య పెరిగే జనాభాను అరికట్టాలి."

"ఏమో ! నీ యిష్టం. భాస్కర్ యిష్టపడవద్దూ ?"

"ఆయన అంగీకరించారమ్మా ?"

"మీ యిష్టం తల్లీ! పిల్లలను పెంచి పెద్ద జేసే బాధ్యత మీది. మిమ్మల్ని పెంచాం, ఓ యింటివారిని చేశాం. మీరు నాల్గు కాలాలపాటు కలకలలాడితే చూడాలని

తప్పితే మిమ్మల్ని జీవితాంతం ఆజ్ఞాపిస్తూ, శాసిస్తూ పెద్దరికం నిలుపుకోవాలని కాదమ్మా."

"భలేగా చెప్పావమ్మా!" నిర్మల నవ్వింది. "అందరు పెద్దలు నీలా ఆలోచిస్తే యెంత బావుండును? నీకు గుర్తుందో లేదో పెద్దక్కయ్య పరికిణీలు అందరు అక్కలకు మారి నా వరకు వచ్చాయి. మాకు దొరికిందే చాలు అనుకున్నాం. అది పాతదా, కొత్తదా? ఎవరిది? అని ఆలోచించ లేదు. నువ్వే చూస్తున్నావుగా వాసుకు చిన్నవి అయిన డ్రస్సులు చందుకు వేస్తుంటే యెంతగోల అవుతుందో?"

"నిజమే తల్లీ! నీ పిల్లల్లాంటి పేచీకోర్లు మీరయితే నేను మిమ్మల్ని పెంచలేకపోయేదాన్ని. తీరిక లేకపోతే ఒక కంచంలో అన్నం కలిపి, చుట్టూ మిమ్మల్ని కూర్చొబెట్టే దాన్ని. ఒక్కనాడయినా పేచీ యెరుగును. నీ చిన్నవాడు గండుచీమ తల్లీ! ప్రతిదీ పెద్దాడితో వంతే."

"నా పిల్లలే కాదమ్మా! ఈ తరమే అంత. స్వార్థం, తెలివితేటలు యెక్కువ అవుతున్నాయి."

"అవును." అలా మాట్లాడుతూనే నడుము వాల్చి కునికుంది సత్యమ్మ. భాస్కర్ వస్తే నిర్మలే వడ్డించింది.

"కుట్టుమిషన్ గూర్చి కనుక్కున్నారా?"

"ఊహుఁ."

"అదేం మీకు అంతలా చెప్పాను."

"ఇప్పుడప్పుడే కాదు. నీ ప్రసవమయి, ఆపరేషన్ అయి, పాపో, బాబో ఓ సంవత్సరం వారయ్యాక కుట్టుమిషన్ వస్తుంది, నీకు ఉద్యోగమూ వస్తుంది."



"అంతవరకూ నేను గోళ్ళు గిల్లుకోవాలా?"

"అబ్బే! అవి యెన్నాళ్ళు వస్తాయి? ..." కొంటెగా నవ్వాడు.

"నేను సీరియస్‌గా చెబుతుంటే మీకు నవ్వులాటగా వుందా?"

"నేను డబుల్ సీరియస్‌గా చెబుతున్నాను. నీకు ఇంకా శ్రమ యివ్వలేను. నువ్వు జబ్బు పడితే హాస్పత్రి చుట్టూ తిరగలేను." ఖచ్చితంగా వుంది సమాధానం.

"మొండివారితో వాదించి యేం లాభం?" కోపంగా అనబోయి నవ్వేసింది. వంటఇంట్లోనుండి యిద్దరూ బయటి గదిలోకి వచ్చారు. చందు యెప్పుడు లేనంత బుద్ధిగా కూర్చున్నాడు. వాసు ఇంకు బాటిల్‌లో చేయిపెట్టి, చక్కగా నాడి ఒళ్ళంతా పెయింట్ చేస్తున్నాడు.

"వాసూ!"

"ఊఁ!"

"ఇదేం పనిరా?"

"బొమ్మలు ..." అన్నాడు సీరియస్‌గా.

నిర్మల నవ్వింది మురిపెంగా.

"బొమ్మలు తమ్ముడి ఒంటి మీద వెయ్యరమ్మా. యిదిగో కాగితం." ఓ తెల్ల కాగితం యిచ్చి ఓపికగా అంతా అర్ధం చేసి, చందు ఒళ్ళు కడిగి వేరే బట్టలు మార్చి వచ్చింది. భాస్కర్ అలాగే గుమ్మంలో నిల్చుని చూస్తున్నాడు.

"ఏమిటలా చూస్తున్నారు?"

"చందు, వాసుల అదృష్టం."

"అదేమిటండోయ్! అదృష్టమా, అదెలా ఉంటుంది?"

"అచ్చం నీలా!"

"ఈరోజు ఆఫీసులో ఏదయినా పార్టీ అయిందా?"

"పార్టీలు అయినా త్రాగనని నీకు తెలుసు. నిజం నిర్మలా! యింకో తల్లయితే ఈపాటికి నాల్గు బాది వదిలేది పిల్లలను. ఎంతమంది స్త్రీలకు ఇలాంటి విషయాలలో సహనం ఉంటుంది చెప్పు?"

"ఎంత మంది పురుషులకు మీలా నిశితంగా ఆలోచించి అడుగడుగునా ప్రోత్సాహమిచ్చే ఓపిక వుంటుంది చెప్పండి?" అన్నది, భుజం మీద జోగుతున్న కొడుకును పడుకోబెడుతూ. స్త్రీలో దాగిన అసంతృప్తి! ఆ వేదన పిల్లల పట్ల బయటపడుతుంది. వారిని నాల్గు తన్ని, తృప్తి పడుతుంటారు.

అతను వచ్చి మరో దిక్కు మంచంపై పడుకున్నాడు.

## 12

చంటిపాపను అత్తగారికిచ్చి, నమస్కరించింది నిర్మల. అన్నమ్మ పిల్ల నెత్తుకుంది. పరీక్షగా చూసింది.

"నీ పోలికలే. మా పోలికలు అసలు రాలేదు." అన్నది మూతి విరుస్తూ అన్నమ్మ.

"యెవరి పోలికయితే ఏంలే యిద్దరన్నల తరువాత పుట్టింది, అదృష్టవంతురాలు" భాగ్యమ్మ పాపను నిశితంగా చూస్తూ ఓ విసురు విసిరింది. దంపతులు చిరునవ్వుతో విన్నారు.



"నామకరణోత్సవం అయిందని రాశావ్. ఏం పేరు పెట్టారు?"

"నందిని అని పెట్టుకున్నాం అమ్మా!"

"మీ అత్తగారికి తాహతు లేకపోతే మాకు లేదా? అలా అలగాజనంలా పేరు పెట్టుకోవట మేమిట్రా?"

"ప్రతిసారి పండుగలు, వేడుకలు యెలా కుదురుతాయమ్మా?"

"వచ్చే డబ్బంతా ఏమవుతుంది మరిదిగారూ?"

"మీకు తెలియదేమో? మేం నోట్లు తింటున్నాము వదినా!"

"అయ్యో! తినండి నాయనా, మీ ఇష్టం. యెవరొద్దన్నారు?" రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. అప్పటికే భాగ్యలక్ష్మికి ఏడుగురు పిల్లలు. మళ్ళీ కడుపుతో ఉంది.

రెండురోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. ముచ్చటగా, ముద్దుగా, శుభ్రంగా వున్న యిద్దరు మనుషులతో కాలం గడపటం చిన్నారావుకి సరదా. అది చూచి వెంకటరావు, భాగ్యమ్మ అసూయతో మండిపోయారు.

"ఒరేయ్ దరిద్రులూ! యిలా రండిరా. మీ అయ్య సంపాదిస్తాడా? మీ అమ్మ చదువుకుందా? మీరంటే అందరికీ విషమే." పిల్లల్ని పట్టుకు బాదేసింది. యిద్దరు మొగపిల్లలు, మిగిలినవారంతా ఆడపిల్లలే. పెద్దబ్బాయి పేరు శ్రీకృష్ణాంజనేయ వరప్రసాదరావు, రెండో అతని పేరు నిర్మల బలవంతంతో సుధాకరరావని పెట్టారు. ముద్దుగా ప్రసాద్, సుధాకర్ అని పిలుస్తారు. ఇద్దరూ తల్లి గారాబంతో మొండిగా

"అదేమిటండోయ్! అదృష్టమా, అదెలా ఉంటుంది?"

"అచ్చం నీలా!"

"ఈరోజు ఆఫీసులో ఏదయినా పార్టీ అయిందా?"

"పార్టీలు అయినా తాగనని నీకు తెలుసు. నిజం నిర్మలా! యింకో తల్లయితే ఈపాటికి నాల్గు బాది వదిలేది పిల్లలను. ఎంతమంది స్త్రీలకు ఇలాంటి విషయాలలో సహనం ఉంటుంది చెప్పు?"

"ఎంత మంది పురుషులకు మీలా నిశితంగా ఆలోచించి అడుగడుగునా ప్రోత్సాహమిచ్చే ఓపిక వుంటుంది చెప్పండి?" అన్నది, భుజం మీద జోగుతున్న కొడుకును పడుకోబెడుతూ. స్త్రీలో దాగిన అసంతృప్తి! ఆవేదన పిల్లల పట్ల బయటపడుతుంది. వారిని నాల్గు తన్ని, తృప్తి పడుతుంటారు.

అతను వచ్చి మరో దిక్కు మంచంపై పడుకున్నాడు.

## 12

చంటిపాపను అత్తగారికిచ్చి, నమస్కరించింది నిర్మల. అన్నమ్మ పిల్ల నెత్తుకుంది. పరీక్షగా చూసింది.

"నీ పోలికలే. మా పోలికలు అసలు రాలేదు." అన్నది మూతి విరుస్తూ అన్నమ్మ.

"యెవరి పోలికయితే ఏంలే యిద్దరన్నల తరువాత పుట్టింది, అదృష్టవంతురాలు" భాగ్యమ్మ పాపను నిశితంగా చూస్తూ ఓ విసురు విసిరింది. దంపతులు చిరునవ్వుతో విన్నారు.



"నామకరణోత్సవం అయిందని రాశావ్. ఏం పేరు పెట్టారు?"

"నందిని అని పెట్టుకున్నాం అమ్మా!"

"మీ అత్తగారికి తాహతు లేకపోతే మాకు లేదా? అలా అలగాజనంలా పేరు పెట్టుకోవట మేమిట్రా?"

"ప్రతిసారి పండుగలు, వేడుకలు యెలా కుదురుతాయమ్మా?"

"వచ్చే డబ్బంతా ఏమవుతుంది మరిదిగారూ?"

"మీకు తెలియదేమో? మేం నోట్లు తింటున్నామ నదినా!"

"అయ్యో! తినండి నాయనా, మీ ఇష్టం. యెవరొద్దన్నారు?" రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. అప్పటికే భాగ్యలక్ష్మికి ఏడుగురు పిల్లలు. మళ్ళీ కడుపుతో ఉంది.

రెండురోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. ముచ్చటగా, ముద్దుగా, శుభ్రంగా వున్న యిద్దరు మనుషులతో కాలం గడపటం చిన్నారావుకి సరదా. అది చూచి వెంకటరావు, భాగ్యమ్మ అసూయతో మండిపోయారు.

"ఒరేయ్ దరిద్రులూ! యిలా రండిరా. మీ అయ్య సంపాదిస్తాడా? మీ అమ్మ చదువుకుందా? మీరంటే అందరికీ విషమే." పిల్లల్ని పట్టుకు బాదేసింది. యిద్దరు మొగపిల్లలు, మిగిలినవారంతా ఆడపిల్లలే. పెద్దబ్బాయి పేరు శ్రీకృష్ణాంజనేయ వరప్రసాదరావు, రెండో అతని పేరు నిర్మల బలవంతంతో సుధాకరరావని పెట్టారు. ముద్దుగా ప్రసాద్, సుధాకర్ అని పిలుస్తారు. ఇద్దరూ తల్లి గారాబంతో మొండిగా

తయారయ్యారు ప్రతిదానికి ఆడపిల్లలను కొడతారు. వారు పెద్దలతో ఫిర్యాదు చేస్తే మొగపిల్లలను వెనుకేసుకు వచ్చి, ఆడపిల్లలనే నాల్గు అంటారు.

"కొడితే యేమయింది? ఆదిశక్తుల్లా పెరుగుతున్నారు. రేపు వీళ్ళకు పెళ్ళీ పేరంటం చెయ్యాల్సింది వాడేగా?" నాయనమ్మ సమర్థింపు.

"ఆడమేళం! తన్నాలా, చంపాలా? రాక్షసుల్లా పుట్టుకు వస్తారు. కావాలని ఎవడేడ్చి చచ్చాడు? రోజూ ఒక రొన్నకరు అంటిపెట్టుకునే దంపతులకు పుట్టరు ఖర్మ!"

ఆడపిల్లలను తండ్రిని చూస్తే హడలు. తప్పెవరిదయినా ఆడపిల్లలను కాలితో రాస్తేనే అదుపులో ఉంటారనే తత్వం వెంకటరావుది.

"అమ్మా! చిన్నముండ ఏడుస్తూంది." వాసు కేక విని ఉలిక్కిపడింది నిర్మల.

"ఏమిట్రా అన్నావ్?"

"చిన్నముండ ఏడుస్తూంది ..." అంతే వాసు చెంపపై అయిదు వేళ్ళు ముద్రింపబడ్డాయి.

"ఏమిటో ఈసారి చెప్పు?"

"చెల్లి యేడుస్తూందమ్మా!" అన్నాడు వెక్కుతూ.

"మరోసారి అలాంటిమాట లంటావా?"

"లేదమ్మా?" వాసును మొదటిసారి దెబ్బ వేసింది ఆమె హృదయం గిలగిల లాడిపోయింది.

"ఆడముండను ముండ అనక ఏమంటారు చిన్నమ్మా?



"ఇదిగో ప్రసాద్! చిన్ననోట పెద్దమాటలనకూడదు. ఆడపిల్ల ముండ యెలా అయింది బాబూ?"

"కాక? రేపు కొంప దోచుకుపోదూ?"

"మరి నీ కోసం వచ్చే భార్య పుట్టింటి నుండి తీసుకు రాదూ?"

"తేస్తేనేం?"

"అలాగే నీ చెల్లి, అక్క, తోబుట్టిన వారిని అలా అనొద్దు ప్రసాద్! ప్రేమగా చూడాలి" నచ్చచెప్పబోయింది అ ఇంట్లో ఆడపిల్లలంటే ఓ మనిషిగా చూసే వ్యక్తి ఒకరున్నారని భారతి సంతోషంగా విప్పారిన నేత్రాలతో పిన్ని వంక చూసింది. ఇంట్లో పెద్దవారంతా వింటూనే ఉన్నారు.

"ముండా అన్నాడని అంత దెబ్బ వేస్తారా?" అన్నమ్మ నిలదీసింది.

"ఈరోజు నోరు మూయించకపోతే రేపు అందరినీ అంటాడు." అని తన పనిలోకి వెళ్ళిపోయింది. భాగ్యలక్ష్మికి తన స్థానం యేదో పోయినట్టూ, తనంటే యెవరికీ లక్ష్యం లేనట్టు అన్పించసాగింది. భారతి మిగిలిన ఆడపిల్లలు అందరికి మొండిగా జవాబులు ఇచ్చినా, నిర్మల ఏం చెప్పినా వింటారు. ప్రసాద్, సుధాకర్ మునుపటిలా ధూం ధాం అనరు. నిర్మలను చూస్తే గౌరవంగా ప్రవర్తిస్తారు.

"కొంచెం ఈ లెక్కలేమిటో చూడమ్మా!" ప్రేమగా చిన్నారావు పిలుస్తాడు.

"నీ చేతి వంట బాగా కుదురుతుందే!" అని అన్నమ్మ మనుమరాలిని యెత్తుకుని కూర్చుని, కోడలికి గంటె ఇచ్చింది.

"వచ్చేవారం వెళ్ళిపోవాలమ్మా!" భాస్కర్ తల్లి దగ్గర కూర్చున్నాడు కూతురి కేరింతలు చూస్తూ.

"నువ్వు వెళ్ళరా. వాళ్ళంతా మరోనెల వచ్చి వుంటారు. నిర్మల వచ్చిన దగ్గర నుండి కాస్త విశ్రాంతిగా వుంది."

"అక్కడికే వచ్చి వుండరాదమ్మా."

"ఈ బొందిలో ప్రాణం వుండగా ఇల్లు విడవటం కుదరదు."

ఈ విషయాలు విన్న భాగ్యమ్మ రాజ్యం కోల్పోయిన మహారాణిలా అవకాశం కోసం కాచుకుంది.

మర్నాడు పనిమనిషికి జబ్బుచేసి రాలేదు. నిర్మల నీళ్ళు తోడుతోంది. అటు వెడుతున్న భాస్కర్ బావి దగ్గర ఆగాడు.

"బరువులు లేపటం అవీ చెయ్యొద్దని డాక్టరుగారు చెప్పలేదా?"

"బేబీ చిన్నదేనండీ."

"యెంతయినా ఆపరేషన్ చేయించుకుని మూడునెలలే అయింది. జరుగు నేను తోడుతాను."

"మీకో నమస్కారం పెడతాను. ఇది పెద్ద లున్న యిల్లు. నాకేం కాదు. వెళ్ళండి!" ఆమె మాటలు పెరటి గుమ్మంలో నిల్చున్న తోడికోడలి చెవిలో పడ్డాయి. వెంటనే నిశ్చింతగా నిట్టూర్చింది.



నందిని పొత్తిళ్ళు ఆరేసి పిల్లలందరికీ నీళ్ళుపోసి ఇంట్లోకి వచ్చింది. అన్నమ్మ ఆడపులిలా చూసింది కోడలి వంక.

"ఆగు."

"ఏమత్తయ్యా!"

"పిల్లలు కాకుండా ఆపరేషన్ చేయించుకున్నావా?"

తీవ్రంగా వుంది ప్రశ్న. నిర్మల నిదానంగా అత్తను, తోడికోడలిని మార్చి మార్చి చూసింది. భాగ్యమ్మ తను విన్న మాటలు, యింకా యెలాంటి మాటలతో బలపరచాలో ఆలోచిస్తూంది.

"చెప్పవేం?"

"అవును. చేయించుకున్నాను"

"ఆఁ!" క్షణం నిర్ఘాంతపోయింది. "తక్షణం నా యింట్లోంచి వెళ్ళిపో. నాకు ఒక్కడే కొడుకనుకుంటాను" గుమ్మం చూపింది.

"నా ఇంటికి శనిలా దాపురించావు కదే! ఈ అప్రాచ్యపు పని ఇంటా వంటా లేదు. విన్నారండోయ్..." మరు క్షణంలో ఇల్లంతా యుద్ధభూమిలా అయింది. భాగ్యమ్మకు యెంతో అందంగా, ఆనందంగా వుందా దృశ్యం. హిమాలయ శిఖరాగ్రం చేరుకున్న అద్భుతంగా వుంది.

"ఏమిట్రా ఇది నీకు పుట్టిన బుద్ధేనా?"

"తప్పేముంది నాన్నగారూ? కాలంమారుతూంది. కని గాలికి వదిలేసే కంటే..."

"ముయ్యరా నోరు. ప్రకృతిని కాదనడానికి నువ్వెవడివిరా?"

"అవునురా భాస్కర్! నారు పోసినవాడు నీరు పోయడా? మన ఇంటా వంటా యెరుగుదుమా? నీ కెంత ధనం వుంది. యెంత పొలం వుందని యెవరూ అడగరురా? నీ కెందరు పిల్లలు అనే అడుగుతారు" వెంకటరావు కల్పించుకున్నాడు.

"యెవరో అడుగుతారని మన జీవితం ముళ్ళపొద చేసుకుంటామా అన్నయ్యా?"

"ఎవడురా నీకన్నయ్య! వెళ్ళు తక్షణం వెళ్ళు" తనంత యెత్తు కొడుకును మెడపట్టి గెంటాడు.

"అలాగే వెడతాను నాన్నగారూ! నేను చేసినపని తప్పు కాదని నాకు తెలుసు. మీకూ త్వరలోనే తెలుస్తుంది. నా స్కాలర్ షిప్ కాక ఇంతో అంతో ఇంట్లో డబ్బు వాడారు. దానికి బదులుగా నా పొలం అంతా పది సంవత్సరాలు నీకు వదులుతాను."

"పొలమా? సూదిమొన మోపినంత కూడా రాదురా."

"నాన్నగారూ! అనవసరంగా ఆవేశపడకండి. అది తాతలు సంపాదించిన పొలం. నాకు భాగం వచ్చి తీరుతుంది" అని ఇంట్లోకి వెళ్ళాడు.

"నిర్మలా! ఒక గంటలో తయారవ్వు. డాక్టరు గారిని అడిగి జీపు తెస్తాను" అతను చర చర బయటకు వెళ్ళిపోయాడు.

అన్నమ్మ శాపనార్ధాలకు భాగ్యలక్ష్మి వంత పాడుతూంది. మొగవారు చదువుకున్న ఆడదారికి శీలం వుండదని



తిడుతూనే వున్నారు. నిర్మల సర్దుకుంది. మిట్టమధ్యాహ్నము భోజనాల వేళ ఆకలితో ఇల్లువిడిచారా కుటుంబం. సాగనంపటానికి దొంగతనంగా భారతి మాత్రం బయటకు వచ్చింది. పాలేరు అంజయ్య సామానులు తీసుకుని, తనూ జీపులో కూర్చున్నాడు.

"నువ్వెక్కడికోయ్?"

"బస్సుదాకా దొరా! మిమ్ము నా భుజాలపై పెంచానా? తీపి!"

యెందుకో భాస్కర్ కళ్ళు చెమర్చాయి. వారిని బస్సు యెక్కించి, పండ్లబుట్ట, పాలచెంబు పెట్టాడు.

"ఇవన్నీ యెందుకు?"

"చిన్న దొరలకు." నిర్మల పదిరూపాయలు తీసి అతని చేతిలో పెడుతుండగానే బస్సు కదిలింది.

"నాన్నా! నేను పెద్దయి... తాతతో పోట్లాడుతాను" వాసు దిగులుగా వున్న తండ్రికి ధైర్యం చెప్పాడు.

## 13

"నిర్మలా!"

భర్త పిలుపు విని తలెత్తింది. బండి ఊళ్ళోకి వచ్చింది సర్దుకుని కూర్చుంది.

"అంతలేసి ఆలోచనలు ఏమున్నాయ్?"

"యేదో గడిచిన కాలం ..."

"మరచిపోతే అందరికీ శ్రేయస్కరము!"

"ఈ విషయంలో మీరు నిశ్చింతగా వుండండి." అన్నది హామీయిస్తూ.

నందినికి ఏం తోచలేదు. వాగ్బాణాలు విసురుకునేం దుకు సందులేదు. అతను నడుస్తున్నాడు.

"చిన్నదొరయి బాగా యెదిగారు రాయన దొరా!"

"ప్రసాద్ యేదయినా పని చేస్తున్నాడా ?"

"సూత్తారుగా !" అని యెడ్లను అదిలించాడు. నిర్మల ఆ ఊరు హైస్కూల్‌లో పని చేస్తుంటే తండ్రి సహించ గలడా ? అదే ఆలోచిస్తూ నడుస్తున్నాడు భాస్కరరావు. ఇంటిముందు బండి ఆగగానే అన్నమ్మ సంబరంగా యెదురు వచ్చింది. వృద్ధాప్యంతో వంగిపోయినా, ఆమెను చూడగానే తను తప్పు చేశానేమో అన్పించింది భాస్కర్‌కి. ఆమె పసి పిల్లలా కొడుక్కు హత్తుకుపోయింది. కన్నీటితో చొక్కా తడిసిపోయింది. భాస్కర్ క్రింద వంటిపై పెదవిని నొక్కి పట్టాడు.

"ఉరోక్క అమ్మా! ఊరోక్క! నువ్వేగా పంపించేశావ్" అన్నాడు. నిర్మల అత్తగారి పాదాలు అంటింది.

"ఎందుకమ్మా ! ఈ నమస్కారాలు ! నిన్ను అవమా నించినందుకా ?" కోడలి భుజాలు మృదువుగా నొక్కింది. నిర్మలకు కన్నీరు తిరిగింది. పిల్లల్ని కేకేసింది.

"నాయనమ్మకు నమస్కరించారా ?"

ముగ్గురూ చుట్టూ చేరి నమస్కరించారు. సంబరంగా కళ్ళు పెద్దచేసి చూసింది.

"కండ్లు బాగా కనపడవురా ?" అన్నది.

"నాన్నగారు ఇంట్లో ఉన్నారా ?"

"కీళ్ళవాతం. లేవలేరు ?"



"ఇంత కష్టపడుతున్నా మాకు రాయలేదేమ్మా ?"

"నాకు చదువ్రా, సంధ్యలు వచ్చా ? రాస్తాను ... రాస్తాను అంటూనే జాప్యం చేశారు. వీా అన్నకు ఎక్కడి డబ్బు చాలదు. మీారు పంపింది కూడా తనే వాడేశాడు. ముసలాయనకు మందులు ఇప్పించమంటే కంయ్‌మంటాడు."

"ఇంట్లోకి పదండమ్మా !" అంజయ్య హెచ్చరించాడు. అందరూ ఇంట్లోకి వచ్చారు. చిన్నారావును చూడగానే కొడుకు కుండెలు అవిసిపోయాయి. కొడుకును, మనుమలను నిముషం వదలలేదు.

"ఇంట్లోకి వెళ్ళింది నిర్మల. భాగ్యలక్ష్మి పద్నాలుగో కాన్పు. బాలెంతరాలు. ఆర్గురు పిల్లలు అదృష్టవంతులు పోయారు. పుట్టిన పిల్లల్లో ఆర్గురు ఆడపిల్లలు, యిద్దరు మొగ పిల్లలు బ్రతికారు.

"బావున్నావా అక్కయ్యా !"

"ఇలా గున్నామమ్మా ! భారతీ ! ఈ పిల్లలను తీసుకో" అరిచింది. మొగపిల్లలు యింట్లో లేరు. ఆడపిల్లలు లోపలికి తొంగి తొంగి చూస్తూ నందినిని నఖశిఖపర్యంతం పరీక్ష చేస్తున్నారు. భారతి వచ్చింది. ముఖం ముదిరినట్లు కన్పించినా పిల్ల ఎదగలేదు. ఇరవై రెండేళ్ళంటే యెవరూ నమ్మరు.

"బావున్నారా పిన్నీ !"

"నువ్వెలా ఉన్నావ్ భారతీ !"

"ఇదిగో !" పేలవంగా నవ్వింది. "నందిని ఎంత ఎదిగి పోయింది. వసంతకంటే చిన్నది." సంబరంగా, ఆనందంగా చూచింది.

"పెరక్కేం చేస్తుంది? మీ చిన్నాన్న పిన్ని సంపాదించిందంతా దానికే మరి ... వంటయిందా?"

"ఊఁ!"

"ఆ పిల్లకు కాస్త జడలు వేయి."

"వేస్తాను." అంది విసుగ్గా.

"ఏమిటే ఆ విసురు! దుంగలు దూలాలు ఎత్తినట్టు." తల్లీ కూతుళ్ళు వాదులాడసాగేరు. భోజనాలు అయ్యాయి.

"వస్తానక్కయ్యా!" నిర్మల లేచింది. తమకై కేటాయించిన భాగం అన్నమ్మ చూపింది. యిల్లంతా తనే తీసుకుని - బయట వసారా రెండు గదులు, పెరట్లో కాస్త స్థలం తమ్ముడికని చెప్పాడు వెంకటరావు.

"అయినా వేరుగా ఉండాల్సిన అవసరం ఏముంది?"

"క్షమించన్నయ్యా! పదేళ్ళు వేరుగా వున్నాము. మళ్ళీ కలవటం హాస్యంగా వుంటుంది. విడిగానే వుంటే అందరికీ సుఖం."

భాస్కరరావు ఖచ్చితంగా. చెప్పాడు తను వివాహం కాగానే కాస్త నిర్మొహమాటంగా నిర్మలను తీసుకు వెడితే అసలు పేచీయే వుండేది కాదు.

"మరిదిగారికి మన గంప సంసారంలో ఊపిరి ఆడవద్దూ?"

"వదినా! మీకు ఇంకా మనుష్షుల్ని అర్థం చేసుకునే శక్తి రాలేదంటే ఆశ్చర్యంగా వుంద" అన్నాడు. భాగ్యమ్మ మాటలకీ మధ్య వత్తాసు లభించటం లేదు.

"నాన్నగారూ! మేం సామాన్లు సర్దుతామండి."



వాసు, చందు ముందుకు వస్తే క్షణం ముచ్చటపడిపోయాడు. వెంకటరావు. నందిని నాజూకుగా కన్పించినా, చక్కగా పనులు చేస్తూ అన్నలకు సాయం చేస్తూంది. నాల్గు గంటలకు కాఫీ కప్పులతో వచ్చింది. భాస్కరరావు బయటికి వెళ్ళాడు.

"తీసుకోండి, పెదనాన్నగారూ!"

కాఫీ తీసుకుని ఆమెవంక చూచాడు ఆప్యాయంగా.

"ఏం చదువుతున్నావు నందినీ?"

"ఆరవ క్లాసండి. తాతయ్యా! మీకు నేను త్రాగించేదా?"

"నా తల్లీ! నా ఆయుష్షు పోసుకుని నూరేళ్ళు బ్రతుకమ్మా!" ఒణుకుతూ కాఫీ తీసుకున్నాడు.

"మీరిలా కుర్చీలో కూర్చుంటే పక్కబట్టలు మారుస్తారు."

"ఎందుకమ్మా! వద్దు."

"మీ రూరుకోండి. దుప్పట్లు మాసిపోయాయి. ఇక్కడ గాలిలేదు. ఉండండి" బయటికి వెళ్ళిన నందిని అన్నలతో వచ్చింది. ముగ్గురూ తమలో తాము మాట్లాడుకుని, వెంటనే తాతగారి పక్క బయట గాలి, వెలుతురు వచ్చే గదిలోకి మార్చారు.

"మీ కొచ్చిన రెండుగదులో నాకే ఒకటిచ్చి మీరు యెలా వుంటారురా?"

"నాన్నగారొచ్చి అదంతా ఆలోచిస్తారు. మీరు మాత్రం కదలొద్దు."

వారిని ముచ్చటగా చూచాడు.

సాయంత్రం మేస్త్రీలను వెంటబెట్టుకు వచ్చాడు. వెనకవైపు కలుపుతూ వంటిల్లూ, పడకగదులూ వేయించాలని ప్లాను. నిమిషాల మీద అంతా నిర్ణయం అయింది. తన భాగంలోనే కాక అన్నగారి భాగంలో కూడా కరెంటు పెట్టించాలని నిర్ణయించాడు భాస్కర్. తనకంటే అయిదారేళ్ళు పెద్దవాడయిన అన్నగారు యెంతో ముసలివాడిలా అయ్యాడు. రాత్రి యిద్దరూ తీరికగా కూర్చున్నారు.

"భారతికి యెక్కడయినా సంబంధాలు చూస్తున్నావా, అన్నయ్యా!"

"చూసిచూసి విసిగిపోయానురా. వేలకువేలు అడుగుతారు. అమ్మాయి ఏం చదివింది? అంటారు."

"మరి చిన్నపిల్లలను బడికి పంపు."

"అదే అనుకుంటున్నాను. వాసు ఈ ఊళ్ళోనే చదువుతాడా?"

"వాడు హాస్టల్లో వుండి పి. యు. సి. చదువుతాడు. రిజల్ట్ కోసం చూస్తున్నాం."

"వాడు అప్పుడే మెట్రిక్ పాసయ్యాడా? యింకా నేను ఏ ఆరో క్లాసులో ఉన్నాడో అనుకున్నాను." మౌనంగా వుండిపోయారు. ఎవరీ ఆలోచనలు వారివి.

## 14

"ఈ కూర ఇలా తగలబడిందేం?" అక్కను మిర్రున చూచాడు ప్రసాద్.



భారతి మాట్లాడలేదు. మాట్లాడితే గిన్నెలు ముఖానపడతాయని తెలుసు.

"పట్నం నుండి ఆ మూక వచ్చినట్టున్నారే."

"వచ్చారు" అంది అతి నెమ్మదిగా.

"మధ్యగదిలో ముసలాడు లేడేం?" భాగ్యమ్మ వచ్చింది.

"అయ్యో నాయనా! ఇన్నాళ్ళు మనము చేసిందంతా గంగలో కలిసిందిరా. మూరెడు లేదు ఆ పిల్ల గాలి, వెలుతురని ..."

"ఎవతే అది?"

"అదేరా మీ చిన్నాన్న కూతురు."

"రేపు రెండు తగలనిచ్చి, ఈ ఊరేమిటో చూపించనూ."

"వాళ్ళజోలి మన కెందుకురా? అసలే మీ చిన్నమ్మ నోరుగల మనిషి." భాగ్యమ్మ గొంతు చిన్నదిగా చేసింది. పది దాటాక వచ్చిన ప్రసాద్ దగ్గర కూర్చుని.

"వాళ్ళబ్బాయి మెట్రిక్ పాసయ్యాడట. నీవూ చదివితే పాసయ్యేవాడివేరా"

"వాడి ముఖం! కాపీకొట్టో, మాష్టర్లకు లంచం పెట్టో పాసయి వుంటాడు. నేను వెలమదొరనే అలాంటి పనులు చేస్తానా?" సగర్వంగా తలెత్తినాడు.

"అందరూ కాపీలుకొట్టే పాసయ్యారా?" భారతి ఉక్రోషంగా అడిగింది. ఉదయమునుండీ ఆ పిల్ల హృదయం యేదో కల్లోలంగా వుంది. ఆప్యాయత అంటే యెరక్కపోగా అదిలింపులు' విదిలింపులు దాసీ దానిలా పనులు చేయాలి

ఎవరికీ తృప్తిలేదు. నందనిని తండ్రి యెంత ఆప్యాయతగా పిలుస్తాడు? అన్న లెంత ప్రేమగా వుంటారు?

"నీకు ఊళ్ళో సంగతులేం తెలుసు? నోరుమూసుకో" లేచి వెళ్ళాడు. ప్రసాదుకు ఎవరి భయం లేదు. నోటిదురుసు యెక్కువ. రెండుసార్లు పరీక్ష తప్పాడు. మెట్రిక్ వరకు కూడా యెంతో నేర్పుగా టీచర్లను హడలగొట్టి పాసవుతూ వచ్చాడు. రోజుకు రెండు రూపాయలు సిగరెట్లకే చాలదు.

"అమ్మా!"

"ఏమిట్రా?"

"ఓ అయిదు రూపాయలున్నాయా?"

"నిన్ననే కదరా అయిదిచ్చాను."

"వెధవ అయిదు యే మూలకు? సినిమా కెళ్ళేమా, ఊర్కే లెక్కలు అడక్క యిటు తగలెయ్యి."

"లేవని చెబితే వినిపించదా?"

"అయితే నేను సుధాకర్ లాగే చేయాలి." భాగ్యలక్ష్మి వణికిపోయింది. సుధాకర్‌కు చేతివాటం యెక్కువ. ఒకడితోనే చస్తూంది. వీడు మొదలు పెడితే!

"ఇస్తావా, ఇయ్యవా?"

మరేం మాట్లాడక అయిదు రూపాయలు యిచ్చింది. అతను అవి అందుకుని పెరటిదారి పట్టాడు.

"యింతరాత్రి యెక్కడికిరా?"

"పనుంది లేవే! అన్ని విషయాలు ఆడవారికి చెప్పరు" అతను వెళ్ళిపోయాడు.



"నాకు తెలుసమ్మా! గుడివెనకాల పేక ఆడతారు."

"నోరుముయ్యి" భాగ్యమ్మకు చిరాకుగానే వుంది. తనూహించినట్టు కాక తోడికోడలి కుటుంబం మరో రకంగా వుంది. తను కుటుంబనియంత్రణ అంటే ఎందుకు నిరసించింది? ఇప్పుడేం సాధించింది? పిల్లలు యిలా చెట్టు విడచిన భూతాల్లా ఎందుకు తయారయ్యారు? వసంతకు పిచ్చి వేషాలు ఎక్కువయ్యాయి. పదిహేడు నిండిన పిల్లకుండాల్సిన లక్షణాలు అసలు లేవు. షోకు లెక్కువయ్యాయి. ఈ యేడు ఎలాగయినా ఇద్దరు పిల్లలను వదిలించుకోవాలి. మొదటిసారి శారీరక సుఖాలంటే అసహ్యించుకుంది. భర్త గదిలోకి వెళ్ళక తిన్నగా వెళ్ళి పిల్లల పక్కన పడుకుంది. అవతలి ప్రక్కన పడుకున్న భారతి స్థితి కూడా అలాగే వుంది. తమకు డబ్బు లేదా? వుంది.

మరి లోపం ఎక్కడ? మొగపిల్లలకోసం అప్పయినా చేసే పెద్దలు ఆడపిల్లలంటే అసలు పట్టించుకోరు.

"భారతీ! కాస్త చంటివాళ్ళను కనిపెట్టే. యెంతకని చచ్చేది?" తల్లి రోజుకు వందసార్లు అనేమాట.

"అమ్మాయ్! ఎడ్డించావా? ఆడపిల్లవు, అణకువగా వుండాలి. ప్రసాద్ తో నీకు పోటీ దేనికి?" తండ్రి రోజుకు పదిసార్లు పలికే పలుకులు.

"చిన్నపిల్లలతో నీకేమిటే? ఎందుకు ఏళ్ళొచ్చాయి. ఈపాటికి నల్గురు పుట్టాల్సింది" నాయనమ్మ సాధింపు.

"కాస్త చుట్టపై నిప్పు వేయవే. కొజ్జాడిలా పెరిగిపోతున్నావ్, పెళ్ళి అయ్యే గీతుందో లేదో" తాత గుణుపు.

"అక్కా! చెడ్డీ కట్టు...జడ వెయ్యి...అమ్మా! అక్క చూడవే" చిన్న చెల్లెండ్ల గుణుపు.

"ఏయ్! ఈ వంట ఇలా తగలడిందే?" యెంత బాగా వండినా వంకలు పెట్టే తమ్ముడు. తనలాంటివారి జీవితం కథలుగా రాయ రెందుకో!" ఓ నిట్టూర్పు వదిలింది. తను పుట్టటం తన తప్పా? చదవకపోవటం తన తప్పా? ఏ ఒక్క ప్రశ్నకు సమాధానం దొరకలేదు. బలవంతంగా కళ్ళు మూసుకుంది.

"భారతీ!

"ఊఁ!"

"చంటిది పక్క తడుపుకున్నట్టుంది. కొంచెం గుడ్డ మార్చు. నడుము పడిపోతూంది." విసుక్కుంటూ లేచింది. అ పిల్లకు బట్టమార్చేలోగా, అంతకంటే పెద్దపిల్ల ఒకటికి అంటూ గొడవ. ఆ పిల్లను తీసుకువెళ్ళి తిరిగి వచ్చేసరికి వసంత లేచింది, "నేను దొడ్డికెళ్ళాలి సాయం రావే" అంటూ. పన్నెండు చేరాక పడక చేరిన భారతి నాలుగంటలకే లేవాలి. వసంత నోరు దురుసు. యెవరూ ఆ పిల్లను పిలువరు.

## 15

వృద్ధ దంపతులిద్దరూ చిన్నకొడుకుతో వుంటారనగానే వెంకటరావుకు చాలా సంతోషం కల్గింది. బయటికి కనబడనీయకుండా మాట్లాడినా అందరూ అర్థం చేసుకున్నారు.



"ఇన్నాళ్ళుండగా లేనిది యిప్పుడేం వచ్చింది? ఒకటి మాత్రం నిజం. మీ దగ్గర శుభ్రమయిన తిండి దొరుకుతుంది."

"అదేం మాటన్నయ్యా! యెన్నాళ్ళు నువ్వు మోస్తావు?" భాస్కరరావు బాధ పడ్డాడు. అందరూ ఆనందించినా భారతి మాత్రం బాధపడిపోయింది. అన్నప్పుడు నాలుగు మాటలన్నా, అప్పుడప్పుడు సానుభూతి చూపించి ఇంట్లో పనులు చేసేది అన్నమ్మ.

"పోవే ఆ మూడు ముళ్ళూ పడితే అక్కడా చాకిరేగా. మొదటి మనుమరాలివని చిన్నప్పుడు యెంత ముద్దు చేశాం. ముద్దు ముక్కలయినట్టే వుంది" అలాంటి సానుభూతి లేకపోగా ఇద్దరి పని ఒకేదాని మెడకు పడింది.

"అమ్మా! వసంతను కాస్త సాయం చెయ్యమన రాదూ!"

"అది చేస్తుంటే నేను వద్దన్నానా?" భాగ్యమ్మకు పని తీరుగా చేయటం రాదు, ఒకరికి చెప్పి చేయించనూ లేదు.

"వసంత! కాస్త కూరలు తరిగిపెట్టు."

"తరుక్కో, నేను జడ వేసుకోవాలి" అద్దంముందు నిలబడి, ముందుజుట్టు కత్తిరించుకుంది. పోయిన సంవత్సరం తండ్రిని పోరి, తిట్లుతిని ఎగ్జిబిషన్‌లో కొన్న పంజాబీదుస్తులు వేసుకుంది. ఊళ్ళోకి అమ్మవచ్చే ఆర్టిఫిషల్ జ్యూయలరీ అలంకరించుకుంది.

"నీవు తీర్చి దిద్దుకుంటే వంట యెవడు చేస్తాడే?"

"నిన్నెవడు చెయ్యమన్నాడు? అమ్మ చేస్తుంది" నిర్లక్ష్యంగా వచ్చింది సమాధానం. భారతి ఉడుక్కుంది.

"సరే! నేనూ కూర్చుంటాను, చేసేపని వదిలి వెళ్ళిపోయింది. ఈ తగువు వింటున్న భాగ్యలక్ష్మి చంటిపిల్లను వదిలి వచ్చింది. అత్తగారి ఆధ్వర్యాన జరిగే పనులు తనకు తోచదు. అటుది యిటు పెడుతూ, యిటు దటు పెడుతూ అపర మధ్యాహ్నం వేళ్ళ కింత అన్నం ఉడకేసింది. భర్త రాగానే పెద్ద నోటితో కూతుళ్ళ విషయం చెప్పింది భాగ్యలక్ష్మి. వెంకటరావుకు భార్యపై. యెప్పుడూ కోపం రాదు, తన వాంఛలను తీర్చేది ఆమె! వేలఖర్చుంది అంటూ గుర్తు చేసే భారతి అంటే విసుగు. కూతురిలా కన్పించదు, భూతంలా కన్పిస్తుంది.

"భారతీ!"

"ఏమిటి నాన్నగారూ!"

"తీరి కూర్చుంటే సొగరుగా ఉందా? మీ అందరికీ అడ్డమయిన చాకిరీ చేస్తూ, దాని ఒంట్లో మాంసము అన్నది మిగలలేదు! యింకా వండిపెడుతుందా?" కిక్కురు మనకుండా వంటయింట్లో దూరిపోయింది భారతి. అదే మంచి అదను అనుకుని, అద్దంలో మరోసారి ముఖం చూచుకుని పెరటి గుమ్మాన బయటపడింది వసంత. ఆ తరువాత పిల్లలిద్దరూ బడికని చెప్పి, అవతలి వీధిలో ఆటలకు వెళ్ళారు.

"సుధాకర్ ఏడి?" భర్త భోజనం చేస్తుంటే అడిగింది భాగ్యమ్మ.

"నాకేం తెలుసు?"



"పొలం పనులు చేస్తానని వచ్చాడు."

"వాడు ఒకేనాడు నా చితికి నిప్పు పెడతాడు. రాత్రి జీతగాళ్ళను బెదిరించి కోళ్ళన్నీ అమ్ముకున్నాడట."

"జీతగాళ్ళు చెప్పగానే మీరు నమ్మారా?"

"అందరూ అబద్ధం చెబుతారా?"

"డబ్బుకు గడ్డితినే వెధవలు యెంతకయినా తెగిస్తారు."

"అదికాదమ్మా! మొన్న నాన్నగారి షర్టు జేబులోంచి డబ్బులు తీసింది వాడేనే..." భారతి పెరుగు గిన్నెతో వచ్చింది.

"నోరుముయ్యి. ముదనష్టపుదానా? మగపిల్లలంటే నీకు మంట" తల్లి గదమాయింపుకు నోరు మూసుకుంది భారతి.

"మీ అన్న ఉత్తరం రాశాడు. వచ్చే అదివారం యెవరో కుర్రాడిని పంపుతానని, భారతిని చూసుకుంటాడట."

"మా అన్న కాకపోతే, మీ తమ్ముడు చూస్తాడా?" అంది నిరసనగా. వెంకటరావు అవును, కాదు అని అనలేదు. తమ్ముడు ఇంటికి కరెంటు పెట్టించాడు. పొలం దగ్గర ఇంజను వాడుకొమ్మన్నాడు. ఎరువులూ ఇద్దరి పొలాలకు తెప్పించాడు. భార్యకు ఆ విషయాలు తెలియనివా? కావు. అందుకే మౌనం వహించాడు.

"కట్నం ఏపాటి అడుగుతారో?"

"అబ్బాయి జిల్లా పరిషత్ ఆఫీసులో గుమాస్తానట. వెయ్యి రెండు వేలలో తేలిపోతుంది."

"మా అన్న తరహాయే వేరు!" మురిసిపోయింది. వెంకటరావుకు చిరాకుగా ఉంది. చిన్నారావు పెద్దరికం చేసిన రోజులలో తను కూడబెట్టిన డబ్బంతా తన అన్న పరం చేసింది భాగ్యలక్ష్మి.

"పెళ్ళికి మీ తమ్ముడు ఏదయినా సాయం చేస్తాడా?"

"మొదట మీ అన్న సంగతి చెప్పు. సాయం లేకుంటే మానే, మన డబ్బు మనకిమ్మను."

"బావుంది వరస" రుసరుసలాడింది ఆమె. "మీరు యెద్దులా కష్టపడి పంపితే మహారాజులా చదివింది మా అన్నే నేమిటి?"

"అందుకే పది సంవత్సరాలు పొలం మీద వచ్చిన పైసా ఒకటి అడగలేదు. నేను నిజంగానే చెబుతున్నాను. అంతా కాకపోయినా వేయి, పదిహేను వందల సర్దుబాటు చెయ్యమను."

"మీరు పదీ, పరకా ఇచ్చి ఇప్పుడు అంతా తెమ్మంటే యెలా తెస్తాడు? ఇచ్చేనా డిస్తాడు లెండి. ఏమయింది మీ తమ్ముడికి? ముగ్గురు పిల్లలకు ఇద్దరూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. అయినా ఆశ చావదు. మన ఇళ్ళల్లో బయటికి వెళ్ళమా? ఆదివారం రాగానే టింగో, రంగో అంటూ పొలాలెమ్మట బయలుదేరుతుంది మీ మరదలు."



అతనేం మాట్లాడలేదు, ఆరోగ్య ఐశ్వర్యాలతో కల కలలాడే తమ్ముడిని చూస్తే, తన జీవితం యెక్కడ గాడి తప్పిందో అర్థం అయింది అతనికి.

పెళ్ళివారొచ్చారు. అమ్మాయి నచ్చినా కట్నం నచ్చలేదు. అబ్బాయి నిర్మొహమాటంగా చెప్పాడు.

"ఎస్. ఎల్. సి. చదివినా, నాకు తోడుగా ఏదయినా పని చేస్తుందనే ధీమా ఉండేదండీ..." ఆఖరుగా చెప్పాడు. వారు వెళ్ళి పోయాక అన్నమ్మ చిటపటమంది.

"అప్రాచ్యపు వెధవ. ఆడదాని సంపాదన మీద బ్రతుకుతాడా, సిగ్గులేదూ?"

"కాలం మారుతుందమ్మా" భాస్కరరావు నచ్చచెప్పాడు.

"మరేనాయనా! మా కాలంలో అమ్మాయికేం పనులు వచ్చు అని అడిగాం. ఇప్పుడు ఎఫ్. ఏ. చదివిందా, బి ఏ. చదివిందా అంటారు."

ఇలాగే సంబంధాలు రావటం, తిరిగిపోవటం తప్పితే ఒక్కటీ కుదరదు.

"రెండుమూడు వేలు లేందే అసలు కుదరదు అన్నయ్యా! నీ ఇన్సూరెన్స్ పాలసీమీద అప్పు తీసుకో. భారతిది కానిచ్చేస్తే వసంతది చూద్దాం."

"రెండువేలు ముందే తీసుకున్నానురా" దోషిలా తల వంచుకున్నాడు వెంకటరావు

"అదేం అన్నయ్యా? అంత అవసరం ఏం వచ్చింది?"

"పెద్దాడు అలీఘర్ పరీక్షల కెళ్ళినప్పుడు వెయ్యి అయింది, మిగతా వాటితో చిల్లర అప్పులు తీర్చాను."

"అలీఘర్ వెళ్ళటానికి వెయ్యా?" నోరు వెళ్ళబెట్టాడు.

"వెయ్యో, వందో, వాడికంటే యెక్కువా? పిచ్చి నాగన్న. అప్పటికీ పైసా లెక్క చూపాడు" భాగ్యలక్ష్మి నొచ్చుకుంది.

"వదినా! నీ అపారమైన పుత్రప్రేమకు సంతోషం. కాని వెనుక ముందు చూసుకోవాలి" విసురుగా వచ్చేశాడు భాస్కరరావు. అతని మనసంతా వికలంగా వుంది, తాను ఏమూహించి, భీమా చేయించి, నెల నెలా డబ్బులు వెనకేస్తున్నాడు? తన కష్టార్జితం అన్యాయంగా ఖర్చు అయిపోయింది. అలాగే చల్లగాలికి పొలాల వెంట వెళ్ళిపోయాడు.

# 16

వాసు హాస్టల్లో వుండి పి. యు. సి, చదువుతున్నాడు. చందు, నందిని స్థానిక పాఠశాలలో చేరారు. నిర్మల అక్కడే ఆడపిల్లల బడిలో పనిచేస్తుంది, మిడిల్ కమ్ హైస్కూల్. పెద్దగా పనేం ఉండదు. ఉదయం లేచి, కూతురి సాయంతో పనులు చేస్తుంది. అన్నమ్మ చేయబోయినా నందిని అడ్డు పడుతుంది. చందు తాత పనులు చూస్తాడు. తొమ్మిదిన్నరకు అందరి భోజనాలు అయిపోతాయి. ఎవరి డబ్బాలలో వారు మధ్యాహ్నానికి ఫలహారం సర్దుకుని వెడతారు. భాస్కర్ కోసం క్యారియర్ పంపేటప్పుడు వంటలు వెచ్చచేసి పంపటం అన్నమ్మ వంతు. సాయంత్రం అందరూ సరదాగా కూర్చుని



టీ త్రాగుతారు. చందూ, నందిని వంతులు వేసుకుని చేసే పని చూస్తుంటే వృద్ధ దంపతులకు ముచ్చట వేస్తుంది.

"ఇంత మాసిపోయిన గుడ్డలు వేసుకుంటావేం? తాతయ్యా!" బట్టలు మార్పించి చాకలికి వేసేది.

"ఈ తల అలా చిక్కులతో పాడుచేసుకోవటం దేనికి?"

నందినికి ఇల్లు శుభ్రంగా వుంచటం ఇష్టం. ప్రతిరోజూ ఇంటిముందు కాగితాలు ఏరివేస్తుంది. టీ త్రాగి పొలాలవైపు వెడతాడు భాస్కరరావు. అరటితోట చూశాడు వరికూడా జపాను పద్ధతిలో నాటించాడు. వాసును సాయంత్రం తీసుకువెళ్ళి, కాలేజీలు తీయక పూర్వమే, నీటి కాలువలు సమంగా తవ్వాడు. చంద్రం సాయంతో సిమెంటు చేస్తున్నాడు 'కష్టే ఫలే' అన్న సూత్రాన్ని నమ్మేవాడు భాస్కరరావు. అదృష్టం అంటూ అదునుకోసం యెదురుచూసే అలవాటు లేదు. దానికి పూర్తిగా విరుద్ధం వెంకటరావు.

"ఒరేయ్ గుడిసెలో సిమెంటుండాలి ఇలాతే!" భాస్కరరావు జీతగాడిని కేకవేశాడు.

"దొరా!" వాడు చేతులు దులుపుకో సాగేడు, అనవసరంగా.

"ఏమిట్రా?"

"ఇంటి దగ్గర గచ్చు ఊడిందని సుధాకర్ బాబు పట్టుకెళ్ళారండి" భాస్కర్ కనుబొమ్మలు ముడిపడ్డాయి. మొన్ననే ఇల్లంతా బాగుచేయించాడు. జీతగాళ్ళ ముందు

తన వాళ్ళను తేలిక చేసుకోవటం దేనికని అప్పటికి ఊర్కున్నాడు. చందు బుర్ర చురుకుగా పనిచేసింది.

"తాళం వెయ్యి. నాన్నగారు తప్ప నేను అడిగినా ఏమీ ఇవ్వకు" జీతగాడికి సలహా ఇచ్చాడు. సిమెంటుకంట్రోల్ చేశారు! కాల్వ పూర్తి అయ్యేవరకేదో ఓ తంటా...ఆలోచిస్తూ చేతులు కడిగి ఇంటిదారి పట్టాడు. దారిలో కన్పించిన వ్యవసాయదార్లకు తోచిన సలహాలు ఇస్తూ ఇల్లు చేరాడు. కన్నీటితో నందిని బిక్కున చూస్తుంది. ప్రసాద్ అరుస్తున్నాడు.

"ఏమ్మా! ఏం జరిగింది?"

"దాన్ని ఆడక్కు. నన్నడుగు చెబుతాను. పాకీలంతా దీని తాత జాగీరట. మేం పాడుచేస్తున్నానుట" ప్రసాద్ విసురుగా తల యెగరవేశాడు.

"ప్రసాద్! అది అని అసభ్యంగా మాట్లాడకు. ఈ స్థలం తాత జాగీరే! ఇంటిముందు కాగితాలు, సిగరెట్టుపీకలు ఛావుంటాయా?"

"అదంతా మీ కనవసరం" పెడసరంగా వచ్చింది జవాబు.

"ఓహో! నువ్వు పెద్దాడివని తెలియదులే, వెళ్ళమ్మా ఇంట్లోకి" కూతురికి మృదువుగా చెప్పాడు.

"మీరుండండి నాన్నా! మొన్న అమ్మను కూడా ఇష్టమొచ్చిన మాటలన్నాడు" చందు ముందుకు వచ్చాడు.

"చందూ!" తండ్రి కంఠంలోని తీవ్రతకు వణికిపోయాడు చందు. ఇంట్లోకి వెళ్ళిపోయాడు. భాస్కర్ ఇంట్లో



వెళ్ళాడు. స్టాండుముందు చాపపై కూర్చుని, పిల్లల బట్టలకు గుండీలు కుడుతుంది నిర్మల.

"చీకటవుతుంది. రేపు కుడితే కాదా?" అన్నాడు అక్కడే చాపలో చతికిలబడుతూ.

"ఏం? మీకీరోజు కాల్వపని త్వరగా తెమిలిందే?" అన్నది, యెదురు ప్రశ్న వేస్తూ.

"నీతో కబుర్లు చెప్పాలని."

"కొయ్యకండి కోతలు." నవ్వి, పొయ్యిమీది పప్పు దింపి, టీ పెట్టింది. అతను రెప్ప వేయక ఆమెపంక చూడసాగేడు.

"ఏమిటలా క్రొత్తగా చూస్తున్నారు?"

"ఇంతపని చేసినా అలసట నీ ముఖాన కానరాదేమిటా అని."

"అది మీ ఊతపదమేగా! నందీ!"

"ఏమ్మా!" నందిని కళ్ళు ఎర్రగా వాచినాయి.

"గదిలోంచి పంచదార పట్రా" నందిని సీసా నింపి తెచ్చింది.

"అదేమిటి తల్లీ! కళ్ళు అలా వాచాయి?"

"బయటి యుద్ధం నీకు తెలియదా? మనమ్మాయి వాసుకు చెప్పినట్టే, శుభ్రతను గూర్చి ప్రసాద్‌కు చెప్పబోయింది..."

"చేయి చేసుకున్నాడా?" ఆత్రంగా అడిగింది.

"అంతదాకా రాలేదులే."

"అది కాదండీ? రోజూ భారతిని పట్టుకు బాదేస్తాడు. అక్కకు, బావగారికి కొంచెంకూడా పట్టదు."

"చక్కగా పితృదేవతల ఉనికిని చూపే వంశోద్ధారకు డాయె! నందీ!" ప్రేమగా కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

"మూర్ఖుల మాటలకు బాధపడకమ్మా! వాడు నీకంటే పెద్దాడు. పోనీలే" తల నిమిరాడు. "నీవు పాటలు పాడటం లేదు ఈ రోజు పాడు."

"నాకు చాలా హోమ్‌వర్క్ ఉంది నాన్నా!" తుర్రు మని పారిపోయింది.

"అసలే సున్నితమైన మనసు గలది." కూతురి వంక గర్వంగా చూచుకున్నాడు.

"ఏమండీ..."

"చెప్పండి" అన్నాడు ఇటు తిరిగి.

"భారతికి ఏదయినా సంబంధం చూద్దురూ! ఆ పిల్లను చూస్తే జాలిగా ఉంది."

"ప్రయత్నిస్తాను." ఆ రాత్రే తెలిసినవారికి రెండు ఉత్త రాలు రాసి వేశాడు భాస్కరరావు.

## 17

"పెళ్ళివారు వెళ్ళిపోయాక రుసరుసలాడుతూ వెళ్ళి పోయింది భాగ్యలక్ష్మి. పెళ్ళికొడుకు నల్గురి తమ్ములకు పెద్ద వాడు, పొలం ఉంది. ఊళ్ళో వి. ఎల్. డబ్ల్యు గా పని చేస్తున్నాడు.



"ఇంటికి పెద్దాయన్ను చేసుకుని నేను సుఖపడ్డాను. అది సుఖపడుతుంది. ఇంత బ్రతుకు బ్రతికి ఓ వి. ఎల్. డబ్ల్యూకు పిల్లనివ్వడమా?"

"పిల్లాడు చాకులా వున్నాడే!" అన్నమ్మ అంది.

"ఉంటే నీ ప్రియమైన మనుమరాలు నందినిని యివ్వరాదూ!" టక్కున జవాబు యిచ్చింది.

"వదినా! ఆమెపై కోపం దేనికి? తనకు తోచింది చెప్పింది. నందినికి వయసుంటే ఇచ్చేవాడినే" భాస్కరరావు శాంతంగా జవాబు చెప్పాడు. ఇలాగే సంబంధాలు రావటం పోవటం తప్ప ఒక్కటీ కుదరలేదు. 'పిల్లవాడు నలుపు, అతనికి చాలామంది 'అక్కచెల్లెళ్ళు ఉన్నారు', పల్లెటూరివాడు' ఇలాంటి కారణాలు నాలుగయిదు అయ్యాక ఒక్కటి నచ్చితే వారికి అమ్మాయి నచ్చేది కాదు. అలా మరో సంవత్సరం గడిచిపోయింది. భాస్కరరావు చికాకు కలిగి సంబంధాలు చూడటం మానివేశాడు.

"నా తమ్ముడో! నన్నుద్ధరిస్తాడో అని యెగిరెగిరి చదువు చెప్పించాడు. అన్న కష్టంతో యేం పని?" సాధించని రోజు లేదు. భాగ్యలక్ష్మికి మధ్య నోరు పెద్దది అయింది.

"ముగ్గురి పిల్లలకు ఇద్దరి సంపాదన! ఒక్కడు సంపాదిస్తే, కదిమది తినేవాళ్ళు మా ఇంట్లో" తోడికోడలు కన్పించగానే ఈ మాట అనటం అలవాటు చేసుకుంది

వీరంతా భారతి గొడవలలో వుండగా చెప్పా పెట్టకుండా, ఆ వూరి కంసాలి అబ్బాయితో లేచిపోయింది వసంత.

విషయం విన్న ఇంటిల్లపాది గొల్లుమన్నారు. భాస్కర్ రావు తలపట్టుకు కూర్చున్నాడు.

"ముదనష్టపు పిల్ల చచ్చినా బావుండేది."

"ఆ పిల్లదేం తప్పండీ? ఇటు చదువూ లేదు, మరో వ్యాపకం లేదు."

"నిర్మలా! అన్నయ్య ముఖం చూస్తే గుండెలు అవిసి పోతున్నాయి" భాస్కరరావు కనుకొలకులలో నీరు నిలిచింది.

"ఒక మంచిపని చేస్తున్నప్పుడు, నాల్గు మాటలు పడ్డా ఫరవాలేదు అనే సిద్ధాంతం నమ్ముతారా?"

"చెప్పేది సూటిగా చెప్పరాదు?"

"అక్కయ్యను అర్థంచేసుకోబోయి, విఫల ప్రయత్నం అని విరమించుకున్నాను. ఆత్మన్యూనతకన్న నరకం మరొకటిలేదు. ఆమె అభిప్రాయాలకు విలువ ఇచ్చినంత కాలం పిలలు బాగుపడరు."

"నన్నేం చేయమంటావు?"

"మొట్ట మొదట నయానో భయానో చిన్న పిల్లలను బడికి పంపండి. మొగపిల్లలు బాగుపడతారన్న నమ్మకం లేదు. ఇక భారతి విషయం ఆలోచించాలి."

"నాతో పనిచేసే సూర్యప్రకాష్ గుర్తున్నాడా?"

"ఆం! గుర్తులేకేం? మనింట్లో నారంరోజులుంటేను."

"అతను ... పునర్వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాడు. మొదట భార్యకు ఒకే కూతురుంది. రెండవ కాన్పులో చనిపోయిందతని భార్య. అతనికి ఉత్తరం రాయనా?"



"రాయండి. ఈసారి అక్కయ్య అంగీకరించాలి. వసంత విషయము అతనికి మొదటే చెప్పండి."

"అలాగే!" భాస్కరరావు తీవ్ర ప్రయత్నం వలన సూర్యప్రకాష్ శ్రీపురం వచ్చాడు. అతను అన్ని విషయాలు సావకాశంగా విని తలాడించాడు.

"ఇంట్లో చెల్లి తప్పుచేస్తే అక్కకు శిక్ష విధించాలనే తత్వం నాకు లేదు. నాకిష్టమేనండి" పెళ్ళిచూపులవతె కాకుండా భోజనాల వేళ భారతిని సాయంగా పిలిచింది నిర్మల. అతను అప్పుడే అమ్మాయిని పరిశీలనగా చూశాడు. 'కష్టాలలో సతమతమయిన అమ్మాయి. తన కుటుంబంలో మసలగలద'ని అనుకున్నాడు. తన అంగీకారం తెలిపాడు. అతని అంగీకారం విని నెమ్మదిగా అన్నతో కదిపాడు. దొంగచాటుగా వద్దని వదినముందే కదిపాడు.

"వసంత విషయం తెలిస్తే ఏమంటారో?"

"అంతా చెప్పాను అన్నయ్యా!"

"అదంతా తెలిసి అంగీకరించారంటే యేదో లోపం వుండాలి" అన్నది భాగ్యమ్మ.

"అందరూ సంకుచితంగా ఆలోచించరు వదినా! మంచి అవకాశము అతను కట్నం కూడా అడుగడు."

కట్నం వద్దంటాడని రెండో సంబంధం వాడికిస్తామా? మా పిల్ల మాకేం బరువుకాదు."

"వదినా! నీ స్వభావంలో కొంత కూడా మార్పు రాలేదు. పరిస్థితులను బట్టి ప్రణాళికలు వేసిననాడే సుఖపడతాడు. ఆ తరువాత నీ ఇష్టం."

“నేను సంపాదిస్తానా, చదువుకున్నానా? అందరికీ నా స్వభావం మంచిగా అన్పించదు” బుడి బుడి దీర్ఘాలు తీసింది.

“ప్రతి విషయంలో నిర్మలను చులకన చేయాలనే తాపత్రయం మానిననాడు నీవు బాగుపడతావు” చివాల్న లేచి వచ్చాడు. ఆలోచించి ఉత్తరం రాస్తానని సూర్యప్రకాష్‌ను పంపివేశాడు.

“అక్కయ్య ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తుందనుకోలేదు. ‘పురుట్లో పుట్టినబుద్ధి కాటిలో వెస్తేనే పోతుంది.’ అది మారుతుందనుకోవడం మన మూర్ఖత్వము” అన్నాడు చిరాకుగా.

“పొలం దగ్గరనుండి గంగులు వచ్చాడు, మీరోసారి రావాలని చెప్పాడు.”

“వారం రోజులనుండి అటు వెళ్ళనేలేదు.” చెప్పులేసుకుని పొలంవైపు వెళ్ళాడు.

“ఏమిటి గంగులూ?”

“పెద్దదొర మిరపచేను, ప్రసాద్‌బాబు మూడువందలకు అమ్ముతున్నాడు దొరా! ఎంత నష్టంగా చూసుకున్నా వెయ్యి రూపాయలు వస్తాయి.”

“ఎప్పుడు అమ్మాడు?”

“ప్రొద్దునమాట అయింది. మరి కాసేపట్లో డబ్బు తెస్తారట వారు.”

“అలాగా...” వడివడిగా మిరపచేను దగ్గరకు వెళ్ళాడు. పొన్నచెట్టు నీడలో సారా సీసా పెట్టుకున్నారు



ప్రసాద్, అతని జేరగాడు జాఫర్. వాడు కొంపలు కూల్చే రకం. సిగరెట్టు పోగ్గా కాలుస్తున్నాడు.

“ప్రసాద్!”

అనుకోకుండా బాబాయి కన్పించగానే తికమకపడ్డాడు ప్రసాద్. అంతవరకు జాఫర్‌తో కోసినకోతలు గుర్తుకు రాగానే, ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

“ఏం?”

“ఈ లోఫర్‌తో కలిసి త్రాగుతావా?”

“నా యిష్టం.”

“ఏమన్నావ్?” కాలరుపట్టి లేపి ఆ చెంపా ఈ చెంపా వాయించాడు. మత్తు వదలిపోయింది. జాఫర్ పిల్లిలా జారుకోబోయాడు.

“జాఫర్! ఇకనుండి పొలంలో అడుగుపెట్టేటప్పుడు ఆలోచించిపెట్టు. రాయనదొరల పంటచేలు కొంటావట్రా?”

“మాఫ్‌కర్‌నా సాబ్” వాడు తిరిగిచూడక వెళ్ళిపోయాడు.

“దౌర్భాగ్యుడా! కావుసారా త్రాగే సాహసమట్రా?” సీసాలను ఒకతన్ను తన్నేశాడు. భాస్కరరావు ఉగ్రరూపం చూచి యెక్కడివారక్కడ పారిపోయారు.

“పెద్దదొర బాగా అలుసిచ్చిండు దొరా ... ...” గంగులు నెమ్మదిగా గొణుక్కున్నాడు.

“ఊ! వీడేమయినా పనిచేస్తున్నాడా పొలంలో?”

“పనా? చేసే వారికి అడ్డుపడతాడు. అనొద్దుగాని...

“ఏమిటో చెప్పి ఏడ్వరాదూ?”

"పెద్దిగాడి పెళ్ళాంతో..."

"మంకితోనా? ఆమెకి ముప్ఫై ఏళ్ళుండవూ?"

"పైనే వుంటాయి దొరా...! సూచాయగా భాగ్యమ్మ చెవిలో వేస్తే నన్నే తిట్టి పంపింది."

భాస్కరరావు శాంతికోసం వేడెక్కిన మేధను చల్లబరచాలని వచ్చాడు రెండూ కరువే అయ్యాయి. మేధతో పాటు శరీరం వేడెక్కింది.

# 18

"ఈపూట కూడా తినవా?" వెంకటరావు భార్య మంచము దగ్గర నిలబడి అడిగాడు.

"ఎన్నిసార్లు చెప్పాలి? నేనో, మీ తమ్ముడో తేలిపోవాలి. అంతవరకు పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టను."

"నీకింత మొండిపట్టు యెందుకే? వాడు చేసిందాంట్లో తప్పేం వుంది?"

"తప్పులేదా?" గయ్యిన లేచింది. "నా పిల్లడిని కొట్టటానికి ఆయనెవరు? మన చేలు బేరం పెట్టాడు గాని తనది కాదుగా. ఈ రోజు వాడిని కొట్టాడు, రేపు మిమ్మల్ని కొడతాడు. ఆ తరువాత నన్ను..." మిమ్మల్ని కొడతాడు అన్న మాట వెంకటరావు హృదయానికి తాకింది, సూటిగా.

"లేచి. తిని ఏడ్వు. ఆ సంగతేమిటో తేలుస్తాను." అతను అదే ఉడుకులో లేచి తమ్ముని భాగంలోకి వచ్చాడు. అక్కడి దృశ్యము చూసి ఆగిపోయాడు. అతని చిన్న కూతుర్ల చేత గుణింతాలు రాయిస్తూంది నందిని.



"రా, అన్నయ్యా! ..." భాస్కర్ లేచాడు.

"పెద్దాడా?" దూరంగా మంచంలో పడుకున్న చిన్నారావు కూడా లేచి కూర్చున్నాడు. తను భార్యకిచ్చిన మాట మరిచిపోయి వారితో కూర్చున్నాడు.

"నందీ! పెదనాన్నకు కాఫీ తీసుకురామ్మా!"

"అలాగే నాన్నా!" నందిని లేచిపోయింది. ఆ పిల్ల వంక విప్పారిన నేత్రాలతో చూచాడు.

"కాఫీలు, టీలు మా ఇంట్లో ఉన్నాయి. పిల్లవాడిని జీతగాడి ముందు తన్నాలని యెవరు చెప్పారు? అంత అధికారం యెలా వచ్చింది?" లోపల గుమ్మంలోంచి భాగ్యమ్మ అడిగింది.

"భాగ్యలక్ష్మి!" చిన్నారావు ఆశ్చర్యంగా చూచాడు.

"నా నోరు మూయించాలనేగా! కానివ్వండి. ఇదంతా ఆయన మెతకతనము."

"ప్రసాద్, వాసూ యిద్దరూ నాకంతే వదినా! నేను కాబట్టి రెండుకొట్టి ఊరుకున్నాను. నువ్వే అయితే చంపేద్దువు" శాంతంగా జవాబు చెప్పాడు.

"ఇదిగో మరిదిగారూ! మాయమాటలు చాలు. మేం క్రిందామీదాపడి సంపాదించి పిల్లలకు పెట్టకపోయినా, చంపుకోము. అంత కానిపని ఏం చేశాడు?"

"విను — మొదట. జాఫర్‌తో కలిసి సారా త్రాగుతున్నాడు."

"త్రాగితే? అది నేరమా? ఇవాళ్ళ రేపు అందరూ త్రాగుతున్నారు- కొందరు గుట్టుగా, కొందరు బాహాటంగా..."

"మీకు లేని అభ్యంతరం నాకు దేనికి? నా వల్ల తప్పు అయిపోయింది క్షమించండి."

"అన్ని దెబ్బలుకొట్టి క్షమించగానే అయిపోయిందా?"

"మరేం చేయాలో చెప్పు?"

"నేను ఏంచెప్పాలి? మీరంతా ఒకటే" భర్తవంక కొరకొర చూచింది.

"ఇకనుండి మా జోలికి రావద్దు." చాచి తమ్ముడిని లెంపకాయ కొట్టాడు.

"నాన్నా!" కాఫీ ట్రే వదిలేసి ఒక్క గావుకేక పెట్టింది నందిని. అప్పటికే వెంకటరావు వెళ్ళిపోయాడు.

"ఇదేం ఖర్మరా!" వృద్ధుడు లేచి కొడుకును పట్టుకున్నాడు. అప్పటికిగాని అతను తేరుకోలేదు.

"ఫరవాలేదు నాన్నా! అన్నయ్యేగా?" దెబ్బ చెంప మీద కాదు, హృదయానికి తగిలింది.

"ఏమండీ?" ఆదుర్దాగా వచ్చింది నిర్మల.

"ఏంలేదు నిర్మలా! అన్నదమ్ముల గొడవలు ఇంటింటా ఉన్నవే" తండ్రిని నడిపించుకుపోయి, మంచంలో కూర్చోబెట్టాడు.

"వెంకట్ ఎంతమారిపోయాడురా! తొలి కొడుకని అన్నీ వాడికే పెట్టాం." అన్నమ్మ గారాలు మొదలు



పెట్టింది. అందరూ గంభీరంగా ఉన్నారు. చందు బయటినుండి రాగానే నందిని వార్త అందజేసింది.

"ఉండు. ఇప్పుడే అంతు తేలుస్తాను ... పెద్దమ్మ ఏమనుకుంటుందో? అన్నగారి ఆగడాలు అలా బయటికి వచ్చి వినమంటాను" విసురుగా లోపలికి పోబోయాడు.

"చందూ!"

"అదికాదమ్మా!"

"ఏదికాదు? సిగ్గుపడాలి. పెద్దవారి మాటలు వినాలని వున్నందుకు పో, నీ గదిలోకి"

"చిన్నారావు ముఖం మ్లానమయింది. కోరి తగవులు రేపే భాగ్యలక్ష్మికి, నిర్మలకు పోలికా? తనెంత మూర్ఖంగా అంచావేసి అమృత హృదయురాలయిన కోడల్ని వెళ్ళగొట్టాడు! అతని కళ్ళు చెమర్చాయి.

"అమ్మా, నిర్మలా!"

"ఏం, మామయ్యా!"

"ఇలా రామ్మా!" ఆప్యాయంగా దగ్గరగా వచ్చిన కోడలి తలపై చేయి వేశాడు. అతని కళ్ళు వర్షించాయి.

"పెద్దవారు మీరే దిగులుపడితే ఎలా?"

"రాయన వంశం నీ వల్ల కలుషితం అవుతుందని అపోహ పడ్డాను తల్లీ! వెంకట్ నీ అన్నే అనుకో..." ఆపైన చెప్పలేకపోయాడు.

"ఊర్కోండి!" ఏం చెప్పలేక మృదువుగా అతని చెయ్యితీసి, వంటింట్లోకి వెళ్ళిపోయింది.

వంటిల్లు సర్ది, వసారాలో పేపర్లు ముందేసు
కూర్చుంది. పదిగంటలకు ప్రక్కవాటాలోంచి పరిచితమై
ఆర్తనాదం వినిపించింది. తప్పతాగివచ్చి భారతిని పట్టి కొ
తున్నాడు ప్రసాద్. నిర్మల హృదయం బాధగా మూల్గింది
తన అన్న యెంత అపురూపంగా చూచేవాడు.

"నిర్మలా !"

"ఊఁ !"

"ఆ అమ్మాయికి పరిష్కారం లేదా, విముక్తి లేదా!
బయటకు వచ్చి, బాధగా అడిగే, అమాయకంగా కన్పిం
భర్తను అలాగే చూస్తూ ఉండిపోయింది.

"మాట్లాడు నిర్మలా?"

"మీరు ధైర్యం చేయాలి."

"ఎలా ?"

"సూర్యప్రకాష్‌కి భారతిని ముడిపెట్టడమే."

"నిర్మలా!... అసంభవం. అన్నయ్య యిందాక అ
మాట వినలేదా ?"

"బాధపడటం అనవసరం" విసురుగా లోపలికి వె
పోయింది నిర్మల. అతనలాగే భారతి ఏడ్పు వింటూ నిల
న్నాడు.

# 19

ఆదివారం కావటంతో శాస్త్ర తీరికగా కూర్చు
పూలమాల కడుతుంది నిర్మల. దగ్గరే కూర్చుని దిం
కవరుపై ఎంబ్రాయిడరీ చేస్తుంది నందిని.

"అమ్మా ! అన్నయ్యను చూడాలని వుంది."



"ఇంకో నెలయితే వాడి పరీక్షలు అవుతాయి. వచ్చే
స్తాడు."

"అన్నయ్యకు క్లాసు వస్తుందా అమ్మా ?"

"మీ అన్న సంగతి నాకెలా తెలుస్తుందే ?" నవ్వింది
నిర్మల.

"ఆఁ ఆఁ ! వస్తుంది క్లాసు ! మెట్రిక్‌లో కాపీ కొట్టి
పాసయినట్టు కాదు." వాళ్ళను దాటుకుంటూ పోతూ, వంక
రగా నవ్వాడు ప్రసాద్.

"మా అన్నేం ..."

"నందీ !" తల్లి మృదువయిన మందలింపుకు నోరు
మూసుకుంది. ప్రసాద్ ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

"అది కాదమ్మా...అందరితో అలాగే వాగుతాడు"

"వాగనీయమ్మా! యెవరొద్దన్నారు ? ఇలాంటి విమ
యాలు వినొద్దు తల్లీ!" నిర్మలమాట పూర్తి కాక పూర్వమే
భారతి అరుపులు, దబదబమన్న చప్పుడు విన్పించింది.

"వీడికిదేం రోగమో ? ఆ పిల్లను అలా చంపేస్తాడు."
అంటుండగానే చాకలికుర్రాడు, ముఖం దించుకుపోతున్నాడు.

"ఏమిటి నరిసిగా ?"

"ఏందో తల్లీ ! గొప్పోల మాటలు. నాకూ తోబుట్టిన
వారున్నారు. ఇంత అన్యాయమా ?"

"ఏం జరిగింది ?"

"నాల్గు రోజులనాడు బట్టలకొస్తే భారతమ్మ చీర ఇస్త్రీ
చేయమంది. ఆ యమ్మ అంతగా అడిగిందని, మీ చీరలతో
చేసి తీసుకు వచ్చానమ్మా ! దానికి ప్రసాద్‌బాబు యెన్ని

మాట లంటున్నాడని. 'రంకుదాన' అంటూ ఆ పిల్లను చంపే
త్తుండాడు" వాడు వడిగా వెళ్ళిపోయాడు.

'ఛీ! చాకలివాడితో చెల్లెలికి రంకుగట్టే అంత నీచాని
దిగాడా ప్రసాద్ !'

"పిన్నీ ! నన్ను రక్షించు... నన్ను చంపుతారు పిన్నీ !"
వేటకాని గురి తప్పించుకొనే లేడిలా పరుగులు పెడుతూ
వచ్చింది.

"ఆగు... ఈ రోజు నీ అంతు చూస్తాను" చల్లగుంజ
తాడుతో పరుగెత్తుకు వచ్చాడు ప్రసాద్"

"ప్రసాద్ ! ఆగు.

"నువ్వు యెవతివే ఆగమనటానికి ?" వ్యంగ్యంగా
అంటూ, భారతి జడపట్టి లాక్కుపోయాడు. బావి గట్టుపై
పడేసి యెడా పెడా వాయించాడు.

"ఏమిట్రా గోల !" వెంకటరావు వచ్చాడు.

"ఒకటి యెవడితోనో లేచిపోయింది. రెండవది చా
లాడితో లేచిపోవాలని చూస్తుంది."

"ఈ పిల్లలు నా కడుపున చెడపుట్టారు దేవుడో..."
అంటూ భాగ్యలక్ష్మి రాగాలు తీస్తుంది.

"భారతీ !" తండ్రి గర్జిస్తూ రోకలిబండ తీసుకు ముందు
కురికాడు.

"ఆగండి !" నిర్మల పరుగెత్తింది. అప్పటికి రోకలి జా
సగం భారతిమీద, మరో సగం నిర్మలమీద పడింది. నిర్మ
నుదుటికి తాకిన పొన్ను నుదుటిని చీల్చింది. ఎర్రగా రక్త



కారుతుంది. మరదలి రూపం చూచి, ఆవేశం చల్లారగా
అదిరిపోయాడు.

"అమ్మా !" తల్లిని కౌగలించుకుని బావురుమంది
నందిని.

"అల్లరి చెయ్యకమ్మా! అక్కయ్య దిమ్మెరపోయింది.
డెటాల్, దూది పట్రా" నందిని పరుగెత్తింది.

"ఈ హింసకంటే ఒకేసారి ఇంత విషం యివ్వరాదండి
ఆ పిల్లలకు" అన్నది బావను తీక్షణంగా చూస్తూ.

"నువ్వు యెవత్తివే ?"

"ప్రసాద్ ! నువ్వు మరో అమ్మకొడుకువయి బ్రతికి
పోయావు, నా కొడుకువే అయితే ముక్కలు ముక్కలుగా
నరికి కాకులకు వేద్దు" అని, వంగి భారతిని లేవదీసింది. ఒక
చేత్తో భారతిని పట్టుకుని రెండో చేత్తో నుదురు ఒత్తుకుని తన
వాటాలోకి వెళ్ళిపోయింది.

దెబ్బలకు కాపడం పెడుతూ కూర్చుంది నిర్మల.
భాస్కర్ వచ్చి నానామాట లన్నాడు.

"మొన్న చెప్పనే చెప్పారు. తమ జోలికి రావద్దని
బుద్ధి వుందా ?"

అతనివంక ఓసారి చూచి తల వంచుకుంది.

"మాట్లాడవేం ? వాళ్ళు అనే మాటలు విను"

ఓ నిట్టూర్పు విడిచి ఊరుకుంది.

"పిన్నీ !"

"ఏమ్మా ! కాఫీ త్రాగుతావా ?"

"నాకింత విషం ఇవ్వు పిన్నీ !" భోరున ఏడ్చింది.
"నా మూలంగా నువ్వెంత దెబ్బతిన్నావు ?"

"ఫరవాలేదు, భారతీ! నే నో మాట చెబుతాను వింటావా? అన్నది తల నిమురుతూ

"చెప్పు పిన్నీ! చావమన్నా చస్తాను."

"బతుకు కావాలని బ్రతిమాలుతావులే" చిరుగా నవ్వింది.

"ఏమిటో చెప్పు, పిన్నీ!"

"కాస్త విశ్రాంతి తీసుకో. తొందరగా తెముల్చుకునే విషయము కాదు" భారతిచేత పాలు త్రాగించి, మాత్ర యిచ్చి బయటకు వచ్చింది. ప్రక్క వాటాలో ప్రసాద్ చిందులూ, భాగ్యమ్మ నిష్ఠురోక్తులూ విన్పిస్తూనే వున్నాయి.

"అమ్మా! ఇలా చాతకానివారిలా ఊర్కోవటం ఏమిటో నా కర్థంకాదు" చిందులు తొక్కాడు చందు. "ఈరోజు వాళ్ళో నేనో తేలిపోవాలి."

"చందూ!"

"ఏమ్మా?"

"వెళ్ళి పెదనాన్నను కొట్టు."

"అమ్మా!"

"వెళ్ళరా. నువ్వు ఆయన్ని కొట్టు. ప్రసాద్ నాన్నను కొడతాడు. మళ్ళీ నువ్వు వాడిని కొట్టు. వాడు నిన్ను తంతాడు. కక్షలు పెంచుకుని ఒకరిని ఒకరు చంపుకుని హాయిగా చావండి."

తల్లివంక ఒకసారి చూచి చరాచరా వీధిలోకి వెళ్ళిపోయాడు.



"ఛీ, ఛీ! ఈ ఊరొచ్చి, బుద్ధితక్కువ పని చేశాను" అంటున్న భాస్కర్ మాటలు చిరునవ్వుతో వింది.

అందరూ నిదురబోయినా నిర్మలకు నిదుర రావటం లేదు. తను చేస్తున్న పని మంచిదేనా అని ఒకటే ఆలోచన. ఒక మంచిపని చేస్తే దూషణలూ, భూషణలూ వినాలి. అవి సహృదయంతో యెదుర్కొ గల్గినవాడే పురుషులలో పుణ్య పురుషు డంటారు. తనను ఏమంటారో మరి?

## 20

"భారతీ!"

"భారతమ్మా!" ఇంట్లో అందరి పిలుపులు గోలగా వినిపిస్తున్నాయి. "అక్కా! నాకు అన్నం" చిన్నపిల్లలు అరుస్తున్నారు. నిర్మలగుండె లదరసాగేయి.

"పిన్నమ్మతో కూర్చుంటే ఏం తెలియదు దీనికి?"

"మనకు ఆవిడకు పోలికా?" బావగారి వ్యంగ్యం వింది నిర్మల.

"ఏమిట్రా పెద్దబ్బాయి, ప్రతిదానికి అలా చిన్న కోడల్ని చులకనచేయటం ఏం బావుంది?"

"అవును లే. మేం సంవత్సరాలుచేసిందంతా మట్టికొట్టుకు పోయింది. ఆవిడ టింగురంగా అంటూ ఓ ఏడాదిపాటు చేసిందో లేదో అప్పుడే దేవతయిపోయింది. యెన్నాళ్ళో ఈ సంబడం చూస్తాను" భాగ్యలక్ష్మి రుసరుసలాడింది.

"నా కాళ్ళూ చేతులూ విరిగితే యెవరూ చెయ్యలేదు. ఈ కోపంలో పెద్దా చిన్న అన్న అన్నజ్ఞానం బొత్తిగా


మాదిరెడ్డి సులోచన
సంసార నౌక
సంసార నౌక
మాదిరెడ్డి సులోచన

నశించిపోయింది" పడుము పట్టుకుని యింట్లోకి వచ్చింది. సెలవులలో కొడుకు వచ్చాడని చేగోడీలు చేస్తుంది నిర్మల.

"ఈ పిల్ల యెక్కడుంది ?"

"ఇక్కడికి రాలేదు" నిర్మల కంఠం కొద్దిగా వణికింది.

"యిల్లయినా విడిచి యెరగదే. ఎక్కడికి పోతుంది ? మొన్న కొట్టిన దెబ్బలకు భయపడి ఏదయినా అఘాయిత్యం చేసిందా ఏం ?"

"అలా యేం చెయ్యదు, కాసేపు విశ్రాంతి తీసుకుందాం అని పొలాలవైపు వెళ్ళిందేమో?" చేగోడీలు చుట్టు తిరిగినట్టే ఆలోచనలూ తిరుగుతున్నాయి. అవతల వాటాలోంచి గోల విన్పిస్తూనే ఉంది. ఒకేసారి గోల ఆగిపోవటంతో నిర్మల ప్రాణం బిగబట్టి వింటుంది.

"భ...భారతీ ! వెంకటరావు పిలుపు విని యేదో ఉపద్రవం రాబోతుందని ఊహించింది.

"అవునండీ ! మీ భారతి ... ఇకనుండి మా భారతి. నేను పెళ్ళి చేసుకున్నాను" మృదు గంభీరంగా సూర్యప్రకాష్ గొంతు విన్పించింది.

"ఏమిటి ?"

ఆ తరువాత గోలగా అందరిగొంతులు విన్పించాయి. సరిగ్గా ఏం అర్థంకాలేదు. భాస్కర్ గొంతు విన్పించింది.

"ఏమ్మా ? మీకేం అపకారం చేశాం మేం ?" ప్రశ్న వచ్చిన వైపు తిరిగింది. అక్కడ భాగ్యలక్ష్మి నిల్చుంది.

"అన్నింటికీ దాన్ని అనుకోవటం దేనికే ? నీ బిడ్డలు చేసిందానికి ?" అన్నమ్మ కలుగజేసుకుంది.



"నా పిల్లలు అంటేనే నీ కోడలికి కడుపు కుట్టు. నా పిల్లలకు గతిలేనట్టు గుడిలో పెళ్ళిచేస్తుందా ? అంతా కుట్ర, దగా" నోటికి వచ్చినట్టు అరుస్తుంది. అవతల భాస్కరరావు పరిస్థితి అలాగే వుంది. వెంకటరావు, చిన్నారావు నిలదీస్తున్నారు.

"నాకేం తెలియదు" అతను చెప్పేది యెవరికీ విన్పించలేదు.

"అమ్మా ! పిన్నికేం తెలియదు..." భారతి అడ్డు వచ్చింది.

"ఏదీ, ఆ మాట మళ్ళీ అను. పళ్ళు రాల్తాయి" పిన్నికి తెలియకుండా అతనీ వూరెలా వచ్చాడు ?"

"చెప్పు నిర్మలా !" భాస్కర్ మరోవైపు గుమ్మందగ్గర నిలబడి అడుగుతున్నాడు. నిర్మల పిండి పక్కకుపెట్టి లేచింది. చేతులు కడుక్కుని వచ్చింది.

"అవును. నేనే రాశాను. భారతి ఆత్మహత్య చేసుకుంటానని ఏడిస్తే, నేను వారించాను. అక్కయ్య అంగీకరించదీ పెళ్ళికని నాకు తెలుసు. వయసు వస్తుందా, పోతుందా ? మీ దృష్టిలో తప్పయితే ఏ శిక్ష కయినా సిద్ధమే" అన్నది నిర్భయంగా.

"ఆఁ ! చూచారా ? మన పేరమ్ముడుపోయిందా ఊరా ? గతిలేనట్టు పిల్లను పాడుచేసింది ..." భాగ్యమ్మ రాగాలకు యెవరు చలించలేదు, మంచి విషయాలలో కాకపోయినా చెడు విషయాలలో కీలెరిగి వాత పెడుతుంది భాగ్యమ్మ.

"పెద్దవాళ్ళు అత్త, మామలున్నారు. వారి చెవిన వేయకూడదా? పెద్ద మనురాలని యెంత మురిసి ముక్కలయ్యారు. వారు కాళ్ళు కడిగి కన్యాదానం చేద్దురు" ఈ విషయం అన్నమ్మ నెంతో ఆనందపరిచింది.

"అవునే నిర్మలా! దిక్కులేనట్టు అలా చేశావేం?"

"అదంతా ఆలోచించలే దత్తయ్యా! భారతి ఆత్మహత్య చేసుకుంటానని పదేపదే అనటం మూలాన అలా చెయ్యాల్సి వచ్చింది."

"భాస్కర్! వసంత లేచిపోవటం కూడా నీ భార్య చాతుర్యంవల్లే అనిపిస్తుంది" వెంకటరావు తలాడించాడు.

"బావగారూ." నిర్మల నిర్దాక్షిణ్యంగా హింసింపబడే పక్షిలా గిలగిలలాడింది.

'ఉన్నమాటంటే అంత ఉలుకు దేనికి?" భాగ్యమ్మకు ధైర్యం వచ్చింది. "నీ మొగుడిని ఆడిచ్చినట్టు అందరినీ ఆడించకు."

ఆమె నిందుచూలాలు. దేవుడిచ్చిన బిడ్డలని నమ్మే వ్యక్తి. మరే విషయములో భగవంతుడిని నమ్మని వ్యక్తి.

"నిర్మలా! వాళ్ళెలాపోతే నీకేం? చెప్పు. అన్నయ్యను అవమానించాలనే కదా?" కోపంగా చూస్తూ ముందుకు నడిచాడు.

"కాదండీ! నిజం. నామాట నమ్మండి" అతనా మెమాట వినలేదు. అందరూ ఏం జరుగుతోందో తెలుసుకునేలోగా, నిర్మల స్పృహ తప్పిపోయింది.



"భాస్కర్ గారూ! పిచ్చా? పెళ్ళికొడుకు మెరుపులా ముందుకు దూకి అతన్ని దూరం జరిపాడు. నందిని 'అమ్మా!' అంటూ తల్లిదగ్గర కూర్చుని ఏడుస్తుంది.

"బాబాయ్!" భారతి వచ్చింది.

"వెళ్ళు! నా కళ్ళముందునుండి వెళ్ళు..." తల్లి తండ్రుల అరుపులకు భారతి బయటికి నడిచింది.

"మీరు నిర్మలగారిపై చేయిచేసుకుంటే ఒట్టే!" సూర్యప్రకాష్ నీళ్ళు తెచ్చి ఆమె ముఖాన చల్లాడు. మంచం కోడు కొట్టుకుని తెలివి తప్పింది. అయిదు నిమిషాలకు తెప్పరిల్లింది. ఈ లోగా అవతల తండ్రి, పెద్ద కొడుకు మంతనాలు జరుపుతున్నారు. మరో అరగంటలో గొడవకు కారణం అయిన నూతన దంపతులు వెళ్ళిపోయారు.

"భాస్కర్!" గుమ్మంలో నిలబడి, కూర్చుని కూతురిచ్చే మంచినీళ్ళు తాగుతున్న భార్యను చూస్తున్న అతనికి తండ్రి పిలుపు వినిపించింది.

"ఏం నాన్నగారూ!"

"నువ్వెప్పుడో మాకు దూరం అయ్యావు. నీ భార్య బజార్లో తిరుగుతూ ఉద్యోగం చేసినప్పుడే మా పరువు పోయింది. రాయనవంశగౌరవం మంటకలిసింది. ఈనాడు నీ భార్యను విడువుమని అనటం లేదు. కాని ఈ యిల్లు విడిచి పోవాలి. మీరొచ్చిన కొన్ని రోజులకే రెండనర్థాలు జరిగిపోయాయి. వున్నదేదో తిని, పరువుగా వుంటాం."

"మంచిది నాన్నగారూ!" చరచరా బయటకి వెళ్ళిపోయాడు. నిర్మల అలాగే కూర్చుంది.

# 21

ప్రొలాల దగ్గర వేసిన పెడ్డు పూర్తి అయింది. మూడు పెద్ద గదులతో విశాలంగా తయారయింది. వాసు తృప్తిగా నిట్టూర్చాడు.

"ఒరేయ్ చందూ! నేను కాలేజికి వెళ్ళిపోవాలి. రోజు ఒకగంట పనిచేస్తే ఈ అరుగులు చక్కగా తయారవుతాయిరా."

"చూడన్నయ్యా! మళ్ళీ వచ్చేసరికి సిద్ధం అవుతుంది"

"అది సిద్ధంచేస్తూ చదువు అశ్రద్ధచేయకు. ఫైనలియర్."

"చూస్తావుగా!"

"చిన్నన్న ఉత్త పుస్తకాల పురుగు, పెద్దన్నయ్యా!" నందిని ఏడ్చింది.

"నేనేం కాదు నువ్వే!"

వాళ్ళను చూస్తూంటే తన బాల్యం గుర్తుకు వచ్చింది భాస్కర్ కు. తాము ఇలాగే ఉండేవారు. ఈనాడెందుకిలా అయింది. తప్పెవరిది? అతనికి అంతా అయోమయంగా వుంది.

"నాన్నగారూ! మీవాళ్ళు ఊర్లో ఉండొద్దంటే మానేస్తారా?" కాస్త కటువుగా అడిగాడు వాసు.

"వాసూ!" తల్లి గర్జింపు విని వాసు గతుక్కుమన్నాడు. నెలరోజులనుండి భార్యాభర్తలు మాట్లాడుకో లేదు. అతని ఆజ్ఞానుసారమే ఇల్లు ఖాళీచేసి పొలందగ్గరున్న గుడిసెలో కాపురం పెట్టి, ఈ ఇల్లు వేశారు.



"ఎందుకు నిర్మలా! వాడినికేకలు వేస్తావ్?" అన్నాడు. అతను పేలవంగా నవ్వాడు.

"వాసూ!" దగ్గరకు పిలిచాడు. "నీ కొత్తపెన్ను బాగా రాస్తుందా?" ఆప్యాయంగా అడిగాడు. పెన్ను సంగతి తండ్రి యెందుకు అడిగాడో వాసుకే మాత్రం అర్థం కాలేదు.

"చవకయినా పాతపెన్నే బాగా రాసేది నాన్నారూ!"

"మరెందుకు నీ పెన్నులోసారి చెల్లికి, తమ్ముడికిచ్చావ్?"

"మీరిమ్మని..." అంతే ఠక్కున ఆగిపోయాడు వాసు. తండ్రి మృదువుగా చెబుతూ తన ఇల్లు విడిచి రావటం సమర్థించుకుంటున్నాడని అర్థం అయింది.

"పూర్తిచేయవేంరా? నేను ఇమ్మన్నానని యిచ్చావు కదూ?"

"క్షమించండి నాన్నగారూ!" అంటూ డనుకుంది నిర్మల. అతను దృఢంగా, నిర్భయంగా తన అభిప్రాయం చెప్పాడు.

"మీరిమ్మన్నారని కొంత, వాళ్ళ కుపయోగం అనుకుని పూర్తిగా వారికి నా వస్తువులిచ్చాను, నాన్నగారూ! మీరు 'పారేయిరా' అంటేమాత్రం ఆలోచించి చేస్తాను."

"అంటే?"

"మీరు పెదనాన్నగారికి చేసిన సాయం బూడిదలో పోసిన పన్నీరని చెప్పటమే నా ఉద్దేశం. మీకొక విషయం తెలుసో లేదో, మనం ఇల్లు ఖాళీ చేసిన మర్నాడే తాతగారి

అనుమతితో ప్రసాద్ వ్యాపారం చేస్తాడంటూ, యిల్లు తాకట్టుపెట్టి అప్పు తెచ్చాడు."

"వాసూ!"

"నిజమండి నాన్నగారూ! అలా తాకట్టుపెట్టేరోజు రాయనవంశం సంగతి తాతయ్య ఆలోచించకపోవటం శోచనీయం."

"అన్నయ్యా! ఈ ఫోటో తగ్గించడం కుదరడంలేదు" బయటి గదిలోంచి నందిని కేక విని వెళ్ళిపోయాడు వాసు.

"వింటున్నావా నిర్మలా!"

"ఊఁ."

"నీ కొడుకు వ్యక్తిత్వం గలవాడుగా తయారవుతున్నాడు సుమా!"

"చిన్నవాడు!"

"వాడు అలా మాట్లాడినాడని బాధలేదు. మనిషికి వ్యక్తిత్వము, కఠినత్వము అవసరం" అన్నాడు ప్రసన్న వదనముతో.

ఆమె ఏం మాట్లాడలేదు.

"ఇంకా కోపమేనా?"

"నాకెందుకు కోపం? ఉంటే మీకుండాలిగాని?"

"నాకేం కోపంలేదు నిర్మలా!" మంచిపనిని అభినందించటం పోయి, పశువులా ప్రవర్తించాను."

"ఫరవాలేదు. సంసారమన్నాక కలతలు, గొడవలు ఉంటాయి. మీరు మనస్ఫూర్తిగా నేను చేసినపని తప్పని అంగీకరించకపోతే నాకదే చాలు."



"భారతి తన కొచ్చీ రాని తెలుగులో ఉత్తరం రాసింది చూస్తావా?"

"సంగతులు చెప్పండి. చాలు."

"పావు ఉత్తరం భర్తను గూర్చి, మిగతా సగం నిన్ను పొగడడం, మిగిలిన పావులో అందరికీ నమస్కారాలు, ఆశీస్సులు. అది ఒకదరి చేరిందంటే నాకెంతో తృప్తిగా ఉంది."

"ఆ పిల్ల చెఱ విముక్తి అయింది, అదేచాలు."

"చిన్నదొరా!"

"ఎవరూ? అంజయ్యా! రా."

"అదికాదు, చిన్నదొరా! భాగ్యమ్మకు నొప్పులు వస్తుండాయి, పోతుండాయి. పట్నం పోదాం జీపు దొరుకుతుందేమో అడగమన్నారు."

"అలాగా. నువ్వు వెంటనే వూర్లోవున్న డాక్టరు దగ్గరి కెళ్ళు. నేను చూసి తీసుకువస్తాను." ఆదుర్దాగా బట్టలు వేసుకున్నాడు భాస్కర్. హడావుడిగా వెళ్ళిపోయాడు.

"అమ్మా! నేనో మాట చెప్పనా?" వాసు వచ్చాడు.

"నాకు తెలుసు, నీ అభిప్రాయం. మూడు రకాల మనుష్యులుంటారు. వాసూ! కొందరు తమంతట తామే మంచి చెడు గ్రహిస్తారు. మరికొందరు ఒకరు చూచి నేర్చుకుంటారు, చెబితే వింటారు. మూడోరకం వారుంటారు— తమకు తోచదు, ఒకరు చెబితే వినరు" తల్లి యెవరిని గూర్చి అందో అర్థం అయింది.

"సరేలే అమ్మా! నా బట్టలు, అవీ సర్దుకుంటాను."

"నేను సర్ది పెట్టాను. జాగ్రత్తగా చదువుకో బాబూ! ప్రపంచంలో ఎన్నో అందాలు, ఆనందాలున్నాయి. వాటిని చూచి ఆనందించటం నేర్చుకోవాలి. అనుభవించాలనే కోర్కెలు పెంచుకోకూడదు."

"భలేదానివమ్మా!" నవ్వుతూ, మిగిలిన వస్తువులు సర్దుకోసాగేడు.

రాత్రి ఎనిమిదింటికి తిరిగివచ్చాడు భాస్కరరావు.

"అక్కయ్య కెలా ఉంది?"

"క్షేమంగా ఉంది. కవలలు పుట్టారు."

"ఇక్కడేనా?"

"ఇక్కడే! నేను వెళ్ళేసరికే డాక్టరు వచ్చారు. ఫార్సెప్స్ కేస్ అనుకుంటాను. ఇద్దరూ కొడుకులే" షర్టు వంకెకు తగిలించాడు. ఆమె మరేం మాట్లాడక వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

## 22

"ఈ రోజు మీ బావగారింట్లో ఊరందరికీ భోజనాలు. మీకు తెలియదా నిర్మలమ్మా!" కూరలు సంచి తెచ్చి అరుగుమీద పెట్టాడు అంజయ్య.

"విందా? ఎందుకు?"

"ఇందరాడపిల్లల తరువాత కొడుకులు పుట్టారని. లవకుశలని పేరుకూడా పెట్టారమ్మా."

"సంతోషమేగా."



ఆమె మనసు ఎటో పోతుంది-బావగారికి ఇంతడబ్బు ఎలా వచ్చిందా అని. ఆమె ఆలోచన గ్రహించినట్లే అంజయ్య వివరాలు చెప్పాడు.

"ఎందుకూ పనికి రాడనుకునేవాళ్ళము కదమ్మా సుధాకర్ బాబు! ఎంత పనివాడయ్యాడో? పట్నంపోయి ఏదో యాపారం అంట! నెలరోజులలో వందలు సంపాదించుకొచ్చాడమ్మా!"

సుధాకర్ సంపాదన ఎలాంటిదో నిర్మలకు తెలియని విషయం కాదు. సాయంత్రం భర్త వచ్చాక ఈ విషయాలు చెబుదామనుకుని మానేసింది. అతనీ మధ్య నిర్లిప్తంగా ఏదో పోగొట్టుకున్నట్టు ఉంటున్నాడు. మరి కాసేపటికి అతనే వచ్చాడు ఆమె కూర్చున్న చోటికి.

"నిర్మలా!"

"ఏమండీ?"

"ఆఁ ...! ఏంలేదు" మాటమార్చి, తన క్యాంప్ విషయము చెప్పాడు.

"అమ్మా!" హడావుడిగా వచ్చాడు చందు.

"ఏమిట్రా?"

"నో ..." ఏమనుకున్నాడో వెనుదిరిగాడు.

"ఏమిట్రా అంటే వెనుతిరిగిపోతావేంరా?"

"అది కాదమ్మా! ప్రసాద్ అన్నయ్య గొల్ల రాముల్ని ఏడ్పించాడట! వాళ్ళంతా అన్నయ్యను కొడతామంటే, నాయనమ్మ వాళ్ళింటికిపోయి తిట్టిందట."

"ఊఁ ...! తిడితే ...?"

"మరేమో ..." చందు సంశయాత్మకంగా తండ్రి వంక చూచాడు.

"చెప్పరా! ఊరంతా చెప్పకోగా లేంది మీ అమ్మకు చెబితే ఏం ?" అని ముఖం మరోదిక్కు తిప్పకున్నాడు.

"వాళ్ళంతా నాయనమ్మ ముఖాన మసిపూసి పంపేశారుటమ్మా. అన్నయ్యను చాలా అవమానం చేశారు."

"ఏమండీ, మీకు తెలుసా ?"

"ఊఁ! ఈవూరు వచ్చి చాలా పొరపాటు చేశాను అనిపిస్తుంది నిర్మలా! అదేకాదు, యింటికి వచ్చాక వదిన అమ్మను కొట్టిందట."

"ఆఁ...! యెవరు చెప్పారు ? ఈరోజు పిల్లలకు పేరు పెడుతున్నారని విన్నాం."

"పెడితే! అమ్మలేంది జరుగదా ? వెళ్ళి యిక్కడికి రమ్మని యెంతో బ్రతిమాలాను. తన ప్రాణం అక్కడే పోవాలని పట్టుపట్టింది. ఏం చేయాలో చెప్పు."

"బావగారు ఏమీ అనలేదా ?"

"అతను అమ్మా నాన్నను పట్టుకు దులిపాడట. నాన్నగారికి నేనిచ్చిన డబ్బు మీదపడి లాక్కున్నారట."

"ఎవరిపై కోపంతో పిల్లలను అలా తయారు చేస్తున్నారో తెలియదు. నేను వెళ్ళి అత్తను తీసుకురానా ?"

"అవమానం తప్ప ప్రయోజనం ఉండదు నిర్మలా !" ఇక్కడ దంపతులు బాధపడుతున్నారు. అటు వృద్ధ దంపతులు ఇంకెన్ని అవమానాలు చూడాలో భగవంతుడా అని



కుమిలిపోతున్నారు. భాగ్యలక్ష్మి వెంకటరావు మాత్రం ఆనందంగా అతిథులను సాగనంపారు. పిల్లలందరినీ చుట్టూ పెట్టుకుని కూర్చుంది.

"పిల్లలో, పిల్లలు వద్దో అంటారు. వారితోనే ఇంటికి కళ" అన్నది. ఆమె వసంతను, భారతిని మరిచిపోవటానికి ప్రయత్నిస్తూ.

"కాదు మరి! పెద్దాడు వ్యవసాయం చూసుకుంటాడు రెండోవాడు వ్యాపారం. వీళ్ళిద్దరూ డాక్టరు, ఇంజనీరు అవుతారు" అతను కొడుకులను ముద్దులతో నింపేశాడు.

"సుధడు వ్యాపారం ఇలాగే చేస్తే, పిల్లల పెళ్ళిళ్ళు ఘనంగా చేద్దాం."

"అవునురా. ఈ సారి అనవసరంగా ఖర్చులు చేయకోకు."

"వాడేం అనవసరంగా చేయటంలేదు నాన్నా! పట్నంలో అలా ఉండాలి" తమ్ముడిని బలపరుస్తూ చూచాడు. సుధాకర్ చాలా మారాడు. రెండునెల్లలో సైడు బిన్స్ పెంచాడు. సన్నని మీసం ఉంచాడు. ఒక చేతికి గడియారం, రెండోచేతికి బంగారు గొలుసు పూలరంగడిలా వేసుకున్నాడు. ఖరీదయిన బట్టలు, సెంటువాసన, నుదుటపడే వెంట్రుకలు. అవి అన్నీ చూచి 'మా అన్న సినిమా యాక్టర్లా' వున్నాడు అనుకున్నారు చిన్నపిల్లలు.

"అవును నాన్నా ! కాలం మారింది. ప్రతివాడు బట్టలకే విలువ యిస్తాడు. మనకోసం కాకపోయినా వారికోసం వేషం వేయాలి మరి" ఆరిందాలా చెప్పాడు, తల్లితండ్రులకు

ప్రయోజకుడయిన కుమారుడు. ఘనంగా వీడ్కోలు తీసుకుని పట్నం చేరాడు. వారానికోసారి రావటం, ఇంతో అంతో డబ్బు తేవటం సుధాకర్ కు అలవాటయింది. అది యెలా వస్తుందని వెంకటరావు అడగలేదు. తండ్రిగా బాధ్యత తెలిసిన వ్యక్తిగా కొడుకు క్షేమము అతనికి యెంతో ముఖ్యము. అతనది విస్మరించాడు. మూడో నెల నాటికి అతని గాలిమేడలు కూలిపోయాయి.

స్థానిక వార్తాపత్రికలనిండా సుధాకర్ అరెస్టు వార్త ఫోటోతో సహా పడింది. అతను ఘరానా దొంగతనాలు చేస్తున్నాడని వివరాలు, విశేషాలు తూర్ణంగా యిచ్చారు. అది చూస్తూనే మొదలు నరికిన మ్రానులా పడిపోయాడు చిన్నారావు. ఆయన మళ్ళీ లేవనేలేదు. "రాయన వంశము యెంతగా జారిపోయింది?" అంటూనే ప్రాణాలు వదిలాడు.

## 23

కొడుకును చూచి, డబ్బులు ఇచ్చి, కావాల్సిన సామాన్లు కొనుక్కుని యింటికి బయలుదేరాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది. భాస్కరరావు వదినకు చీరలు బొత్తిగా లేవని హేండులూమ్ సెంటరుకు వెళ్ళి రెండుచీరలు తీసుకుని వచ్చాడు. శ్రీపురంలో బండి దిగేసరికి తొమ్మిది గంటలు దాటింది. ఇంతరాత్రి ఏం వెళతాను అనుకున్నాడు. ఓసారి పిల్లలను చూచినట్టు ఉంటుంది. వెంకటరావు బొత్తిగా ఇంటి పట్టున వుండడంలేదు. తండ్రి వుండినినాటి భవంతివైపు నడిచాడు. నిండు చూలాలు భాగ్యలక్ష్మి వాకిట్లో నిల్చుని



బయటికి చూస్తుంది. చీకట్లో భాస్కరరావును సరిగ్గా గుర్తుపట్టలేదు. భర్తే అనుకుంది.

"వచ్చారా?" అని, వెలుగులోకి వచ్చిన మరిదిని చూచి రెండు అడుగులు వెనక్కు వేసింది.

"ఏం వదినా! అన్నయ్య రాలేదా?"

"లేదు" అన్నది నిరాశగా.

"యెక్కడుంటారు?"

"ఏం చెప్పను, నాయనా? కొడుకు గొల్లమల్లితో గుండ్లపల్లెలో ఉంటున్నాడు. తండ్రి దినమంతా గుండెమ్మ కల్లుపాకలో వుంటాడు" ఆమెకు కన్నీరు ఉబికివస్తోంది. వదిన వంక నిశితంగా చూచాడు. అతనికి తెలుసు, ఈనాడు కూడా నిజాన్ని ధైర్యంగా అంగీకరించే తెలివి లేదని. తను ఏమన్నా అపార్థాలకు దారి తీస్తుందని తెలుసు.

"ఈ చీరలు తీసుకో వదినా! ఇప్పుడే వస్తాను" అతను చరచర నడుస్తూ గుండెమ్మపాక చేరుకున్నాడు. అలగా జనంతో పాటు కలిసి వెంకటరావు తాగుతూ, బూతులు పేలుతున్నాడు. భాస్కరరావుకు ఆగ్రహం అవధులు దాటి పోయింది. ఒకవంక దుఃఖం కూడా వస్తోంది.

"గుండెమ్మ!"

"యెవరూ!" బయటికి వచ్చింది. "చిన్నదొరలా!" వణికిపోయింది.

"అన్నయ్య నిలా పిలువు" తనను తాను సంభాళించుకున్నాడు. ఆమెది వ్యాపారం, ఎవరొచ్చినా వద్దనగూడదు. త్వరగా పాకలోకి వెళ్ళింది.

"రాయనదొరా! మిమ్మల్ని రమ్మంటున్నారు!"

"ఎవరే దొరా! అందరికీ స్వర్గం చూపే దొరసాని నీవు."

"దొరా! బయట ..."

"బయట ఏముంది? యెవరున్నా నాకు భయంలేదు" ఫక్కున నవ్వాడు.

"అన్నయ్యా!" పాకముందు నిలబడి గట్టిగా పిలిచాడు. వెంకటరావు మత్తు పూర్తిగా వదిలిపోయింది.

"ఎవరూ? భాస్కర్" అతను తూలుతూ లేచాడు.

"నువ్వెందుకు వచ్చావురా?"

"నువ్వు రాంగా లేనిది నేను రావటం తప్పా?" [illegible]సంగా అడిగాడు. ఏం జవాబు లేదు. ఇద్దరూ యింటిదారి పట్టారు. దారిలో తూలుతూ ఉంటే చేయి ఆసరా ఇచ్చాడు. కల్లేకాదు, కావుసారా కూడా త్రాగుతున్నాడులా వుంది. వాసన గుప్పుమంది.

"అన్నయ్యా! నేను మీకెలా చెప్పాలి?" భాస్కర్ గొంతు పూడుకుపోయింది. అతన్ని యింట్లోకి పంపి, చెమ్మగిల్లిన కళ్ళుతుడుచుకుంటూ తన యిల్లు చేరాడు.

మర్నాడు ఆఫీసు నుండి వచ్చి ఆ నాటి పేపరు చూస్తున్నాడు. వెంకటరావు వచ్చాడు.

"రా, అన్నయ్యా!" వేరుగా వచ్చాక మొదటిసారి వచ్చాడు వెంకటరావు.

"చందు పట్నం పోవటంతో ఇల్లంతా బోసిగా ఉంది రా."



"నిజమన్నయ్యా! వాడు పదిమంది పెట్టు భగవంతుని దయవల్ల వచ్చే ఏడు, పాసయితే నందిని వెళ్ళిపోతుంది. అప్పుడెలా ఉండాలా అన్పిస్తుంది."

"ఆ మాటే చెప్పాలని వచ్చాను. నాన్నగారు పోయాక యింట్లో వుండాలంటే భయంగావుంది. నీ వాటాలో నీ వుంటే నాకు ధైర్యంరా."

"చూద్దాంలే అన్నయ్యా!"

"జరిగింది మరిచిపోరా భాస్కర్!" తల దించుకున్నాడు. నాకు త్రాగాలని సరదాగా లేదురా. ఈ సుడిగుండంలాంటి జీవితంలోంచి యెలా బయటపడాలో తెలియటంలేదు."

"త్రాగి ఇంటిని నిర్లక్ష్యం చేస్తే సమస్యలు పూర్తి అవుతాయా అన్నయ్యా?"

"కావు. కాని తాత్కాలికంగా మరిచిపోతాం" ఓ వేడి నిట్టూర్పు విడిచాడు. ఈ జీవితం యిలా యెందుకయింది? సరిదిద్దుకోలేనంతగా పాడయింది. యిద్దరు కొడుకులు పనికి రాకుండా పోయారు. వసంత జీవితం మరో దారిపట్టి పోయింది." అతని కంఠం జీరపోయింది.

"అన్నయ్యా! యిప్పటికి మించిపోయిందేం లేదు. ఉన్న దాంట్లో గుప్తంగా కాలక్షేపం చెయ్యొచ్చు."

"ప్రయత్నిస్తానురా. నే నెందుకొచ్చానో తెలుసా?"

"ఏమయినా డబ్బు కావాలా అన్నయ్యా?"

"కాదురా! నేను తాతనయ్యాను." అతని ముఖంలో సంతోషం తాండవిస్తోంది. భారతి రాసిన ఉత్తరం. తన

పొరపాటు క్షమించగల్గితే తన కొడుకును చూడటానికి రమ్మని రాసింది. భాస్కర్ కెందుకో మనస్సు చివుక్కుమంది.

"నా సంతానంలో ఒకరయినా గౌరవప్రదమయిన జీవితం గడుపుతున్నారంటే... అంటే అది నిర్మల చలవవల్ల! ఒక్కసారి ఆమెను క్షమార్పణ అడగాలిగా."

"మనలో మనకి పట్టింపులు దేనికన్నయ్యా!"

"నా తృప్తికోసం."

"తను పొలంవైపు వెళ్ళినట్టుంది. తలుపు తీయించాలి. నాకు తీరిక లేదు. చందు లేకపోవటం తీరనిలోటు" భాస్కర్ బయటికి వచ్చి భార్యను కేకవేశాడు. పూలమొక్కలకు పాదులు చేస్తున్న నందిని పరుగులు పెడుతూ వచ్చింది.

"పెదనాన్నా! గులాబీలు యెలా పూశాయో చూశారా?"

"నీ చేతులతో నాటాక పూయకేం చేస్తాయి?" నవ్వుతూ నందినివంక చూచాడు. నిర్మల వచ్చి కాఫీ చేసింది. త్రాగి వెళ్ళిపోయాడతను.

"ఏమిటీమధ్య కాస్త సమయం దొరికితే ఆలోచిస్తారు?"

"ఏం లేదు, నిర్మలా!... భారతి చూడు యెంత మారిపోయిందో?"

"ఓ..." నవ్వేసింది తేలికగా. "అలాంటి విషయాలు ఆలోచించటమే వదిలివేయాలి. ప్రతిఫలం ఆశించిచేసే సహాయం మనల్నే వెంటాడుతుంది. మనశ్శాంతి కరువు అవు



తుంది. వాళ్ళు సంతోషంగా వున్నారా, లేదా అదే మనకు కావల్సింది."

"నే అంత తేలికగా సరిపెట్టుకోలేకపోతున్నాను సుమా!" అలసటగా మంచంమీద వాలిపోయాడు. అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చింది. అతి ప్రేమగా నిమిరింది.

"అది నేర్చుకోకపోతే బ్రతుకులేం" అతని నలాగే చూస్తుండిపోయింది. స్త్రీ ఇంటిలో జరిగే ప్రతి విషయానికీ కేంద్రబిందువు. నిర్మలకు యింత నిబ్బరం కలగటం ఆశ్చర్యంగా వుంది.

## 24

అన్నగారికి అన్ని విషయాలలో అండదండలుగా నిలిచాడు. భాగలక్ష్మి మరో శ్రీలక్ష్మికి జన్మ యిచింది. ఆపరేషన్ తప్పనిసరిగా చేయించుకుంది. వెంకటరావు అలసిపోయి వచ్చాడు.

"రేపు చేసుకుంటే కాదా పని?" వడ్డిస్తూ అడిగింది భాగ్యమ్మ.

"పనులు ఆగుతాయా? చదువుకున్న నిర్మల పనులు చేయించుకుంటుంది. నువ్వలా వచ్చి పర్యవేక్షణ చేయరాదూ?" అన్నాడు.

"ఏమంటున్నారు?"

"నిజమేనే! దొరసాన్లమంటూ కూర్చునే కాలం పోయింది."

"రోజూ తమ్ముడో తమ్ముడో అంటూ నేర్చుకున్న విషయ మిదా ?" కంట తడి పెట్టింది.

"మాటకు అడక్కుండా వస్తాయి నీళ్ళు" విసుక్కు న్నాడు. "మంచిపనులు నేర్చుకుంటే తప్పేముంది ?" తరువా అతను బాధపడ్డాడు. ఆమె శరీరంలో సత్తువ ఏముందని అటు అన్నమ్మ మగ్గినపండులా ఉంది. భర్తపోయిన దగ్గ నుండి ఓమూల పడివుంటుంది. ఎవరేమన్నా పట్టించుకోలేదు నిర్మల వచ్చి రమ్మని బ్రతిమాలింది.

"ఎందుకే ? ఇక్కడే నా ప్రాణాలు పోనీ" అంటూ కంటతడి పెట్టుకుంది. ఆమెను చూసి నిట్టూర్చాడు పె కుమారుడు. కలకలలాడుతూ యెంత బాగుండేది ? తలుచు కుని బాధపడ్డాడు.

"అమ్మా !"

"ఏమిట్రా !"

"భోజనం చేయరాదూ ?"

"కోడలూ, పిల్లలూ తినేశారా ?" లేచి కూర్చుంది అతని అంతరంగం కదలిపోయింది. వాడి కత్తితో గుం తెవరో నిర్దాక్షిణ్యంగా కోసినట్టు అన్పించింది. 'నా పిల్ల నా పెద్దాడు' అంటూ అనురాగం రంగరించిపోసిన అమ్మ తనేం ప్రతిఫలం యిస్తున్నాడు ? అందరూ తినగా మిగిలి యింత అన్నం పెడుతున్నాడు. తీక్షణంగా భార్యవ చూచాడు.

"రేపటినుండి రెండుపూటలా అమ్మకు నాతో వడ్డి చాలి" అన్నాడు కరుకుగా.



"రెండు పూటలా తిండి యెందుకురా ? నేను కండలు పెంచి కసరత్తు చేయాలా ? ఒక పూటతో అలాగే గడిచి పోనీ !"

"అమ్మా !"

"అవును నాయనా ! పెరిగే పిల్లలకు పెట్టుకోండి. యిదిగో నిర్మల రమ్మంది. రానంటే ఈ డబ్బు యిచ్చింది. దేనికయినా అవసరం వస్తుంది, తీసుకో" బొడ్డున దోపిన యిరవై రూపాయలు తీసి యిచ్చింది.

"ఇరవై రూపాయిలు ఇవ్వగానే గొప్ప అయి పోయిందా ? మేం పనికిరామా? అక్కడికేపోయి పడి వుండ రాదూ ?" కోడలు గయ్యన లేచింది. ఇదివరకులా యెదురు చెప్పలేదు. పేలవంగా నవ్వి ఊరుకుంది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు విన్పించాయి కొడుక్కు.

"నోరుముయ్యి" భార్యను కసిరాడు. "మనకుఉన్నారు పిల్లలు. మన గతి ఏమిటో ఆలోచించు."

"అందరూ నన్నే అంటారు. ఈ కొంపలో నేను సుఖ పడిందేంవుందో? విసుర్లూ, కసుర్లూ జీవితాంతం తప్పేలాలేవు" రాగాలు మొదలు పెట్టింది. అతను విసుగ్గా బయటకు వెళ్ళాడు. వ్యవసాయం ప్రారంభదశలో వుంది. దానికితోడు చిన్న వ్యాపారం కానాలి ఊర్లో మరో యిద్దరు పోగయి ఇదే విషయం చర్చించారు. డెయిరీఫార్మ్ పెట్టాలని, దానితో రోజూరాబడి వుంటుందని ఆలోచించారు. డబ్బు సమస్యగా తయారయింది. యెన్నింటికని తమ్ముడిని అడుగుతాడు. పోనీ, ఈ ఒకసారి అడిగితే, ఓ నిశ్చయానికి వచ్చి తమ్ముని పెద్ద

చేరుకున్నాడు. ఇద్దరు మొగపిల్లలు రావటంతో యిల్లంతా సందడిగా ఉంది.

"రా, అన్నయ్యా!" చాలా రోజులకు తమ్ముడు హాయిగా నవ్వటం చూచాడు.

"మీరే చెప్పండి పెదనాన్నా!" నందిని ముందుకు వచ్చింది.

"ఏమిటమ్మా!"

"మేం ఫస్టుక్లాసులో పాసయితే తాజ్ మహల్ చూపిస్తామని ప్రామిస్ చేశారు. ఇప్పుడేమో దాటవేస్తున్నారు నాన్న."

"మీ రిజల్ట్సు వచ్చాయా?"

"పెద్దన్నయ్య తెలుసుకు వచ్చాడు. నేను, చిన్నన్నయ్య ఫస్టు క్లాస్‌లో పాసయ్యాం."

"చాలా సంతోషం" అతనికి సంతోషం, విచారం కలిగాయి.

"నందీ! మనం అయిదుగురం తాజ్ మహల్‌కు వెళ్ళాలంటే చాలా ఖర్చు అవుతుందమ్మా. నాన్నగారిని ఆలోచించుకోనివ్వు" నిర్మల అడ్డుపడింది.

"మరెందుకు ప్రామిస్ చెయ్యాలట" రోషంగా అడిగింది.

"మరోసారి ఆలోచిద్దాం తల్లీ!" భాస్కర్ మృదువుగా చెప్పబోయాడు.

నందిని లేచిపోయింది.



"యిప్పటి సంతోషం మళ్ళీ వస్తుందట్రా? వెళ్ళిరండి" వెంకటరావు మాటలు విని, అదే మంచిదని నిశ్చయించుకున్నాడు.

"నందినీ! రా తల్లీ!" యెంతో ప్రేమగా కూతుర్ని పిలిచాడు. ప్రయాణానికి సిద్ధమవుతున్న తమ్ముడిని ఆపటం బావుండదు. తను డబ్బు అడిగితే ప్రయాణం ఆగిపోతుంది. కాసేపు మాట్లాడి బయటికి వచ్చాడు. రెండురోజులు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు. వరహాల శెట్టి దగ్గర మరో మూడువేల రూపాయలు భాస్కర్ వాటా ఇల్లు తాకట్టు పెట్టి తెచ్చాడు. అన్నదమ్ముల సంబంధ బాంధవ్యాలు యెరిగిన శెట్టి తమ్ముడి అనుమతికోసం అడగలేదు. వ్యాపారం చేస్తున్నాను, తప్పు చేయటంలేదని వెంకటరావు నిశ్చింతగా ఇల్లు చేరాడు.

## 25

ఎర్రమట్టితో నిండిన వీధులు చూస్తూ 'మహమూద్ గవాం మద్రసా' దగ్గర కొచ్చారు వెంకటరావు, అతనితో బయలుదేరిన శేషాచారి. బీదర్ సారవంతమైన పట్టణమే. కాని ఎర్రదుమ్ము మనుష్యుల్ని చికాకు పరుస్తుంది. అక్కడ మంచి గేదెలు దొరుకుతాయని ప్రతీతి. గేదెలు చూచి, ధరలు మాట్లాడి, ఊరు చూడటానికి బయలుదేరారు. 'నానక్ ఝురా' 'నర్సింహ దేవాలయం' ముస్లిమ్‌ల పరిపాలనలో కట్టిన భూగృహాలు చూచి, ఆఖరున బడి చేరుకున్నారు. అదో బడిలా లేదు. పెద్ద రాజభవనంలో ఉంది. ప్రజలను పీడించి తమ కీర్తి నిలుపుకున్నారు రాజులు. బడంతా తిరిగి

చూచి, శేషాచారి బంధువుల అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళారు. వారు ఊర్లో లేరని తెలిసింది.

"మరెలాగయ్యా శేషాచారీ!"

"ఏదయినా హోటల్ కెళ్దాం దొరా." ఇద్దరు బయలుదేరారు. అక్కడ కన్నడం, మరాఠీ మాట్లాడుతారు పాటక జనం. తను కొచ్చిన ఉర్దూతో ఓ రిక్షావాడిని మంచి హోటల్‌కు తీసుకుపొమ్మని చెప్పారు.

"దేఖో సాబ్, జిందగీ భర్ యాద్ కర్నా ముఝే." విలాసంగా నవ్వుతూ ఓ హోటల్‌కు తీసుకుపోయాడు. పదణాలు వాడి చేతిలో పెట్టారు.

"గానా, బజానా, దస్ రూపియా ఫేంక్‌తో హుస్నోకి గోద్ మే" నవ్వుతూ వెళ్ళిపోయాడు.

"వీడు మనల్ని పొరపాటుగా అర్థం చేసుకున్నాడు. శేషాచారీ! మరో హోటల్‌కు వెడదామా?"

"మనదారిన మనం తిని పడుకుందాం దొరా! రాత్రిళ్ళు తెలియని పట్నంలో తిరగటం మంచిదికాదు." అదే సబబుగా తోచింది. సామాన్యమయినదే అయినా, చాలా రుచిగా వుంది ఆహారము. భోజనంచేసి మేను వాల్చారు.

"సాబ్! సితారా డాన్స్! ఓహో! ఎల్లారునోడు బేకురీ (ప్రతివారు చూడదగ్గది) భాళ చందాయితు. బ్రీ," కనడీలో మొదలు పెట్టాడు సర్వరు. శేషాచారి నానాతంటాలు పడి వాడిని పంపేశాడు. వాడికేదో హైక్లాసు బేరంలా తగిలింది. వాడు తలాడించి వెళ్ళిపోయాడు. శేషాచారికి చుట్టలు కాల్చే అలవాటు. అతను దూరంగా వెళ్ళి చెట్టు మొదట్లో



చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు. వెంకటరావు కళ్ళు మూసుకుని భవిష్యత్తు ఆలోచించసాగేడు. గుమ్మము దగ్గర గుసగుసలు విన్పించాయి.

"హో గప్పా నామ నోడుకుందు..." మృదువైన కంఠం వినిపించింది. ఆ కంఠం తనకు చిరపరిచితంగా తోచింది అయినా దేశం కాని దేశంలో తన పరిచితులెవ్వరు?

"ఆంధ్రమడిసి..." అతనేదో గొణిగాడు. కళ్ళు విప్పాడు. మసక వెలుతురులో ఓ స్త్రీ ఆకారం లోపలికి రావటం, తలుపులు మూయటం చూచాడు.

"ఎవరూ?"

"అప్సరసలు..." కిలకిల నవ్విందా కంఠము. అతి పొదుపుగా ధరించిన గుడ్డలు చూచి కళ్ళు మూసుకున్నాడు. అతి చౌకరకం సెంటు వాసన గుప్పుమంది.

"భలే మొగవారే ఆడది దగ్గరకొస్తే కళ్ళు మూసుకుంటారేం? ఒక్కసారిటు చూడండి!" గదిలో పెద్ద బల్బు వెలిగింది. అతను కళ్ళువిప్పి ఒకచేతిపై లేచాడు. అంతే! ప్రపంచం తిరిగినట్లూ, ఇల్లు కూలి నెత్తిన పడ్డట్లూ అన్పించసాగింది. నోరు విప్పబోయినా మాటలు రాలేదు.

"ను...వ్వా?"

"మీరు...మీరు..." వచ్చిన అప్సరస కూడా యెదురుగా పిడుగుపడ్డట్టు చూచింది. చిన్నగుడ్డతో సగం కప్పబడిన తన వక్షోజాలకు రెండుచేతులు అడ్డంగా పెట్టుకుంది.

అతనిలోని కదలిక గమనించి, గిర్రున వెనుతిరిగి పోయింది.

"ఆగు...అప్రాచ్యురాలా! ఆగు..." అతను లేచి వెంబడించేలోగానే చీకటిలో కలిసిపోయింది. పిచ్చిగా పిలుస్తూ కొంతదూరం వెళ్ళి తిరిగివచ్చాడు.

"ఏమిటి దొరా!" శేషాచారి ఆదుర్దాగా వచ్చాడు.

"శేషాచారీ!" అతని నోట మాట రావటంలేదు. అవమానంతో హృదయం కుతకుతలాడుతుంది. తన సంతానం భవిష్యత్తు ఇలా కావటానికి తనెంతవరకు బాధ్యుడు? సుధాకర్...వసంత...నీరసంగా కూలబడిపోయాడు.

"ఏం దొరా!" భుజాలుపట్టి కుదిపాడు.

"శేషాచారీ! వెళ్ళు...ఇందాక నా గదికో అమ్మాయి వచ్చింది. ఆమె అడ్రసు తెలుసుకు రా!"

"రాయున దొరా!"

"వెళ్ళు శేషాచారీ!" అతని ఆవేదన అర్థంకానిది. ఎంతో ఆరోగ్యంగా వున్న అతను పది లంఖణాలు చేసినట్టు తయారయ్యాడు. శేషాచారి వెళ్ళి అరగంటలో సితారా అడ్రసు సంపాదించుకువచ్చాడు. యిద్దరూ అక్కడికి వెళ్ళారు. పదినిమిషాల క్రితమే గది ఖాళీచేసి వెళ్ళిపోయిందని చెప్పారు అక్కడివారు. తప్పినవారిని వెతుకవచ్చుగాని, తమంతట తాము దాక్కునేవారిని యెవరు పట్టుకోగలరు? మర్నాడు నూటనాల్గు డిగ్రీల జ్వరంతో తిరుగుప్రయాణం అయ్యాడు.

"శేషాచారీ!" వణుకుతూ పిలిచాడు.

"దొరా!"



"నాకేదయినా...సారాయిలాంటిది తెచ్చిపెట్టు."

"మీరు ఏమంటున్నారో తెలుసా?"

"తెలుసు. నేను బ్రతకాలంటే ... అదొక్కటే మందు." అతను మరేం అనక, వికారాబాద్ స్టేషన్‌లో దిగి యాభై రూపాయలు తగలేసి వెంకట్రావుకు మందు కొనుక్కువచ్చాడు.

## 26

ఉత్తర దేశయాత్ర ముగించి సరాసరి తన అన్నగారి దగ్గరకు వెళ్ళింది, నిర్మల కుటుంబంతో. చందు ప్రీప్రొఫెషన్‌లో చేరాడు. నందిని పి. యు. సి. లో చేరింది. ఇద్దరు మొగపిల్లలు హాస్టల్లో, నందిని మేనమామగారింట్లో వుంటారు. అన్ని యేర్పాట్లుచేసి ప్రయాణం అయ్యాడు.

"ఏమిటోయ్! యెప్పుడూ పనులు, హడావుడి? నాల్గు రోజులుండు. అందరం సరదాగా గడుపుదాం." రాఘవ బలవంతం చేయుటంతో మరో నాల్గురోజులుండి తిరుగు ప్రయాణమయ్యారు. నిర్మలకు బాధగావుంది. పిల్లల భవిష్యత్తు కోరి ఏదయినా చేయాలి మరి!

"నిర్మా!" ఆప్యాయంగా పిలిచాడు భాస్కర్.

"ఊఁ!"

"ఎందుకు ఆ దిగులు? కొన్నాళ్ళు మళ్ళీ నూతన దంపతుల మవుదాం."

"మీకు పిల్లలాటలా ఉంది."

"నాకు తెలుసు నిర్మలా ! పోనీ పిల్లలందరిని ఒకచోట ఉంచుదాం. వాళ్ళదగ్గర నువ్వుండు."

"మరి మీరు ?"

"ఏముంది ? ఆఫీసు ప్యూన్ వంటచేస్తాడు. నేను తింటాను."

"నేను తింటాను !" వెక్కిరించింది. "అంత తేలిక అనుకున్నారా !"

"మరేం చేద్దాం ? నువ్వు దిగులుపడితే చూడలేను."

"ఆ సంగతి మీరు గుర్తుపెట్టుకోరెందుకు ? గత సంవత్సరం అంతా యెంత దిగులుగా వుండేవారో ? మాట్లాడించాలన్నా భయమే."

"నాకు, నీకు పోలిక ఏమిటోయ్ ? నువ్వు మా జీవితాలకు కేంద్ర బిందువువు." భుజంమీది శాలువా సరిచేశాడు.

"నేనో నిర్ణయానికి వచ్చాను నిర్మలా ! మనం ఇంటికి వెళ్దాం. అన్నయ్య వదిన చాలా మారిపోయారు. పిల్లలతో కాలక్షేపం అవుతుంది !"

"ఆలోచిద్దాం." భవిష్యత్తుకు పూలబాటలువేస్తూ ఇల్లుచేరారు. టీ తాగి పొలాలవైపు వెళ్ళారు. వరిచేను ప్రె పట్టింది. అన్నగారిపొలం పూర్తిగా ఎర్రబారింది.

"అంజయ్యా !"

"దొరా !" మోటబావిదగ్గర పనిచేస్తున్న అంజయ్య వచ్చాడు.

"చేను ఎండబెట్టావేమిటి ? అన్నయ్య చూడలేదా ?"



"ఏం చెప్పమంటారు దొరా ! పదిహేను రోజులనాడు ఇంజను పాడయింది, ఎవరిని పిలువాలో తెలియదు. పెద్ద దొర మనలోకంలో లేరు."

"అదేం ?"

"తప్ప తాగి, ఎక్కడో ఒకచోట కూర్చుంటారు."

"అంజయ్యా !"

"అవును దొరా ! పెద్దదొరతోపాటు ఆ దేవుడు నా కళ్ళుమూశాడు కాడు. మిమ్మల్ని పెంచాను. పిల్లలు అనుకున్నాను. ఈ రోజు యెంతగోరాలు చూస్తున్నాను." వృద్ధుడయిన అంజయ్య కనుకొలకులలో నీరూరింది.

"గేదెలు తేలేదా ?"

"లేదు బాబూ ! అక్కడ హోటల్లో ఆడమనిషిని చూశారంట అప్పటినుండి ఇదే లోకమట. అది యేం పెట్టిందో ?"

"నువ్వెళ్ళి హనుమంతును పిలువు. ఎంత ఫీజయినా ఇస్తానని చెప్పు. నేను అలా అన్నయ్యను చూసివస్తాను." భాస్కర్ వడివడిగా ఇల్లుచేరాడు. శోకదేవతలా దర్శనం ఇచ్చింది భాగ్యమ్మ.

"వదినా !"

"వచ్చావా భాస్కర్ !" బావురుమంది.

"ఊరుకో వదినా ! డాక్టరుకు చూపుదాం." ఆమెను ఓదార్చి లోపలికి వెళ్ళాడు. నాటుసారా వాసన గుప్పుమంది.

"అన్నయ్యా!"

"ఎవరూ !" ఇటు తిరిగాడు. వెంకటరావు కళ్ళు ఎర్రబడ్డాయి. మంచి నిషాలో వున్నాడు.

"నేను భాస్కర్‌ని..."

"భాస్కర్ !... నువ్వా రారా. నీకో శుభవార్త చెప్పాలిరా. కూర్చో" ఉత్సాహంగా చోటు చూపాడు.

"ఏమిటి ?"

"వసంత లేచిపోయిందనుకున్నామా ?" లేదురా. పెద్ద ఆఫీసర్ని పెళ్ళిచేసుకుంది. బంగళా, కారు, హోదా కళ్ళు తిరిగిపోయాయి అనుకో."

"ఎక్కడుంది అన్నయ్యా !"

"అది రహస్యంరా. మనలాంటివాళ్ళు పోరాని చోటది." దిండు క్రింద దాచిన సీసాతీసి మరి రెండు గుక్కలు త్రాగాడు. భాస్కర్ సీసా లాక్కోబోయాడు.

"దూరంగా వుండు. ఇది నా స్వర్గంరా, మళ్ళీ దానివైపు చేయిచాచావో నీకు నాకు రామ్ రామ్."

"అన్నయ్యా !"

"ఎందుకురా ఆ అరుపులు? నేనేం పసివాడినా?" కరుకుగా అడుగుతున్న అన్నకు ఏం జవాబు చెబుతాడు ? సమయము బాగుండలేదని బయటికి వచ్చాడు.

"ఇది నాయన వరస. ఇల్లు తాకట్టుపెట్టిన డబ్బంతా స్వాహాఅయింది." కన్నీరొత్తుకుంటూ భాగ్యలక్ష్మి చెప్పింది.

"పొలాలు చూచి కోవటాని కెవరో వుండాలి. ప్రసాద్‌కు కబురు చేశావా ?"



"ఒక్కసారా ? వందసార్లు చేసివుంటాను. వాడు భాగం పంచియిస్తే వస్తాడట."

"రేపు ఉదయం వస్తాడు." భారంగా ఇంటిముఖం పట్టాడు. ఇల్లు అప్పతీరేది యెలా ? తన జీతం పిల్లల జీతాలకు, హాస్టల్ ఖర్చులకే సరిపోదు. జీవితమో పెద్ద సుడిగుండంలా కన్పించింది. దాంట్లోంచి తప్పుకోవటం ఎలాగో తెలియలేదు. అతను వెళ్ళేసరికి ఎలెక్ట్రీషియన్ వచ్చాడు. అతన్ని తీసుకు వెళ్ళి ఇంజన్ బాగుచేయించి ఇంటికి వచ్చేసరికి అర్ధరాత్రి అయింది. ఒక్క కునుకుతీసి మళ్ళీ లేచాడు చేనుకు నీరు పారేసరికి తెల్లారిపోయింది. వరిచేలలో నీరు చూచాక అతనికి ప్రాణం లేచివచ్చింది. ఇంకోరోజు సెలవు ఉండటం మూలాన, టీ త్రాగి అన్నదగ్గరకు వెళ్ళాడు. అప్పటికే త్రాగి వున్నాడు.

"అన్నయ్యా !" ఈసారి విపరీతమైన కోపం వచ్చింది.

"ఏరా ! నా జీవితం నా ఇష్టం. మహా బెదిరిస్తున్నావ్?" నిర్లక్ష్యంగా తల ఎగరేశాడు.

"అవును. ఆ సంగతి మరిచిపోయాను నీ ఇష్టమేగాని, ఈ ఇంట్లో నా భాగం వుందని మరిచిపోయావా?"

"నాన్నగారు నా ఒక్కడికేనని నిన్ను తరిమేసిన సంగతి మరిచిపోకు."

"అవును." కోపం, బాధ, అసహాయత మనసును కలచివేస్తుంటే వెనుతిరిగాడు. సింహద్వారం దాటి వెనక్కు చూచాడు. వెంకటరావు పరుగెత్తుకు వచ్చాడు.

"ఆగరా."

"ఏమయినా మిగిలిందా ?"

"బాచీ ! నన్ను ... క్షమించరా. నేను చచ్చిపోయాననుకో." అతని కళ్ళు నీటితో నిండిపోయాయి.

"నిజం చెప్పన్నయ్యా ! బీదర్‌లో ఏం జరిగింది ?"

"ఏం జరుగుతుంది ? ... ఏం లేదు."

"కాదు, మీరు దాస్తున్నారు. అక్కడ వసంతను"

"వద్దు ... వద్దు. ఇంకేం చెప్పకు. నా చేతులారా నా పిల్లల భవిష్యత్తు పాడుచేశానురా. బాచీ ! నాకు మిగిలిన శాంతి ఒక్కటేరా త్రాగటం. నువ్వేం అనుకోకు.

"ఇంకా పిల్లలున్నారు."

"ఉండని ... ఉండనియ్యరా" వడివడిగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు. అయిదు నిమిషాలు అలాగే చూచి భారంగా పొలయిందారి పట్టాడు భాస్కర్.

## 27

ప్రసాద్ తండ్రిపొలంలో నాల్గోవంతు తనదని పంచుకున్నాడు. అడ్డు పెట్టేది యెవరు ? తండ్రి ఈ లోకం సంగతులు పట్టించుకోడు. భాస్కర్ రావు అడ్డు చెప్పలేదు. మిగిలిన పొలం తన ఆధ్వర్యాన చేయిస్తున్నాడు. భోజనం చేసి మేను వాల్చాడు. ఆఫీసు పని, వ్యవసాయం గొడవలతో క్షణం తీరిక లేదు.

"భాస్కర్ !"

"రా, అన్నయ్యా !"

"వస్తున్నాను. నిర్మలా ! అన్నం ఉందా ?"



"ఉంది. రండి బావగారూ !" అతను వెళ్ళి కూర్చున్నాడు. ఇలా వారంలో నాల్గుసార్లు జరుగుతుంది భోజనానంతరం దక్షిణకావాలంటాడు. పది, పాతికనుండి మొదలయి ఒక రూపాయిలోకి దిగుతుంది. అలా లేదు అని పలుసార్లు అనటం యెంతో బాధగా ఉంది. కాని అనక తప్పేలా లేదు. ఆ డబ్బు త్రాగుడుకు పోతుంది. అన్నగారు తెగని సమస్యగా తయారయ్యాడు భాస్కర్ రావుకి. నుదురు రాసుకుంటూ కూర్చున్నాడు.

"వంట అంటే నిర్మలే చేయాలిరా." తేన్చుకుంటూ వచ్చాడు.

"మిరపకాయలు రాలిపోతున్నాయి. కోసి గంపలకెత్తించాలన్నయ్యా !"

"నాకేం తెలుసురా ఆ పనులు. ఓ పదిరూపాయలుంటే ఇలా పడెయ్యి."

"అన్నయ్యా !" భాస్కర్ లేచి పచార్లు మొదలుపెట్టాడు.

"ఈ నెలలో అరవై దాకా తీసుకున్నావు."

"తీసుకుంటే ?" తీక్ష్ణంగా అడిగాడు. "బోడి అరవై యెంతరా ? ధరలు మండిపోతుంటే ..."

"ఆ అరవై సంపాదించటానికెంత బాధపడాలో తెలుసా ?"

"పూర్తిగా తెలిసింది. అప్పుగా ఇవ్వు. నా పొలం తాకట్టు పెట్టుకో."

"అన్నయ్యా! నా సహనానికి పరీక్ష పెట్టవద్దు. ఇల్లు తాకట్టు పెట్టాం. విడిపించుకునే శక్తి లేదు పొలం పెట్ట, అంతా అయిపోయాక ఏడుద్దాం."

"ఇంతకీ నువ్వు అనేది ఏమిటి ?"

"ఇకనుండి ఒక పైసా ఇవ్వను !"

"ఇవ్వకురా. చచ్చే రోజు మూటకట్టుకు పో. నీవు యెవరికోసం కూడబెడుతున్నావో వారుండరురా తినటానికి" అరుస్తూ వెళ్ళిపోయాడు. భాస్కర్ రావు ముఖం పాలి పోయింది. అతను జుట్టు పీక్కుంటూ మళ్ళీ కూర్చున్నాడు.

"ఏమండీ ..." మృదువుగా అతని తల నిమిరింది నిర్మల.

"ఎంత మాటన్నాడో విన్నావా నిర్మలా! మన పిల్లల్ని ..."

"మరచిపొండి. మనం యెవరిపొట్టలు కొట్టి పిల్లల అభివృద్ధికోరటం లేదు. కష్టపడుతున్నాము. అతనంటే ఏమయింది ?"

"నా కెందుకో చాలా దిగులుగా ఉంది. ఒక్కసారి పిల్లలను రమ్మని రాయి"

"అలాగే. పనిచేస్తుంటే మరచిపోతారు. అలా మిరపతోటల కెళ్దాం పదండి."

"పద" లేచి ఆమె ఇచ్చిన చొక్కా వేసుకున్నాడు. నిర్మల దీక్షగా చూచింది. ఊరు చేరిన అయిదారు సంవత్స రాలలో భాస్కర్ రావు యెంతో మారిపోయాడు. అతని జుట్టు తెల్లబడిపోయింది.



"ఏమిటలా చూస్తున్నావ్ ?"

"మనము పెద్దవారము అయిపోతున్నాం ?"

"బాధ్యతలతో పెద్దరికం వస్తుంది కొందరికి. బాధ లతో పెద్దవారవుతారు మరికొందరు. వయసుతో పెద్దవారు అయ్యేది చాలా తక్కువ." మాట్లాడుతూ మిరపతోట చేరుకున్నారు.

నాల్గురోజులు వెంకటరావు రాకపోతే, మారిపోయా డేమో అనుకున్నాడు. కాంపౌండర్ గఫర్ వచ్చాడు.

"చిన్నదొరా !"

"యెవరూ ?" చెప్పులేసుకుని బయటకు వచ్చాడు.

"నేను దొరా ! డాక్టరుగారు ఈ చీటి ఇమ్మన్నారు."

చీటీ చదివిన భాస్కర్ రావు కనుబొమలు ముడుచుకు పోయాయి. భార్యను కేకవేశాడు.

"ఈ మధ్య యెప్పుడయినా డాక్టరుగారి దగ్గర మందులు తెప్పించావా ?"

"లేదండీ, ఆరు నెలల్రకితం అత్తయ్యను తీసుకు వెళ్ళాను. అప్పుడే డబ్బు ఇచ్చాను."

"ఇతను తనడబ్బు త్వరగా పంపిస్తే సంతోషిస్తానని రాశాడేమిటి ?" అతను ఆలోచించి, తను స్వయంగా డాక్టరుగారిని చూస్తానని వచ్చిన మనిషిని పంపివేశాడు. సాయంత్రం చెరువుకట్ట దగ్గర కుని చూసుకుని, డాక్టరును కలిశాడు. డబ్బు వివరాలు అడిగాడు.

"నువ్వు మరచిపోయావా భాస్కర్ ! పిల్లల ఫీజు కేదో కావాలని మీ అన్నగార్ని పంపావు గుర్తుందా ?"

"నేనా ?" భాస్కర్ రావు ముఖం నల్లబడింది. "ఎంత ఇచ్చారు ?"

"యాభైరూపాయలు. వాళ్ళ మందులవి మరో యాభై అయింది. అంతా కలిపి నువ్వే ఇస్తావన్నాడు మీ అన్నగారు."

"క్షమించండి డాక్టరుగారూ ! ఈ డబ్బు పంపిస్తాను మరెప్పుడూ, నేను స్వయంగా అడగనిదే, నా హామీపై డబ్బు యివ్వకండి." చరచరా వచ్చాడు ఇవతలకి. డాక్టరుతోనే కాదు, మరో అయిదారుగురితో ఘర్షణపడవల్సి వచ్చింది. అన్నగారు చేసే అప్పులకు తన బాధ్యత లేదని నిక్కచ్చిగా చెప్పాడు. అలా చెప్పవసివచ్చినందు కెంతో బాధపడ్డాడు.

సాయంత్రం భాగ్యలక్ష్మి బిక్కముఖం వేసుకుని వచ్చింది. అయిదుగురు చిన్నపిల్లలు వెనుకాలే వచ్చారు.

"భాస్కరం బాబూ !" బావురుమంది.

"ఏం వదినా ? ఏం జరిగింది ?" భాస్కర్ లేచాడు. నిర్మలకూడా వచ్చింది, లోపలినుండి.

"ఇంట్లో వడ్లుమాత్రం మిగిలాయి. వాటిని అమ్ముతుంటే అడ్డుపోయాను. ఇష్టం వచ్చినట్టు తిట్టారు. నేను శని నట. ఏదయినా పనిచెయ్యి అంటూ ఇంట్లోంచి తగిలేశారు" అన్నది ఏడుస్తూ.

ఏమని ఓదార్చగలడు ? స్వయంకృతాపరాధం అంటాడా ? అతన్ని పాడుచేసింది నువ్వే అంటాడా ? అంటే లాభంవుందా ? అలాగే నిలబడిపోయాడు. ఆ పిల్లలనుచూచి



నిర్మల బాధగా కళ్ళు మూసుకుంది. ఒక్కరి ఒంటిపై సరియైన గుడ్డలులేవు. తలకు నూనెరాసి యెన్నిరోజులో అయినట్టుంది.

"రా అక్కయ్యా ! కూర్చుని మాట్లాడుకుందాం, చాపవేసింది. అందరికీ ఫలహారం పెట్టింది. పిల్లల తలలకు నూనె రాసి దువ్వింది.

"మాట్లాడవేం భాస్కర్ !"

"ఏం మాట్లాడాలి వదినా ? జబ్బు ఏదయినా అయితే యెంత ఖర్చుఅయినా ఫరవాలేదు బాగుచేయించవచ్చు. కావాలని చేస్తుంటే ఏం చేయాలి ?"

"పెద్దలంటారు కదా ! ఇలాంటి బుద్ధులు చిన్న వయసులోనే అబ్బుతాయని. నడమంత్రాన ఇదేంఖర్మ. నా దురదృష్టం. ఏం పనిచేయను ? వంటపనికూడా ఇవ్వరు." కన్నీరు పదేపదే ఒత్తుకోసాగింది.

"ప్రస్తుతానికి మీరు ఇక్కడే ఉండిపొండి. తరువాత ఆలోచిద్దాం." అన్నాడు చివరకు. నిర్మలకూ అదే నచ్చింది.

## 28

పెద్దయిల్లు అంటూ పట్టుకుకూర్చుంటే పెరిగిపోయే వడ్డీ మనుష్యుల్ని మింగేస్తుందని, ఇల్లు అమ్మకం పెట్టారు. అన్నమ్మ అన్నం నీళ్ళు మాని కూర్చుంది.

"నేను ఏం చేయాలో చెప్పమ్మా ?"

"ఇద్దరు సంపాదిస్తారు. ఆ మాత్రం అప్పు తీర్చలేరట్రా ? పాత ఇంటిమీద ఖర్చు ఎందుకు అనుకుంటు

న్నావు! అవును. నేను ముసలి దాన్నే. నాపై ఖర్చు దండుగ." కంట తడి పెట్టుకుంది.

"అమ్మా! నీకు ఇంటికి పోలిక తీసుకురాకు. పాత ఇల్లు, పనికి రానిదనుకుంటే మూడు వేల దాకా ఖర్చుపెట్టి బాగు చేయించాను. మరో రెండు వేలు పెట్టి గదులు వేయించాను ఇక నావల్ల కాదమ్మా."

"నీకు పై సంపాదన ఉంటుందట కదరా!"

"ఎవరు చెప్పారమ్మా!"

"అన్నయ్య ... వస్తు తెచ్చి, వస్తుతినే సామెత చెయ్యకురా, నలుగురు బ్రతకాలి."

"అమ్మా! అలా స్వార్థంతో నాది నేనంటూ చూచుకుంటే నా దగ్గర బోడెడు డబ్బుండేది. పై సంపాదనంటావా? మనుష్యుల్ని బట్టి వుంటుంది. నేను పెద్ద నీతిపరుడిని డబ్బా వాయించుకోకపోయినా, అవినీతి అంటే మాత్రం గిట్టదు. నువ్వు ఏ ప్రమాణం చెయమన్నా చేస్తానమ్మా! నా దగ్గర నిలువ ఒక్క కూపాయి లేదు." ఎన్నో విధాలుగా నచ్చ చెప్పేక ఇల్లు అమ్మేశారు. చాంట్లోని సామాన్లు యెప్పుడో హారిచుకుని పోయాయి. ధాన్యంని పేడగాదెల, గుమ్ములు తప్ప ఏం మిగుల లేదు. అప్పు వడ్డీపోగా వచ్చిన సగం పంచుకున్నాతు. చేతిలో డబ్బు పడగానే పలాయనం చిత్తగించాడు వెంకటరావు. భాస్కర్ రావుకు ఆడపిల్లలు ఓ సమస్యలా తయ్యారయారు. గుట్టుగా ఒకొకరిని పంపించివేస్తే నయమనిపించింది ఒక మనిషి భారం వహించాలంటే యెంతో కష్టం. ఒక కుటుంబ భారం వహించాలంటే మాటలా? ఒకందుకు



నిశ్చింతగా వుంది. మునుపటి మూతివిరుపులూ, సాధింపులూ లేవు. యెవరిపనులు వారు చేసుకుంటారు. మరో పెద్దగది వేయించాడు. కొద్దిపాటి పొలంతో మర్యాదగా బ్రతికే సాటి కులం వారబ్బాయిని చూచాడు. ఆ కుర్రాడు పదవ తరగతితో చదువాపి వ్యవసాయం చేసుకుంటున్నాడు. అది వదినకు నచ్చుతుందో, లేదో అని సందేహించాడు. భాగ్యలక్ష్మి సంతోషంగా అంగీకరంచింద. క్లుప్తంగా పెళ్ళి ఏర్పాట్లు జరుగుకున్నాయి. వెంకటరావును వెతికి పెట్టారు కన్యాదానం చెయ్యడానికి.

"నే నెందుకురా? నువ్వు చెయ్యరాదూ?" విసుక్కుంటూ ఆ అరగంట ఉన్నాడు. పెళ్ళివారిముందు ప్రసాద్ గొడవ మొదలు పెట్టాడు, ఇల్లమ్మిన డబ్బులో తన వాటా ఇమ్మని. భాస్కర్ రావు యెంతో ప్రయత్నంచేశాడు. అతనికి నచ్చ చెప్పాలని.

"తరువా తెందుకు? పదిమందిలో తేలిపోవాల్సిందే." ఫలితం తండ్రీ కొడుకులు ఒకరినొకరు చితకతన్నుకున్నారు.

"భాగ్యం లేకపోయినా పరువుగల కుటుంబం అనుకున్నాను భలే శాస్త్రి జరిగింది." పెళ్ళి కుమారుడి తండ్రి తన బలగాన్ని లేవదీసుకుపోయాడు. యెవరెన్ని చెప్పినా అతను వినిపించుకోలేదు. వివాహ మంటపముతో మంగళసూత్రాలను పరీక్షగా చూసుకుంటూ కూర్చున్న వధువు సుగుణ మాత్రం మిగిలింది.

"ఇంట్లోకి పదమ్మా" నిర్మల చేయి అందించి తీసుకుపోయింది. భాస్కరరావు స్పృహ తప్పిపడిపోయిన అన్నను తీసుకుని హాస్పత్రికి బయలుదేరాడు.

"నీ చేతులు పడిపోనూ? యెంత గారాబంగా పెంచానురా? ఇలా తయారయావు" భాగ్యలక్ష్మి శోకాలు పెట్టింది. అతేం లెక్క చేయలేదు. పొడుగ్గా పెరిగిన జులపాలను యెగరేసుకుంటూ వెళ్ళిపోయాడు. రెండురోజులు భారంగా గడిచిపోయాయి. వెంకటరావు ఆస్పత్రినుండి సరాసరి కల్లుపాక కేసి నడిచాడు. భాస్కరావుకు తెలుసు. వారించబోతే కొట్లాటే. అదీ నడిబజారులో. అతను నీరసంగా కూర్చున్నాడు.

"నిర్మలా! మన కుటుంబ పరిస్థితులు చక్కబడటం కలలోని మాట." నుదురు ఆవేదనగా రాసుకున్నాడు.

"మీ రిలా అధైర్యం పడితే యెలా? మెల్లగా సర్దుకుంటాయి. మరో రెండు సంవత్సరాలు ఓపిక పడితే వాసు చదువు అయిపోతుంది. వాడు సంపాదించి పెట్టకపోయినా, వాడికి పంపే ఖర్చులు తప్పుతాయి." ఇలాగే ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు. భాస్కర్‌లో మునుపటి చురుకుదనం, ఉత్సాహం పూర్తిగా నశించిపోయాయి. మందకొడిగా ముతిమురుపుగా ఉంటాడు.

## 29

పంచాయితీ ఆఫీసులో రేడియో వింటూ కూర్చున్నారు పెద్దలు అనబడే కొందరు. వెంకటరావు హడావుడిగా వచ్చాడు అక్కడికి.



'హనుమంతరావ్! ఓ పది రూపాయలుంటే ఇస్తావ్."

"నా దగ్గర లేదయ్యా! పోయిన నెలలో రెండు, ఒకటి అంటూ పన్నెండు రూపాయలు తీసుకున్నావ్ అవి ఇవ్వనే లేదు" హనుమంతరావు ముఖం గంటు పెట్టుకున్నాడు.

"భలేవాడియ్యా. రాయసదొరలకు పుచ్చుకోవటమే కాని, తిరిగి ఇవ్వటం తెలియదని నీకు తెలియదా?" మరొకరు వెటకారం చేశారు. వెంకటరావు ఇలాంటివి పట్టించుకోవటం యెప్పుడో మరిచిపోయాడు.

"రాఘవయ్యా! నీ దగ్గరుంటే ఓ అయిదు సర్దు." ప్రాధేయపడ్డాడు.

"ఉంటే ఇవ్వనా? నేనే ఇబ్బంది పడుతున్నాను."

"పోనీ...కోదండం! ఓ రెండు రూపాయలు ఇవ్వరాదూ?" చిల్లరకొట్టు శెట్టిని అడిగాడు.

"పోవయ్యా డబ్బు చెట్టుకు కాస్తుందా? మీ ఆవిడ పిల్లలను పంపి సరుకులు తెప్పించుకుని మరిచిపోయింది. హాయిగా మరిదిగారింట్లో చేరింది. నా పద్దు ఎగగొట్టారు. దానికి వడ్డీ యిస్తానా?" కండువా దులుకుని లేచి వెళ్ళిపోయాడు.

"సుందరం! ఒక్క రూపాయి ఇవ్వవోయ్." క్రొత్తగా చేరిన బడిపంతుల్ని అడిగాడు.

"మీ మరదలికి నాకంటె రెండింతలు వస్తుంది. ఆవిడ దగ్గర అడుక్కోండి."

"ఆవిడ ఇస్తే మిమ్మల్ని ఎందుకు అడుగుతాను?" విసుగ్గా అన్నాడు. ఇంతా చూస్తున్న వి. ఎల్. డబ్ల్యు.

రాములు రూపాయి తీసి వెంకటరావు చేతిలో పెట్టాడు. అతనికి భాస్కర్ రావు ఉద్యోగం ఇప్పించాడు. వెంకటరావు కోరికపైన గౌరవముంది.

"వారం రోజుల్లో తిరిగి ఇస్తానోయ్ రాములూ !" అతను హడావుడిగా వెళ్ళిపోయాడు.

"మహానుభావా, మళ్ళీ అడక్కపోతే ఇచ్చినంత పుణ్యం" సుందరం జోకేశాడు. అందరూ గొల్లున నవ్వారు.

"గురు పదినుండి ఒక్క రూపాయిలోకి దిగాడేమిటి ?"

"ప్రయత్నం అయ్యా. ఎవడయినా ఫూల్ దొరకడా అని," సుందరం మరోసారి నవ్వాడు.

"అన్న ఇలా తిరుగుతుంటే తమ్ముడికి ఏం పట్టదా ?" ఒకరడిగారు.

"ఖర్చు తప్పుతుందని సంతోషిస్తాడేమో లెండి !"

"భాస్కర్ రావును అలా అనుకోవటం పాపమండీ అలా అనుకునేవాడయితే కుటుంబాన్ని పోషిస్తాడా ?" రాములు అడ్డువచ్చాడు.

"వెంకటరావు మాత్రం ఒకరివంక చూచి అనవసరంగా ఒక్క మాట మాట్లాడేవాడా ? కాలం! పాపం జాలేస్తుంది." మరొకరు సానుభూతి చూపారు.

"పిల్లలు ఇలా తలోదారి పట్టడం సహించలేక పోయాడు పాపం."

"మతి చలించిందా ? వేసాలు ?" హనుమంతరావు అన్నాడు. ఇలా పంచాయితీ ఆఫీసులో తనగూర్చి చర్చ



జరుగుతున్నా పట్టనట్టు గండెమ్మ గుడిసెలో కూర్చుని తాగుతున్నాడు వెంకటరావు. రాత్రి ప్రొద్దు. పిల్లలకింత తిండి పెట్టుకుందాం అనుకుంది గండెమ్మ. కొందరు మొండి ఖాతాదార్లు లేవరు. వారందర్నీ బలవంతంగా బయటికి తగిలి గుడిసెకు తాళంవేసి బూతులు తిడుతూ ఇల్లు చేరింది ఆమె.

వెంకటరావుకు ఆకలి నకనక లాడసాగింది. అతను సరాసరి బట్టలకొట్టు షేక్ సాబ్ యింటికి వెళ్ళాడు. భోజనం చేస్తానని కూర్చున్నాడు. అతని భార్య విసుక్కుని భర్తతో పోట్లాట ప్రారంభించింది. ఇదేం పట్టలేదు. ఎటో చూస్తూ కూర్చున్నాడు. షేక్ బయటికి వచ్చాడు.

"మా భోజనం అయింది, రావుసాహెబ్ ! మరోసారి రండి."

"అన్నం అయ్యేవర కుంటాను."

"మా ఆడవారికి ఒంట్లో బావుండలేదు." బలవంతంగా లేవదీసి బయటకు పంపాడు. అటునుండి డాక్టరుగారింటికి వెళ్ళాడు. అతను బయటికి రాలేదు. అతని విధవ వదిన ఆడపులిలా గర్జించింది.

"ఏమయ్యా ! ఇది కొంపా, కల్లుపాకా ? ఇష్టంవచ్చినప్పుడల్లా వస్తావా ? పొలం పుట్రా తగలడ్డాయిగా ! అమ్ముకు తిను. ఇలా ఇళ్ళమ్మట తిరగడానికి సిగ్గులేదూ ?"

ఒక్కమాటన లేదు. తనను కాదన్నట్టు కూర్చున్నాడు. ఓ తరువాయి మాటలని ఇంట్లోకి వెళ్ళింది. పది నిమిషాల తరువాత వస్తే ఇంకా అక్కడే కూర్చున్నాడు.

"పోనిమ్ము వదినా! ఈ పూటకు గుప్పెడన్నం పెట్టు. ఒకప్పుడు యెంత బాగా బ్రతికాడు. ఆ మనిషిలా తయారవుతాడని అనుకున్నారా ?" డాక్టరుగారు ఓనిట్టూర్పు వదిలారు.

"యెవరి కోసం? వారంలో రెండుసార్లు. తేరగా వండి యెవరు వార్చారట. తమ్ముడూ, మరదలూ సంపాదిస్తారు. అక్కడకు పోరాదు." అతని భార్య వచ్చింది రంగంలోకి.

"పోవయ్యా! మళ్ళీ ఈ ఛాయలకు రాకు." ఇద్దరాడవాళ్ళను చూచాక వెంకటరావుకు లేవక తప్పలేదు. ఒకసారి వారివంక చూచి దారిపట్టాడు. అలాగే తెలిసిన వారిళ్ళన్నీ తిరిగాడు. ఆ రోజు యెక్కడా అన్నం దొరకలేదు. పదిగంటల తరువాత ఇల్లు చేరాడు. భాగ్యలక్ష్మి వడ్డించింది.

"ఇంత రాత్రివరకు యెక్కడ తిరిగారు ?"

"ఆడముండవు నీ కెందుకు ?"

"మీరిలా తిరుగుతారు. చిన్నాడిని వదిలేశారట. ఇంటికి రాలేదు. యెవరు పట్టించుకుంటారు ?" కంట తడి పెట్టుకుంది.

"యెక్కడా మంచినీళ్ళు దొరక్కపోతే వాడే వస్తాడులే." నిర్లక్ష్యంగా అన్నాడు. అతను అన్నదే నిజం. మర్నాడు వచ్చాడు సుధాకర్. భాస్కర్ రావు అతనివంక ఒకసారి చూచి, భార్యవంక సాభిప్రాయంగా చూచి బయటకి పోబోయాడు.



"నన్ను క్షమించు చిన్నాన్నా! వెధవలు నన్ను తప్పుదారి పట్టించారు." జాలిగా చూచాడు.

"సుధాకర్ ! మీరు చేసిన పనికి సిగ్గుపడుతూ మీ నాన్న పిచ్చివాడిలా తయారయ్యాడు చూచాడా ?"

"........."

"మీరు ప్రవర్తన మార్చుకుంటే మునుపటి మనిషి అవుతాడేమోనన్న ఆశ చావలేదు."

"ప్రయత్నిస్తాను చిన్నాన్నా! నేను కోరేదల్లా ఒకటే! మీరు నన్ను క్షమించాలి." అతనేం అనలేదు. భాగ్యలక్ష్మి ఆప్యాయంగా కొడుక్కు వడ్డించింది. వారం రోజుల్లో సుధాకర్ అందరితో కలిసిపోయాడు. పొలంపనులు చేయటం, పశువులకు మేత చూడటం నిర్మల కెంతో బలం వచ్చింది. నిశ్చితంగా ఉంది. దిగులు తగ్గిపోయింది. అతను మళ్ళీ దొంగతనాలవైపు మొగ్గు చూపకూడదని రోజూ కొంత చిల్లర డబ్బులు చేతిలో పెట్టేది. చిన్న పిల్లలు, ఇద్దరాడపిల్లలు, మొగపిల్లలు నిర్మలతో బడికి వెడతారు.

"ఇంటివారుండి చేసుకుంటేనే పొలం పనులు చక్కగా సాగుతాయి. సుధడు వచ్చినకాడినుండి చూచావా మార్పు ?"

అవును. మన సమయము కలిసివస్తుంది." భార్యాభర్తలు సంబరంగా చెప్పుకున్నారు. వారి, సంబరం, సమ్మకం అంతా బూడదలో కలిపి రేడియో, వాచి, మరికొన్ని ఖరీదయిన వస్తువులతో పరారి అయ్యాడు సుధాకర్. అందరి నడుములు విరిగాయి.

# 30

"అన్నయ్యా! ఆఖరిసారిగా చెబుతున్నాను. మళ్ళీ యెవరి దగ్గరయినా డబ్బు అడిగావా నిన్ను చంపి నేను జైలుకు వెళతాను." కఠినంగా, ఖచ్చితంగా చెప్పాడు భాస్కరరావు.

"నువ్వు యివ్వవు. యెవరి దగ్గర అడగొద్దంటావు మరెలా?"

"నీకు నెల కెంత కావాలో చెప్పు? నలభయా, యాభయ్యా?"

"మహా ఇచ్చావులే."

"నీ కెవరూ ఇవ్వకపోతే యాచిస్తావా? పని చేయి."

"పనా?" పకాపకా నవ్వాడు "పనిచేసి బాగుపడ్డ వాడెవడు? భాస్కర్! నేను ఆఖరిసారిగా చెబుతున్నాను. నేను అడిగినంత డబ్బిలా పారెయ్యి, లేదా నా దారి కడ్డు రాకు."

"నీ కెలా చెబితే అర్థం అవుతుందన్నయ్యా! బయట ముఖం చూపటానికి సిగ్గుగా ఉంది. అందరిళ్ళకు వెళ్ళి భోజనం చెయ్యటమా? డాక్టరుగారి భార్య ముఖాన్నే అడిగేసింది. మేం అందరమూ ఇంతవిషం త్రాగి చచ్చిపోతే సంతోషంగా ఉంటుందా?"

"చచ్చిపొండి. యెవరికెవరురా?" లేచాడు.

"నేను చెప్పింది విన్పించిందా?"

"నేను దానికి జవాబు చెప్పాను." మొండిగా అనేసి



ముందుకి పోయాడు. భాస్కర్ రావు కోపం తారాస్థాయి అందుకుంది. అతను అన్న భుజాలు గుచ్చి పట్టుకున్నాడు.

"ఇంట్లోంచి వెళితే ఇదే ఆఖరు. మళ్ళీ రావద్దు. నీకు నాకు ఏ సంబంధం ఉండదు."

"చాలా సంతోషం. మాటి మాటికి నీ అదిలింపులు, దిలింపులు వినాల్సిన అవసరం ఉండదు."

"ఏమండీ! యెందు కిలా మారిపోయారు? మరిదిగారి మాట వినండి." భాగ్యలక్ష్మి ప్రాధేయపడింది.

"భాగ్యలక్ష్మీ! నా పాలిట లక్ష్మివి కదే! యెంత మాటన్నావు? మరిదిమాట వినాలా? అయ్యయ్యో నీ మొగుడు చెడిపోతాడే, మమ్మల్ని చూసి సంతోషించవే. మొగుడు గౌరవంగా యాచిస్తాడు. ఓ కొడుకు ముండలముఠా రు, మరో కొడుకు దొంగల ముఠాలో చేరాడు. కూతురు శ్య ... ఇంకో కూతురు మొగుడు వదిలాడు. ఎవ్వడో వడితోనో పోతుంది."

"నీకు సిగ్గెలా లేదు. ఆ మాట అనడానికి? కన్న డివా? నీవు పెళ్ళిళ్ళు చెయ్యకపోతే వారేం చేస్తారు?" షంగా అడిగింది.

"భాగ్యమ్మా! బంగారు బొమ్మా! ఇంట్లో ఇంద న్నారు. ఒక్కరిని అనమను. నేను పెళ్ళిళ్ళు వద్దన్నానేమో? ల్లుడు నలకూబరుని అందం, బృహస్పతిని మించిన బుద్ధి, బేరుణ్ని మించిన ధనం ఉండాలంటివి కదే ..."

"చాతకాని సన్యాసీ ..." అన్నమ్మ గోడలు పట్టుకుని యటికి వచ్చింది. "ఆడది ఏదో అంటే మాయించే శక్తి దుట్రా చవటా!"

"అమ్మా! నన్ను చెడ్డవాడిని చెయ్యకు." నిర్లక్ష్యంగా అనేసి, పోబోయాడు. పడకగది గుమ్మంలో నిలబడి నిర్వేదంతో చూస్తూంది నిర్మల. వెంకటరావు తదేకంగా నిర్మల వంక చూచాడు. అకస్మాత్తుగా ఆమె రెండు చేతులు పట్టుకున్నాడు. అతని కళ్ళు నీటితో నిండిపోయాయి.

"అమ్మా! మా యింటి లక్ష్మివి. నిన్ను అపార్థం చేసుకున్నాను, క్షమించు తల్లీ." రెండు చేతులు తన కళ్ళకు ఆన్చుకున్నాడు.

"ఛ! అదేం పనండీ ..." నిర్మల చేతులు లాక్కోబోయింది.

"నువ్వు నా కంటే చిన్నదానివమ్మా. పాదాలు ముట్టుకుని పాపం అంటగట్టలేను. ఈ కుటుంబం, రాయన కుటుంబం నీ చేతిలో పెడుతున్నాను తల్లీ! నేను చచ్చిపోయాననుకో. ఈ దుర్బలుడిని క్షమించమ్మా ..." పంచెతో కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"అన్నయ్యా ...!" భాస్కర్ రావు పిలుపు వినిపించలేదు.

"మళ్ళీ ఎందుకురా పిలుపు? ఆకలేస్తే వస్తాడులే." అన్నమ్మ విసుక్కుంది.

"లేదమ్మా! అన్నయ్య మాటలు ఎలాగో ఉన్నాయి ..." అతనిమాట పూర్తి కాకమునుపే కంట్రాక్టర్ వరహాలరాజు వచ్చాడు. తన డ్యూటీ గుర్తుకు వచ్చింది. తను



క్షుణ్ణంగా పరీక్ష చేసి, బిల్ పాస్‌చేస్తేగాని అతనికి డబ్బు దొరకదు. అందుకే అతని వెంట వెళ్ళిపోయాడు. సాయంత్రం అయ్యే సరికి అతని మనసు చికాకుగా తయారయింది.

"వరహాల రాజుగారూ! ప్రపంచంతో పాటు మీరు ఉప్పు కారం తింటున్న మనుష్యులే. కొంత మోసం వుంటుంది. కాని మరీ ఇంత మోసమటండీ ..."

"కాస్త ... సిమెంటు దొరక్క ..."

"భలేవారే. సిమెంటు దొరక్క మట్టికలిపారు. ఈ బ్రిడ్జులు ఎన్నాళ్ళుంటాయి? వ్యాపారస్థుల బుర్రలు బాగుపడేదెప్పుడో? బియ్యం తక్కువయితే రాళ్ళూ, పంచదారలో పిండి, నీళ్ళలో పాలు, ప్చ్ ... ప్చ్."

"ఏదో తమ దయ ..." అతను అయిదువందల రూపాయలు తీసి ఇవ్వబోయాడు.

"వరహాల రాజుగారూ!" అరిచాడు. "మీరు నన్ను ఏమనుకున్నారో? ఆ మట్టిగోడలుపోయి సిమెంటువస్తేనే మీ పని సర్టిఫై అయ్యేది. ఇలాంటి సాహసం యెప్పుడూ చెయ్యకండి." తీక్షుణ్ణంగా అన్నాడు.

"మీరలా కోపగించుకుంటే నేనేం చెప్పను?"

"నాకు చెప్పాల్సిందేం లేదు. మీరు మీ పని సక్రమంగా చేయండి." చరాచరా వెళ్ళిపోయాడు.

"పెద్ద పెద్ద ఇంజనీర్లను చూచాను. వీడెంత, వీడి బ్రతుకెంత? వీడి ఆదర్శాలు గంగలో కలపనూ." పళ్ళు పటపట లాడించుకుంటూ వెళ్ళిపోయాడు వరహాలరాజు.

వారం రోజులయినా వెంకటరావు ఇంటిముఖం చూడలేదు. ఆడవారు దిగులుపడిపోయారు. "భారతి దగ్గరకుపోయి

"ఉంటాడు." అన్నాడు భాస్కర్ రావు. వెంటనే భారతికి ఉత్తరం రాశాడు. తెలిసినవారిని తనూ వాకబు చేశాడు.

"ఎప్పుడూ వారంరోజులు రాకుండా వుండలేదు. జబ్బుగా ఉన్నాడా అనుకున్నాం." గండెమ్మ జవాబు విని నీరసపడిపోయాడు. ఎక్కడికిపోయినా, మానినా, గండెమ్మ కల్లుపాక మాత్రం మరిచిపోడు. నాల్గురోజుల్లో భారతి ఉత్తరం వచ్చింది. తన దగ్గరకు రాలేదని రెండురోజులు ఉత్తరం వచ్చిన సంగతి దాచిపెట్టాడు. చివరకు చెప్పక తప్పలేదు. అందరూ ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నాయి. వెంకటరావు మాత్రం రాలేదు. రోజుకోసారి భాగ్యమ్మ, అన్నమ్మ శోకాలు పెడతారు.

## 31

రిజల్టువచ్చిన రోజు తల్లిదండ్రుల పాదాలు భక్తితో ముట్టుకున్నాడు వాసు. నిర్మల ఆప్యాయంగా లేపి హృదయానికి కొడుకు తల ఆన్చుకుని వదిలేసింది.

"చాలా సంతోషంరా. మీరు ఒకరొకరే పైకి వస్తుంటే ఆనందంగా వుంది!" భాస్కర్ రావు తేలికగా నిట్టూర్చాడు. కుటుంబ భారం ఒకవంక, నెలనెలా పిల్లల చదువులకు డబ్బు పంపడానికి అతనుపడ్డ ఇబ్బంది ఇంతా అంతా కాదు.



"నాన్నగారూ! మీరిక ఉద్యోగం చేయవద్దండీ. మీ ఆరోగ్యము బాగా దెబ్బతిన్నది. వ్యవసాయం చూసుకోండి."

"నీకు ఉద్యోగం దొరకనీ, అదీగాక పెద్దనాన్నగారు ఎక్కడ ఉన్నారో వారి పిల్లల బాధ్యతకూడా వుంది." భాస్కర్ రావు చెబుతూ కొడుకువంక చూశాడు. వాసు ముఖంలో ప్రసన్నత మాయం అయింది.

"నాన్నగారూ! మీరు పెద్దవారు. నేను చెప్పవలసినవాడిని కాను. కాని చెబుతున్నాను-బాధ్యతలు, ఇతరుల బరువులు స్వీకరించటము మంచిదే. కాని దానికో అంతూ, దరీ ఉండాలి. నాకు తెలివి వచ్చిన దగ్గరనుండి చూస్తున్నాను. పెదనాన్నకోసమే మీకు సగం ఆరోగ్యం, డబ్బు పాడు చేశారు."

"వాసూ!"

"అవును నాన్నగారూ! సోమరితనాన్ని, బాధ్యతారహితులను ఆదుకోవటంకూడా సోమరితనాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. తమ బాధ్యతలు ఇంకొకరు తీసుకుంటున్నారని తెలిస్తే, సంతోషంగా తమ కాలం వెళ్ళదీస్తారు. మీరు పెద్దమ్మను, పిల్లలను వదిలివేయండి. ప్రసాదన్నయ్య వచ్చి తీసుకుపోతాడా, లేదా?"

"వాసూ! ఏమిట్రా అప్పుడే కొమ్ములు వచ్చాయా!" నిర్మల తీక్షణంగా అంది.

"కాదమ్మా ! నేను నిజం చెబుతున్నాను. బాధ్యత స్వీకరించవలసిన వ్యక్తులు హాయిగా ఊళ్ళమీద తిరుగుతుంటే మీా కెందుకీ క్షోభ."

"వాసూ! రేపు ఏ కారణం చేతనయినా చందూగాని, నందినిగాని నీపై ఆధారపడితే వదిలేస్తావా ?"

"ఎప్పటికీ వదిలివేయను. వారు పనులు చేయగలిగి వుండి, నాపై ఆధాలపడితేమాత్రం దారి చూపుతాను." అన్నాడు ఖచ్చితంగా, మృదువుగా. భాస్కర్ రావు చూడటం తప్ప యేంచేయలేకపోయాడు. అన్నగారి కుటుంబ విచ్ఛిత్తుకు తను కారణమా ? అతని తల తిరిగిపోసాగింది. ఏదయినా, ప్రపంచముతో కష్టమే. ఇప్పుడందరూ తన నిర్లక్ష్యంవల్లే అన్నగారు ఊరు విడిచాడని అంటారు. అతని భావము గ్రహించినట్టే వాసు మళ్ళీ అన్నాడు.

"నాన్నగారూ ! మన మనసుకు జవాబు చెప్పుకోవాలిగాని, యెవరికో కాదు. లోకం నోరు మూయించడం మన తరం కాదు."

"ఇప్పుడు నన్నేం చేయమంటావురా ?"

"మీారు పెద్దమ్మను, పిల్లలను వేరుగా ఉంచి, నెలకు కొంతడబ్బు ఇవ్వండి. వాళ్ళకు బాధ్యతలు, బరువులు, ఎడ్జస్టుమెంటు తెలిసి వస్తాయి. అన్నయ్యో, సుధాకరో తప్పక వస్తారు."

భాస్కర్ రావు మాట్లాడలేదు. వదినతత్వం తెలుసు. చిన్నపిల్లలు దారిలో పడుతున్నారు. వారిని వేరుగా పంపితే, పెద్దవారి అడుగుజాడలలో నడుస్తారు.



"పెదనాన్నగారి కోసం పేపర్లో ప్రకటిస్తాను. మీారేమీా దిగులు పెట్టుకోవద్దు." ఆరినవాడిలా చెబుతున్న వాసును అలాగే విప్పారిన నేత్రాలతో చూడసాగేడు.

"కాఫీ అన్నయ్యా !" సుగుణ వచ్చింది. వికసించిన పుష్పంలా, కోమలంగా వున్న ఆ పిల్లను చూడగానే వాసు హృదయం ఆర్ద్రిమయింది. ప్రేమగా భుజాలు తట్టాడు.

"సుగుణా ! దినమంతా ఏం చేస్తావమ్మా ?"

"చదువుకుంటున్నాను అన్నయ్యా ! పిన్ని థర్డుఫార్మ పరీక్షకు కూర్చో మంటుంది. అమ్మకు, పిన్నికి సాయం చేస్తాను."

"మంచిపనమ్మా ! ఈసారి వచ్చేటప్పుడు ఏదయినా ట్రెయినింగ్ గూర్చి కనుక్కుంటాను. నాకు మరో కప్పు చేసి పట్రా." సుగుణ ప్రసన్నవదనంతో వెళ్ళిపోయింది.

"నాన్నగారూ ! సుగుణ అత్తవారికోపం ఇంకా తగ్గలేదా ?"

"యెలా తగ్గుతుంది ? వారు పరువుకు ప్రాణం ఇచ్చే మనుష్యులురా."

"అని మీారు భ్రమపడుతున్నారు. అన్యాయంగా ఒక ప్రాణం తీయడానికి సిద్ధపడటం కాదా ?"

"అన్నీ అయ్యాయి. బ్రతిమాలాం, బెదిరించాము."

"సరే! రేపు నాతో సుగుణను పంపండి. ఎలా వద్దంటారో చూస్తాను."

"వాసూ! బట్టీపట్టి పరీక్షలు చదువగానే తెలివి అనుకోకు, పెద్దలందరికంటే మొనగాడివా ?" అడ్డుపడింది నిర్మల.

"అమ్మా! నన్ను నిరుత్సాహపరచకపోతే ఒక అవకాశము ఇచ్చి చూడరాదూ?" అతనంత ధీమాగా అడుగుతుంటే కాదనలేకపోయారు. మంచిరోజు చూసి చీర సారెతో సుగుణను ప్రయాణం చేశారు.

"ఈ ఇంటికేం శని ఉందో! నాకు ఆడపిల్లలు లేరు. నా కొడుకుల పిల్లలకన్నా అచ్చట్లు ముచ్చట్లు తీర్చుకుందాం అనుకుంటేను ముగ్గురూ మూడు రకాలుగా తయారయితిరి." అంటూ అన్నమ్మ కంటతడి పెట్టుకుంది.

"వాసూ! తొందర పడకు."

"మీరేం చింతించవద్దు నాన్నా! వచ్చేవారం ఈ సుగుణ తన భర్తతో రాకపోతే నన్నడుగు." అన్నాడు ఠీవిగా. ఒక కాలు చీడీమీద పెట్టి రెండో కాలు క్రిందనిలిపి పెద్ద ఆరిందవాడిలా చెప్పే తీరు చూస్తే, అందరికీ నవ్వు వచ్చింది. సుగుణ సిగ్గుతో పిన్ని చాటుకు దాక్కుంది.

"ఓయ్! చెల్లమ్మా! సిగ్గంతా ఇప్పుడే ఒలికించకు. రేపు బావగారిదగ్గర ఒలికించాలి."

"చూడు చిన్నాన్నా!"

"నిజమే కదే." అంది అన్నమ్మ. ఇన్నాళ్ళ తరువాత అందరూ హృదయ పూర్వకంగా నవ్వారు. సుగుణను తీసుకు వెళ్ళిన వాసు సాయంత్రం తిరిగి వచ్చాడు. ఉత్సాహంగా ఉరకలు వేసుకుంటూ వెళ్ళినవాడు వాడినముఖంతో తిరిగి వచ్చాడు.

"ఏమన్నారురా?" ఆదుర్దాగా అడిగింది అన్నమ్మ.

"అనాల్సినవన్నీ అన్నారు నానమ్మా!"



"సుగుణను ఉంచేసుకున్నారా?"

"నేను ఉంచేసి వచ్చాను."

"సరిగ్గా చెప్పరాదూ?" నిర్మల విసుక్కుంది.

"వాళ్ళకు మన అమ్మాయి అక్కరలేదట. డబ్బు సంపాదించగలం కాని, పరువు సంపాదించలేం అని వాపోయాడు మానవుడు. కోడల్ని ఏలుకుంటే పోయిన పరువు రెక్కలు కట్టుకు మరీ వస్తుందని చెప్పాను."

"నువ్వు చెప్పింది వాళ్ళు అంగీకరించవద్దూ?"

"ఎందుకు అంగీకరించరు? ఎవడికోసం అంగీకరిస్తారు? సుగుణపై ఈగవాలినా వాళ్ళ అంతం చూస్తానని చెప్పాను" అన్నాడు నిదానంగా బూట్లు విప్పుకుంటూ. భాగ్యలక్ష్మికి కడుపులో దేవినట్లు అయింది. అత్తగారు ఒద్దు పొమ్మంటే పంచలు పట్టుకుని ప్రాకులాడటమా? ఎంత దారుణం! రోషంగల స్త్రీ వారి ముఖాన పేడనీళ్ళు చల్లి వస్తుంది కాని తన కూతురికి ఆ అదృష్టం లేదు.

"వాసూ!"

"ఏం పెద్దమ్మా?"

"దాన్ని వెనక్కు తీసుకు రావల్సింది బాబూ! ఏం చేస్తారో ఏమో?"

"ఏం చెయ్యరు పెద్దమ్మా! వాళ్ళు మూర్ఖంగా పట్టుదల చూపుతున్నారే గాని, అమ్మాయిని నిర్దాక్షిణ్యంగా తరిమేసే మూర్ఖులు కారు. వారం రోజులు ఓపిక పట్టండి." అనేసి, చెప్పులు వేసుకుని, ముఖం కడుక్కుని తండ్రిని చూడటానికి బయటికి వెళ్ళిపోయాడు.

"ఆ భగవంతుడికెంత నిర్దయ మాపైన! నేను ఈ పిల్లలు కావాలని ఏడ్చానా? ఈనాడు పంచలు చేరి పసి పిల్లలకు చులకనయిపోయాను. అందరికీ ఒకేసారి ఇంత విషమిచ్చినా పీడాపోయేది" అంటూ ప్రతి దినమూ ఏడ్చేది. నిర్మల పని ఇంకాటంలో పడింది. చెంపదెబ్బ వేసి నీ తప్పు అనిపించడానికి కొడుకేం చిన్నపిల్లాడా? వాసు ఎక్కువగా తండ్రికి సాయంచేస్తూ కూర్చున్నాడు, ఇంజను దగ్గర. ప్రతి రోజూ ఆశగా ఉత్తరం కొరకు చూస్తుంది. ఆ రోజు భాగ్యలక్ష్మి విలపింపు, సిష్ఠురోక్తులు వినలేక భర్తదగ్గరకు వచ్చింది.

"ఏమండీ! ఒకసారి సుగుణను చూచి రాకూడదూ?"

"నాకు మరో పదిరోజుల వరకు తీరిక లేదు. నువ్వు, వదినా వెళ్ళిరండి" అన్నాడు లెక్కలు చేసుకుంటూ.

"అమ్మా! మరికొన్ని రోజులు ఓపిక పట్టకూడదూ? సుగుణ మరీ చిన్నపిల్లేం కాదు. వాళ్ళు అవమానిస్తే ఈ పాటికి వచ్చేసేది." వాసు కచ్చితంగా తల్లి ప్రయాణము ఆపేశాడు. నిర్మలకు బాధగా ఉంది. వాసు త్వరగా ఉద్యోగం దొరికి వెళ్ళిపోతే బావుండును అన్పించింది. అప్పటికి ఇంజనీర్లకు ఉద్యోగాలు దొరకటం దుర్లభంగా తయారయింది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ, తండ్రికి వ్యవసాయంలో సాయం చేస్తున్నాడు వాసు.

## 32

"అమ్మా!" చేతిలో ఉత్తరం పట్టుకుని సంతోషంగా వచ్చాడు వాసు.



"ఏమిట్రా? ఎక్కడయినా ఉద్యోగం వచ్చిందేమిటి?" చేతులు తుడుచుకుంటూ వచ్చింది నిర్మల.

"నాకు ఉద్యోగం వచ్చేనాడు వస్తుంది. సుగుణ ఉత్తరము రాసింది" అందరూ ఆదుర్దాగా వచ్చారు.

"చిన్నాన్నకు నమస్కరిస్తూ సుగుణ వ్రాయునది -

ఇక్కడంతా క్షేమము. మీ క్షేమము తెలుపవలెను. ఇంతలో మీరెవరూ నన్ను చూడటానికి రావద్దు. మా మామగారు చాలా కోపంగా ఉన్నారు. నన్ను మాత్రం ఏం అనలేదు. అత్తయ్య ప్రేమగానే చూస్తుంది. వెంటనే ఉత్తరం రాయటానికి కవర్లు లేవు. ధైర్యంచేసి మొన్న వారిని అడిగాను. వెంటనే తెచ్చి ఇచ్చారు. మీరేం ఆదుర్దా పడవద్దు. నాకు చాలా బాగుంది. వారికి రావాలని ఉన్నా వాళ్ళ నాన్నగారికి భయపడ్డారట. ఇక ఉంటాను. అందరిని అడిగానని చెప్పండి. వాసన్నయ్య ఉంటే నా నమస్కారాలని చెప్పండి."

ఉత్తరం పూర్తి అయ్యేసరికి అందరి హృదయాల నుండి ఓ తేలిక నిట్టూర్పు వెలువడింది.

"ఏం పెద్దమ్మా' హాయిగా వుందా?" చిరునవ్వుతో చూచాడు.

"ఏమో నాయనా! కడుపుతీపి. ఏడ్చాను."

"పెద్దమ్మా! అచ్చుతీపి మంచిది కాదు ఆరోగ్యానికి. అప్పుడప్పుడు చేదు అవసరమే."

"నీ కడుపు చల్లగా వుండనీరా. దాని కాపురం చక్కబడితే ఇంకేం?" వణుకుతున్న చేతులతో నునవడి బుగ్గలు

వుణికింది అన్నమ్మ. ఆ రోజు అందరు సంతోషంగా కబుర్లు చెప్పుకున్నారు.

"తండ్రి వుంటే ఎంత సంతోషించేవారో! ఎక్కడున్నారే, ఏం చేస్తున్నారో!" భాగ్యలక్ష్మి కంట తడి పెట్టింది.

వాసు ఉద్యోగ ప్రయత్నాలతో విసిగిపోయాడు. చదివిన ప్రతివాడు వుద్యోగానికి ఎగబడటం వల్లే ఈ నిరుద్యోగ సమస్య అని తేల్చుకున్నాడు. తను వ్యవసాయం చేయాలి. అదే నిర్ణయించుకున్నాడు.

"సింథటిక్ డ్రగ్స్‌లో ఏదో వేకెన్సీ వుందటరా." భాస్కర్ రావు పేపరు తెచ్చి ఇచ్చాడు.

"వేకెన్సీ వుంది. తగిన అర్హతలు నాకు లేవు, నాన్నగారూ!"

"ఏం? అక్కడ అర్హతల విషయమే చర్చించలేదుగా."

"మీరు అన్నిటికీ అతీతమైన మోగులా, అమాయకులా అర్థం కావటం లేదు నాన్నా! ఈ ప్రకటనలన్నీ అమాయకులను మోసం చెయ్యటానికే నాన్నగారూ! ఏ కలెక్టరు చుట్టమో, మినిష్టరిగారి బంధువో ఎన్నికయి వుంటారు. ఇంటర్‌వ్యూ అంటూ, ఎన్నేళ్ళ అనుభవం అనడుగుతారు. అనుభవం యూనివర్శిటీలో వస్తుందా? ఆలోచించరు."

"అన్నీ తెలుసురా. ప్రయత్నిస్తే తప్పేం వుంది."

"ఏం లేదు. మీ చేతి డబ్బు వదులుతుంది." నవ్వాడు.



"ఈ ఇంటర్‌వ్యూల పుణ్యమా అని దేశంమాత్రం చూస్తున్నాడు."

"అంత నిరాశ కూడదురా" నిర్మల చెప్పింది.

"నిరాశ కాదమ్మా! నిజం చెబుతున్నాను. మనకు వెనకింత పొలం ఉంది. మీరిద్దరూ ఇంకా సంపాదిస్తున్నారు కాబట్టి ఫరవాలేదు. కొడుకుల చదువుకోసం అప్పులు చేసే వారి సంగతి ఆలోచించు."

"నిజమే నాన్నా!" అంది ఆప్యాయంగా కొడుకు తలపై చేయివేసి. అతనికి ఆలోచించటానికి సమయమే లేదు. వ్యవసాయం పనులతో తీరికే ఉండటం లేదు. తల్లి తండ్రుల ఆశలు, ఆశయాలు తెలుసు. తనుండి వ్యవసాయం చేస్తే సరిపడే పొలం లేదని తెలుసు. అందుకే కన్పించిన ప్రకటనకల్లా అప్లయ్ చేశాడు. కాలం దొర్లిపోతుంది. కాని ఉద్యోగ్యం దొరికే ఆశమాత్రం కన్పించలేదు.

ఓ రోజు ప్రసాద్ తమ్ముడిని వెంటబెట్టుకుని వచ్చాడు. తమ్ముడి వంతు భాగం పంచుమన్నాడు. భాగ్యమ్మ తిట్టిపోసింది. భాస్కర్ రావు అసహ్యంగా చూచాడు. వాసు మాత్రం వాళ్ళను చాలా గౌరవంగా కూర్చొపెట్టాడు.

"అలాగే పంచుకొండన్నయ్యా!" అన్నాడు.

"నీవు నిజంగా కాలంతో మారిన మనిషివిరా." సంతోషంగా వాసు వీపు చరిచాడు ప్రసాద్, గొల్లమల్లి పాలమ్మి పోషించిన కండలు చూచుకుంటూ.

"అవునన్నయ్యా! కాలంతో పాటు మారితేనే సుఖం. ఈ బంధాలు, బంధువులూ ఎందుకు చెప్పు? ఏడ్వటానికా?

మీ భాగం, మీ అమ్మ, తమ్ముళ్ళను చెల్లాయిలను తీసుకు పొండి. మాకు యెంతో మేలుచేసిన వారవుతారు."

"నేనే...అక్కడక్కడ చిన్న పనులుచేసి నన్ను నేను పోషించుకుంటున్నాను. వీళ్ళందరినీ ఏం చెయ్యను ?" సుధాకర్ అడిగాడు.

"అది నీ ఇష్టం. అలాగే రేడియో, వాచీ డబ్బులు ఇచ్చి వెళ్ళు."

"వీడు తనేదో తెలివికలవాడిని అనుకుంటున్నాడు. ఇప్పుడే పంచాయితీ పెట్టిస్తా." చిర్రుబుర్రుమంటూ లేచాడు ప్రసాద్.

"ఇంత కోపం ఆరోగ్యానికి మంచిది కాదన్నయ్యా !" చిరునవ్వుతో అంటున్న వాసును చూడగానే, మండిపడుతూ వెళ్ళిపోయాడు.

సాయంత్రం పంచాయితీ ఆఫీసునుండి పిలుపు వచ్చింది భాస్కర్ రావుకు.

"వాసూ ! నువ్విలాంటి పనులే చేస్తావు. ఇప్పుడా విద్యాహీనులముందు నేను పంచాయితీ జరిపించాలా ?"

"ఫరవాలేదు నాన్నగారూ ! మనదేశంలో యెందరు పలికలకు తమ పేరు వ్రాయవస్తుందని?... నేను వెడతాను. కాదు, కూడదంటే మీరు రాక తప్పదనుకోండి." ధోవతి, లాల్చీ వేసుకుని ఠీవిగా వెళ్ళే కొడుకును చూస్తుంటే ఇరవై ఏళ్ళనాటి భాస్కర్ గుర్తుకొన్చాడు నిర్మలకు. చిన్నగా నవ్వుకుంది.

"ఏమిటా నవ్వు ?"



"ఏం లేదు." తప్పించుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది. బాగా ప్రొద్దుపోయి తిరిగి వచ్చాడు వాసు.

"ఏం జరిగింది ?" ఆదుర్దాగా అడిగింది నిర్మల.

"జరుగడాని కేముందమ్మా ! నేను ఏదయినా అన్యాయంగా చెబితేకదా! నేను చెప్పినట్టు వారు అదే చెప్పారు. ఆస్థికాదు, బరువు మధ్యతలకు వారసులమని చెప్పారు."

"ఏరివాళ్ళు ?"

"నా అంతం చూస్తామని ప్రతిజ్ఞచేసి వెళ్ళిపోయారు."

"ఈ విరోధం ఎందుకురా ?"

"ఏం చేద్దాం ? కొన్ని పనులు విరోధంతోనే సాధించాలి." అన్నాడు, నిర్లక్ష్యంగా. భోజనంచేసి నిదుర పోయాడు వాసు. నిర్మల భర్త పడుకున్నచోటికి వెళ్ళింది. అతని ప్రక్కన చోటుచేసుకుని కూర్చుంది.

"ఎవరూ వాసూ...నువ్వా నిర్మలా ?" అతను ఒత్తిగిలి చోటు ఇచ్చాడు.

"ఏమండి ?"

"వాసు రాలేదా ?"

"వచ్చాడండీ...నాకేదో భయంగావుంది. ఊళ్ళోవారు వీడి మాటలనే బలపరిచారట. దాంతో ప్రసాద్, సుధాకర్ 'అంతు చూస్తాం' అని వెళ్ళారట."

"భయం దేనికి ?"

"ఆ పిల్లలతత్వం బాగా తెలుసండీ. వీడీ ఊళ్ళో ఉండటం నాకేం ఇష్టంలేదు. ఆవేశం తగ్గి, కొంత వయసు రానీ." అన్నది ఆవేదనగా.

"నువ్వు నిశ్చింతగా వుండు. రేపే ఛీఫ్ ఇంజనీరుగారితో మాట్లాడుతాను ఈ విషయం వాడితో మాత్రం అనకు."

"అలాగే. తొందరగా కానియ్యండి." అలాగే కాస్తంత చోటులో ముడుచుకుని పడుకుంది.

## 33

వాసు ఉద్యోగం దొరికి, నాగార్జునసాగర్ వెళ్ళిపోయాడు. నిర్మలకు కొండంత బరువు దిగినట్టుంది. బి. ఎస్సీ. పూర్తికాగానే నందిని వివాహం చెయ్యాలని నిశ్చయించుకున్నారు.

"నిర్మలా! నా పేంట్లు ఒక్కటీ కనబడదేం?" భాస్కర్ అరిచాడు.

"మీకు యెదురుగా ఉన్నవే కనిపించవు. ఇక అలమారాలో ఉన్నవి యేం కనిపిస్తాయి?" విసుక్కుంటూ వచ్చింది నిర్మల. ఆమె వెతుకుతూ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు నిలుచుండిపోయింది.

"గతవారం బట్టలు తేకుండా, మొన్న తీసుకుపోయాడు చాకలి. ఈ ఉలెన్ ప్యాంటు వేసుకోండి."

"నీ వాటం చూస్తే నేను విందారగించడానికి వెడుతున్నాను అనుకుంటున్నావులా వుంది."

"మరెలా? పోనీ వాసు ప్యాంటుంది వేసుకుంటారా?"

"వాడివన్నీ టైట్ ప్యాంట్లు."

"ఒకటి పనిచేసేప్పుడు వేసుకునేది వదులుగానే వుంది. వదులుగా ఉందని ఇక్కడ వదిలేశాడు."



"ఏదో ఒకటి ఇవ్వు. పాపం వరహాల శెట్టి కాచుకుంటాడు. అసలే కోపంగా వున్నాడు." త్వరగా భార్య ఇచ్చిన ప్యాంటు వేసుకుని వెళ్ళిపోయాడు.

"సాయంత్రం వచ్చేటప్పుడు ఒకసారి ఇంజన్ చూసి రండి. శబ్దం వస్తూందట." ఆమె మాటలు విన్పించినట్టు తలాడించి వెళ్ళిపోయాడు. ఈసారి వరహాల శెట్టి జాగ్రత్తగా వున్నాడు. వర్కంతాచూసి సర్టిఫై చేసి, ఇంకో సైటు మీదికి వెళ్ళేసరికి నాల్గయింది. భోజనంకూడా చెయ్యలేదు. అయిదింటివరకు అంతా పూర్తి చేసి, తన పొలం చేరుకున్నాడు. ఇంజను బాగుచేసేసరికి చీకటిపడింది. ఇంజను గదికి ఇంటికి నాల్గుఫర్లాంగులకంటె ఎక్కువదూరం వుండదు. నుదుటపట్టిన చెమట తుడుచుకుంటూ రెండు అడుగులు వేశాడు. దూరంగా అడుగుల చప్పుడు, గుసగుసలు విన్పించాయి. జీతగాడి కొడుకూ, వాడి ప్రియురాలు అనుకున్నాడు తరుచుగా, బోగన్విల్లా పందిరి క్రింద కబుర్లు చెప్పుకుంటారు. నవ్వుకుని రెండడుగులుముందుకువేశాడు. అంతే నలుమూలల నుండి లాఠీలవర్షం కురిసింది. "అబ్బా!" అంటూ నేల కొరిగాడు.

"ఒరేయ్ చిన్నాన్నరా!"

"ఆఁ! వాసుగాడు అనుకున్నాం." స్పృహ తప్పుతున్న భాస్కరరావుకు లీలగా పై మాటలు విన్పించాయి.

ఎనిమిది దాటినా భర్త ఇల్లు చేరలేదని నిర్మల వాకిట్లో నిలబడి చూస్తూంది. అన్నమ్మ, పిల్లలు నిదురబోయారు

"నువ్వు పడుకో అక్కయ్యా!"

"ఎనిమిదే అయిందిగా. రానియ్యి భాస్కరాన్ని." ఇద్దరూ మరో పదినిమిషాలు చూచారు. ఆ రోజు దగ్గరవూరిలో 'పోచమ్మ'ను కొలుస్తున్నారు. ఒక్క జీతగాడు రాడని తెలుసు. మొదటిసారిగా అడవి అంటే భయం వేసింది.

"అక్కయ్యా! ఒక్కసారి ఇంజన్ గది దగ్గర కెళ్దామా?"

"ఊర్లోనే పని వుందేమో నిర్మలా! అతను ఇంజన్ గదిలో ఇంతసేపు యెందుకుంటాడు? ఈ రోజు యెవరు వుండరని తెలుసు."

"ఒకసారి చూద్దాం." ఇద్దరూ లాంతర్లు తీసుకుని బయలుదేరారు."

"ఈసారి మరిదితో చెప్పు. ఊళ్ళో రెండుగదులు వేయించమని. ఒక్కరోజు మొగవారు లేకుంటే ఎంత బేజారో చూడు."

"అలాగే! వాసు జీతం రానివ్వండి." అంది నవ్వుతూ.

"నిర్మలా ఆగు."

"ఏమక్కయ్యా?"

"దూరంగా దారిలో ఏమో అడ్డంగా పడిలేదూ."

"అవును." అన్నది ఆగి పరీక్షగా చూస్తూ.

"అయితే వెనక్కి పోదాం."

"దగ్గర కెళ్ళి చూద్దాం."

"పడుకునిఅమ్మో! నీకు తెలియదు నిర్మలా! అలా దారిలో
దగ్గరగా, వాళ్ళగానే మీదపడి దోచుకుంటారుట."

"అందరికీ తెలుసక్కయ్యా! మనం పొలాల దగ్గర



ఒంటరిగా ఉన్నామని ఇంట్లోపడి దోచుకున్నా అడ్డేముంది చెప్పు?" ధైర్యంగా ముందుకు వెళ్ళింది. కొద్దిదూరం వెళ్లాక, ఒక ప్రక్క వాలివున్న తల ఎవరిదో గుర్తుపట్టింది. కెవ్వుమని ఒక్క అంగలో అతన్ని చేరింది. ఎటు తిప్పితే అటు తిరుగుతున్నాడు తల ఒడిలోకి తీసుకుంది, వెంటనే ఆమె లేత వర్ణపు చీర రక్తసిక్తమయింది.

"అక్కయ్యా! త్వరగా ... వారు ..." ఏడ్పునాపుకుంటూ ముక్కు దగ్గర చేయి పెట్టింది. గుండెపై చెవి పెట్టింది. శ్వాస ఆడుతూంది. భాగ్యలక్ష్మి లాంతరు పైకి యెత్తి చూస్తూ ఒణికిపోయింది.

"అయ్యో! అమ్మో! ఎవరో కొట్టారు. తల్లో!" ఏడ్పు లంకించుకుంది.

"ఏమండీ! యెవరికి చేతులు వచ్చాయి. మిమ్మల్ని కొట్టడానికి?" నిర్మల భోరున ఏడుస్తూంది. వెంటనే కర్తవ్యం గుర్తుకు వచ్చింది.

"అక్కయ్యా! నువ్విక్కడే వుండు. నేను డాక్టరును పిలుస్తాను."

"అమ్మా? ఒంటిగానా? నేను వస్తాను. ఆ వెధవలు ఇక్కడ దాక్కున్నారేమో!" అంది భయపడుతూ.

"ఈ ఒక్కరోజు ధైర్యం వహించు అక్కా! ఇప్పటికే ఆయన రక్తం చాలా పోయింది" అన్నది స్రవించే అశ్రువులు ఒత్తుకుంటూ.

"అత్తయ్యను పంపుతాను. త్వరగా." వున్మాదినిలా ఇల్లు చేరింది. అత్తను కుదిపి లేపింది.

"ఏమిటే ?"

"అక్కయ్యకు భయంగా వుందిట. కాసేపు అలా కూర్చుందువు పద." అంటూ చేయూతనిచ్చి తీసుకువచ్చింది. ఆమెకు కళ్ళు కన్పిస్తే ఊళ్ళో వాళ్ళందరూ మేల్కొనేంత హడావుడి చేసేది. మసగ్గా ఏం కనిపించలేదు. మోకాళ్ళమీద తల ఆన్చుకుని కునుకుతీయసాగింది.

నిర్మల ఎలా డాక్టరుగారిల్లు చేరిందో, ఎలా అతన్ని పిలిచిందో ఆమెకే తెలియదు. తలుపులు తీసి వున్మాదినిలా వున్న ఆమెను చూచి రెండడుగులు వెనక్కు వేశాడు.

"డాక్టరుగారు — వారికి - వారు."

"ఏమయిందమ్మా ?"

"వారు - వారిని యెవరో కొట్టారు - డాక్టర్ - మీరు త్వరగా రండి. ఊపిరి ఆడుతూంది." అన్నది అలాగే గుమ్మం దగ్గర వొరిగిపోయింది.

"ఒదినా! విమలా!" అతను ఇంట్లోవాళ్ళను పిలిచాడు. వారికి నిర్మల విషయం చెప్పి తను బయటికి పరుగెత్తాడు. అరగంట క్రితం చీకటితో, నిశ్శబ్దంగా వుండి భయాన్ని కలుగజేసే పరిసరాలు, లైట్లతో మనుష్యులతో తిరునాళ్ళలా తయారయింది.

"చీమకు హానిచెయ్యని శాంతమూర్తిపై ఎవరి కింత కక్ష ?"

"ఇంకెరికమ్మా! అచ్చోసిన ఆంబోతుల్లా వున్నారుగా! అన్న కొడుకులట, యమదూతలు."



"తండ్రిని దేశాలు పట్టించారు, పినతండ్రిని స్వర్గము పంపాలని చూస్తున్నారు."

"ఇదంతా ఆ తల్లి గారాం." ఇలా అందరి మాటలు వింటూ, పళ్ళు కొరుకుతూ కూర్చుంది భాగ్యమ్మ. మరో గంటలో ఆ ప్రదేశం యథాప్రకారంగా మారిపోయింది.

## 34

"మీరు ఒకసారి ఇలా రాగలరా ?" వాసును తన గదిలోకి పిలుచుపోయాడు డాక్టరు.

"ప్రమాదం తప్పింది కదూ, డాక్టరుగారూ ?"

"మిష్టర్ వాసూ! ప్రాణాపాయం లేదు 'సెరిబ్రెమ్' బాగా డామేజ్ అయింది, కుడిప్రక్క!"

"కుడిపక్క పారలైజ్ అయిందా ?"

"ఐ యామ్ సారీ ..."

"దట్సాల్ రైట్" అనేసి బలవంతంగా కన్నీళ్ళు ఆపుకున్నాడు.

"టేకిట్ ఈజీ మిస్టర్ వాసూ!" అతను భుజం తట్టాడు.

"డాక్టర్ ! ఇక్కడనుండి వేరే తలుపు ఉందా ?"

"ఏం యెందుకు ?"

"......"

"ఏం యెందుకు ?" వాసు భుజం పట్టి రెట్టించాడు.

"నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాక అమ్మకు ముఖం చూపించాలి డాక్టర్ !" అతని కళ్ళల్లో నీరు టప్పు టప్పుమని రాలిపడింది.

"మీరింత అధైర్య పడతారని తెలిస్తే ..."

"మీకు తెలియదు డాక్టరు ! కొందరికి జీవితం ఒడ్డించిన విస్తరి."

"మా అమ్మా, నాన్న తాము కష్టపడి, పునాదులు వేసి జీవితసౌధాన్ని నిర్మించుకున్నారు. ఒకరి ప్రేమాను రాగాలు ఒకరు పంచుకుంటూ. ఈ పరిణామము అమ్మ భరించగలదా ?"

"మీరు ధైర్యం చెప్పాలి." యెంతో నచ్చచెప్పి పంపాడు. సాయంత్రమువరకు తల్లిని తప్పించుకు తిరిగాడు, చందు మెడికల్ స్టూడెంటు, అతనికి అర్థం అయింది.

"అన్నయ్యా !"

"వస్తాను నందినీ ! నాన్నగారికి మందులు కొనాలి." వాసు వెళ్ళిపోయాడు. రాత్రికి చందును దగ్గరుండమని అందరూ వచ్చేశారు.

"అమ్మా, నాకు కొంచెం పనుంది. నువ్వూ, నందినీ మామయ్యతో వెళ్ళండి." టాక్సీని కేక వేయబోయాడు.

"వాసూ !" ఓ నీరస హాసం వెలువడింది నిర్మల పెదవుల మీద. కొడుకు చెయ్యి పట్టుకుంది "టాక్సీ యెందుకు ? రిక్షాలో వెడదాం. అన్నయ్యా నువ్వూ, నందిని ఒక రిక్షాలో వెళ్ళండి." వాళ్ళు వెళ్ళాక తమ కో రిక్షా మాట్లాడి యెక్కి కూర్చున్నారు.



"ఎందుకురా అంత భయం ? మెదడు ? భాగాలు దెబ్బతిని, మీ నాన్నగారికి పక్షవాతం వచ్చింది కదూ ?"

"అమ్మా !"

"ఆ మాట చెప్పటానికి ఇంత జడుస్తున్నావా ? పిచ్చి వాడా !" నవ్వుతూ కొడుకుచెయ్యి నొక్కింది. ఆ నవ్వులో జీవం లేదు.

"నాకు ఏడ్పు రావటం లేదురా ! ఏడ్వను, ఆయన కోసం. కర్మ సిద్ధాంతం ప్రకారం పూర్వజన్మలో చాలా పాపం చేశాను."

"వద్దమ్మా ... వద్దు. అలా అనకు..." వాసు బాధగా చూచాడు." నాన్నగారు కొట్టిన వారిని చూచే ఉంటారు. తనేం చూడలేదని చెబుతున్నారు. పోలీసులంటారు ఆయన నిజం చెప్పటం లేదని."

"అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముందిరా ?"

"ఇప్పటివరకు పోషించింది, రక్షించింది చాలదా ?"

"అంటే ప్రసాద్‌ను అనుమానిస్తున్నారా ?"

"అనుమానం దేనికి ? నిజం."

"ధూర్తుడే. కాని ఇంత నీచానికి దిగడురా."

"ఆ నమ్మకమే మనల్ని పాడుచేస్తుంది." అన్నాడు విసుగ్గా. రిక్షా ఇల్లు చేరింది.

* * *

కొడుకులు ఆసరా ఇవ్వగా నెలరోజులకు ఇల్లుచేరాడు. ఈజీ చైర్లో కూర్చున్నాడు భాస్కర్ రావు.

“వాసూ! ఉద్యోగం మాని రెస్టు తీసుకొమ్మన్నావు. యెలా వుందిరా? ఇప్పుడు పూర్తిగా విశ్రాంతి” నవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు.

“నాన్నగారూ!” వాసు బాధగా అరిచాడు. “ఇలాంటి విశ్రాంతి నేను కోరలేదండీ.”

“మీకు మతిపోయిందా? ఫారిన్ పంపి బాగు చేయిద్దాం” చందు అరిచాడు.

“ఫారినా, పాడా చక్కగా ఆయుర్వేద మందు లిప్పించండి. అదే తగ్గుతుంది.” చూడటానికి వచ్చిన వారి సలహా. వాసుకు తెలుసు, ఇక తండ్రి కుడిచేయి, కుడికాలు పని చేయవని. డాక్టర్లు అంతా నిర్ణయించేశారు. కన్ను కూడా వంకరపోయింది.

“నిర్మలా! ఏమిటే గోల?” తల క్రింద చెయ్యి పెట్టుకుని పడుకున్న అన్నమ్మ లేచి అడిగింది. ఆమెకు కొడుకు సంగతి తెలియదు. ఒకటి రెండుసార్లు భాగ్యమ్మను అడిగింది. ఆమె చెప్పింది వినిపించక, మళ్ళీ గొణుక్కుంటూ పడుకుంది. ఈ రోజు సగం ఊరు భాస్కర్ రావును చూడటానికి వచ్చింది అందరి మాటలు గోలగా చెవిలో పడుతున్నాయి.

“మీ అబ్బాయిని చూడటానికి ఊళ్ళోవారొచ్చారు” అన్నది, కొడుకు సంగతి తెలిసే ఉంటుందని.

“ఏమిటే? నందినిని చూడటానికి వచ్చారా?” బోసి నోటితో నవ్వింది. “వెళ్ళి పనులు చూసుకో ...” అని మళ్ళీ పడుకుంది.

“అన్నింటికి అతీతురాలు, అదృష్టవంతురాలు” అనుకుంది నిర్మల.



అందరూ వెళ్ళిపోయాక, అన్నం తెచ్చింది నందిని. యెడమచేత్తో చెంచాతో తిన్నాడు.

“మీరు విశ్రాంతి తీసుకోండి నాన్నా!” వాసు తండ్రిని పడుకోబెట్టి వెనుతిరిగాడు.

“వాసూ!”

“చెప్పండి నాన్నా!”

“నేనేదో అన్నాను. ఏం అనుకోకురా. మీరే నా కాళ్ళు, చేతులు.”

“ఆ విశ్వాసం ఉంటే చాలు నాన్నా.”

“బావుందిరా నిష్ఠూరం. మీరు నా కళ్ళు, నా సర్వం. మీ మీద విశ్వాసం ఉండదా?”

“నమ్మమంటారా?”

“అయితే నమ్మకము లేదురా? యేం చేయాలో చెప్పు?”

“చేస్తారా?”

“చెప్పి చూడు.”

“మీపై అత్యాచారం చేసింది ప్రసాద్ కదూ?”

“నేను చూడ లేదన్నానుగా ...” కళ్ళు దించుకున్నాడు.

“ఇదన్న మాట మీ నమ్మకం ...” వాసు నిష్ఠూరంగా అన్నాడు.

“లేదు వాసూ! ప్రసాదే కాదు, సుధాకర్ కూడా ఉన్నాడు. నన్ను కొట్టాలని కాదు వాళ్ళు వచ్చింది. వాసూ! ఇలా దగ్గరగా రారా” కొడుకు చేయి యెడమ

చేత్తో పట్టుకున్నాడు. "నిన్ను కొట్టాలని. భగవంతుడు దయామయుడు. ఒక్కరోజు ముందుగా నిన్ను పంపేశాడు. చాకలి పుణ్యమా అని నీ ప్యాంటు వేసుకున్నాడు ..." అతని కంఠం వణికింది.

"నాన్నా !" వాసు కళ్ళు ఎర్రబారాయి కోపంతో. శరీరం బిగుసుకుపోయింది.

"వాసూ! నాకో మాటివ్వాలిరా !"

"ఇప్పుడు మాత్రం కాదు పోలీసుల దగ్గర వీళ్ళ పేర్లు బయలు పెట్టవద్దంటారు. అంతేనా ?" వెనుతిరిగి చూచాడు "నేరాన్ని కప్పిపుచ్చడం నేరమే నాన్నా! ఏమయినాసరే! ఈరోజు వారో నేనో తేలిపోవాలి."

"వాసూ !" తీక్ష్ణంగా పిలిచాడు.

"ఈ విషయంలో నన్ను మన్నించండి."

"అయితే వెళ్ళు. పోలీసులముందు నేను మాట్లాడక పోతే నన్ను నిందించకు మరి —" అన్నాడు వెల్లగా.

"నాన్నగారూ! మీకు వాళ్ళంత ముఖ్యము అయినందుకు చాలా సంతోషంగా ఉంది. నా పరిధి ఏమిటో నాకు చూపించారు. వస్తాను." చరచరా వెళ్ళిపోయాడు. ఓ భారమైన నిట్టూర్పు వదిలాడు భాస్కరరావు. అలాగే దిండ్లకు చేరబడి ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

పనంతా ముగించుకు వచ్చిన నిర్మల మంచం దగ్గర చాపపై చతికిలబడింది. తండ్రీ కొడుకులు మాట్లాడుకున్నారనుకుంది.

"అమ్మా !" నందిని తలుపుదగ్గర కొచ్చింది.

"ఏమ్మా ?" పెద్దన్నయ్య వెళ్ళిపోయాడని చెప్పింది.



"అంత తొందరేం వచ్చింది ?"

"క్రొత్తకదమ్మా" నందిని చెప్పింది. నిజమే అనుకుని అలసటగా ఉండడంమూలాన అలసి, నిదురబోయింది. నిర్మల ప్రసన్నంగా తిరుగటం చూచి భాస్కర్ ఆశ్చర్యపోయాడు. ఆ మాటే అడిగాడు.

"నిర్మలా ! భగవంతుండు నిర్దయుడు చూడు..."

"కాదు, కరుణామయుడు. మిమ్మల్ని ప్రాణాలలో నాకు దక్కించాడు" అంటుంది అతని మోకాళ్ళపై తల అన్చి. మౌనంగా ఆమె నెరిసే జుట్టువంక చూడసాగేడు.

# 35

వాసు మళ్ళీ రెండు నెలలయినా తిరిగి రాకపోయేసరికి నిర్మల ఆశ్చర్యపోయింది. ఆ విషయం విచారించటానికి ఆమెకు యెక్కువగా సమయము దొరకటంలేదు. పొలాలవైపు, బడిపని ఇంట్లో ఉన్న కాసేపు భర్తను నవ్వించి కబుర్లతో అతని బాధపోగొట్టే ప్రయత్నంలో ఉంటుంది. చెప్పినా నమ్మలేని నిజం - బ్యాంకులో అయిదారు రూపాయలకంటె యెక్కువగాలేవు. ఊళ్ళో డాక్టరుగారి లెక్క ఇంకా ఇవ్వలేదు. చందుకు డబ్బు పంపాలి. నందినికి పంపాలి. తన జీతం రాకముందే ! దానికి సరిపడా ఖర్చు ఉంది. జీతగాళ్ళకు చెరో వంద ఇస్తానని వాగ్దానం చేసింది. యెలా అప్పు అడుగుతుంది ?

"నిర్మలా ?"

"ఏమండీ ?"

“పిల్లలకు డబ్బు పంపావా ?”

“ఇంకా లేదు.”

“నేనిలా మూలపడిపోయాను. ఈ బాధ్యతలన్నీ నీ నెత్తిన రుద్దాను. కర్ర ఇవ్వు. అలా వెళ్ళి ప్రయత్నిస్తాను. నా లీవ్ సాలరీ, ఇన్సూరెన్సు వస్తే ఇద్దాం.”

“వద్దండీ—వాళ్ళు లేదంటే మీకు బాధ. కొంచెం మిగిలిన బంగారం ఉంది. దాన్ని అమ్మివేస్తాను. వాసుకు ఉత్తరం రాద్దాం.”

“వద్దు నిర్మలా ! ఎవరి బాధ్యత వారికి తెలియాలి” వారి మాటలు పూర్తి కాకుండానే ఉత్తరం తెచ్చింది.

“పిన్నీ ! ఉత్తరం.”

“వాసు ఉత్తరం” అంటూ, ఆనందంగా అందుకుంది.

“పూజ్యులయిన అమ్మనాన్నగార్లకు, నమస్సులు.

ఈ పాటికే మీ మనస్సులు కుదుటపడ్డాయి అనుకుంటాను. నేను స్వయంగా రానందుకు క్షమించగోర్తాను. ఈ నెలనుండి చందు, నందినీ చదువు నేను చూచుకుంటాను. ఇక మిమ్మల్ని శాసించే అధికారం నాకు లేదు. ‘పాముపగతోక చుట్టము’ అన్న సామెత రీతిని మీరు అవలంబిస్తున్నారు అదే నాకు విచారం. ఒక విషయము గుర్తుంచుకోండి. స్వార్థపరులెప్పుడూ సుఖపడతారు. మీరు ఎన్నుకున్న దారి సుడిగుండం లాంటిది. మునిగేవారిని రక్షించబోతే మనం మునిగిపోతాం అని మరోసారి మనవిచేస్తున్నాను. మీరు నా దగ్గర వచ్చిఉంటారనుకోవటం కల అన్నసంగతి నాకు



లుసు. ఆచరణలోకి రాని విషయం పదే, పదే అనటం కిష్టం ఉండదని మీకు తెలుసు.

నందిని కిష్టమైతే నాతో పనిచేసే ఇంజనీరుతో సంబంము కలుపుకోవాలని ఉంది. హైదరాబాద్ వెళ్ళుతాను అత తో. ఈ విషయంలో అన్యథా భావించరని తెలుసు...”

త్తరం పూర్తిచేసి భర్తవంక చూచింది. అతను నవ్వు న్నాడు.

“ఏమిటి వీడిలా రాశాడు ?”

“కొడుకుల మనసెరిగిన తల్లివి నీకు తెలియాలి” అంత టె మరేం మాట్లాడలేదు.

“పోనివ్వండి రాత్రింబవళ్ళు వేధించే సమస్యను ష్కరించాడు. అదేచాలు” అన్నది, తేలికగా ఊపిరి స్తూ.

“ఈ ఒక్క సంవత్సరం ప్రీమియమ్ కడితే డబ్బు కి వస్తుంది నిర్మలా ! అదే నందిని వివాహానికి వాడుదాం.”

“ప్రీమియం కట్టమని వాడికి మాత్రం రాయను. ంత నిష్ఠూరాలతో రాశాడు.”

“చిన్న కుర్రవాడితో మన కేమిటి లెద్దూ.” అతనికి లుసు, కొడుకు కోపమెందుకో.

“ఊహుఁ ! వాడికింత బరువు ఎత్తటం మంచిది కాదు. మే ఆలోచించాలి” అన్నది. ఎంత ఆలోచించినా పరి ర మార్గం దొరకలేదు.

మర్నాడు ఆఖరు పీరియడ్లు ఖాళీగా ఉన్నాయి. ఎప్పటిలా కాపీలు దిద్దుతూ కూర్చోలేకపోయింది. తోటివారు చూపే సానుభూతి భరించరానంతగా ఉంది. ఆయన ఏంచేస్తున్నారో, ఇంటికి వెళ్ళిపోతాను అనుకుని వచ్చేసింది. ఇంట్లో అడుగు పెడుతూ ఆగిపోయింది.

"వెళ్ళు. ఇంకా ఏం మిగిలిందని వచ్చారు?" భాస్కరరావు గొంతు తీవ్రంగా ఉంది.

"క్షమించండి చిన్నాన్నా!"

"క్షమించడమా? డబ్బు; పరువు, ప్రతిష్టలు అన్నీ పోగొట్టారు. బాధపడలేదు. చూచారా! మీమూలంగా ఈ రోజు రెక్కలు విరిగిన పక్షిలా ఇలా పడిఉన్నాను. భాగం కాదు...మీకు..."

"మీరు అందరు చెప్పేమాటలు నమ్మతున్నావ్?"

"అలా నమ్మితే మీరు ఈరోజు జైల్లో ఉండేవారు. నా చెవులతో స్వయంగా మీ గొంతులు విన్నాను. ఆ వేసే దెబ్బలు ఏవో బలంగా వెయ్యకూడదూ? ఈనాడు జీవచ్ఛవంలా బ్రతికే అవసరం ఉండేది కాదు." బాధగా అడిగాడు.

"అదికాదు చినాన్నా!"

"నన్నా వరసతో పిలవకండిరా. యెంత ప్రయత్నించినా మీమీద కోపం రావటం లేదు. మీరు చెప్పేది తెలుసు. వాసును కొట్టాలని కదూ ప్రయత్నం! యెంతలో గండం గడిచింది. వాడు జీవితాంతం అవిటివాడుగా ఊహించలేనురా."

"నాకెక్కడా పనిలేదు."



"అవును చిన్నాన్నా! వాడిది వాడికి పంచి ఇస్తే" ప్రసాద్ వంత పాడాడు.

"భాగం లేదు...మీ తలకాయలేదు. వెళ్ళండి. మళ్ళీ యిక్కడకు వస్తే తన్నులు తింటారు."

"మాట—"

"చెప్పానుగా పోలీసుల్ని పిలువాల్సివస్తుంది.అంతే."

ఇద్దరూ తోకముడిచారు. గుమ్మంలో స్థాణువులా నిల్చున్న నిర్మలకు వారిని చూడగానే ప్రాణం లేచివచ్చింది.

"ఆగండి." ఇద్దరూ ఆగారు.

"కూర్చోండి" బయట గదిలో వున్న కుర్చీలలో కూర్చున్నారు.

"నిర్మలా!" కర్రసాయంతో గెంతుతూ వచ్చాడు. భాస్కర్ రావు.

"మీరు రండి." భర్తకు ఆసరా ఇచ్చి కూర్చోబెట్టింది వంట ఇంట్లో నిలబడి వింటున్న భాగ్యలక్ష్మిని పిలిచింది.

"చూడండి, ఆవేశం యెందుకు? ఏనాటికయినా యెవరిది వారి కివ్వాల్సిందే కదా!"

"అలా చెప్పు పిన్నీ!"

"ఆ వరస గుర్తున్నందుకు చాలా సంతోషం. మీ ఆస్తితో పాటు మీ అమ్మా, పిల్లలను తీసుకుపోవాలి."

"వాళ్ళెక్కడ వుంటారు?"

"మీరున్న చోటే." అన్నది దృఢంగా. "చూడండి ఎవరిది వారు పంచుకునిపోతే వారిని చూచేది ఎవరు? మీ

చిన్నాన్నను లేవకుండా చేశారు. కూర్చున్న కొమ్మను నరికేంత మూర్ఖులని అనుకోలేదు." ఆఖరిమాట అనేటప్పుడు ఆమె కంఠం వణికింది.

ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. 'నాల్గు రోజులకోసం తీసుకుపోయి, తరువాత వదిలేస్తే పోయింది. ఆస్తంతా వస్తుంది' అనుకున్నాడు సుధాకర్

పొలం పంచి ఇచ్చేశారు. సుధాకర్ కు కొండ ఎక్కినంత సంతోషంగా వుంది. అవసరానికి తమ్ముల భాగంకూడా అమ్ముకోవచ్చు. పెద్దలందరిముందూ భాస్కర్ మరో ప్రతిపాదన పెట్టాడు. చిన్నపిల్లలు ఇద్దరూ పెద్దవారు అయ్యేవరకు పొలం అమ్మకూడదు. ఊర్లో ఎవరూ కొనకూడదు. అది అందరూ ఆమోదించారు. మర్నాటి పత్రికలలో ప్రకటనకూడా జరిగింది. తల్లిని మోసపుచ్చి మాయ చేయవచ్చని అప్పటికి అన్నిటికీ తలాడించారు. అయిదుగురు పిల్లలతో భాగ్యమ్మ కొడుకులతో ప్రయాణం అయింది.

"నిర్మలా! ప్రసాద్, సుధాకర్ కొట్టారనే ఇంకా నమ్ముతున్నావా?"

"నా నమ్మకంతో పనేముంది? వాళ్ళను అడుగు. ఏది ఏమయినా భగవంతుడు అందరినీ రక్షించనీ అక్కయ్యా!" అన్నది, ముఖం ప్రక్కకు తిప్పుకుంటూ. వాళ్ళంతా వెళ్ళిపోతుంటే కడుపులో యెవరో చేయిపెట్టి దేవినట్టుగా వుంది. అందరూ వెళ్ళాక ఒకేసారి సందడి తగ్గిపోయింది.

"పిల్లలు కన్పించరేమే?" అన్నమ్మ అన్నం తింటూ అడిగింది.



"ప్రసాద్, సుధాకర్ తీసుకుపోయారు."

"ఏమిటి? తిరునాళ్ళకు పోయారా? భాగ్యమ్మ కూడా పోయిందా వారితో!"

"ఊఁ!" అంది బొత్తిగా వినిపించదు, చెప్పినా లాభం లేదని.

"అక్కడ పెద్దవాడు కన్పిస్తే బావుండును." అన్నది. అంతే! మళ్ళీ మగతగా పడుకుంది.

"నిర్మలా!"

"ఏమండీ!"

"ఇలా చేశావేం?"

"ఇద్దరి క్షేమముకోరి చెయ్యాల్సి వచ్చింది."

"వారు క్షేమంగా ఉంటారా?"

"దానికి నేనేం చేయాలి? అది వారి దురదృష్టం. ప్రతి నిమిషము మీరిలా కావడానికి కారణం వాళ్ళు గుర్తుకు వస్తుంటే - మిగిలిన పిల్లల్ని ఏం చేస్తానో నాకే తెలియలేదు అందుకే దూరం పంపాను. నన్ను క్షమించండి." అతని మోకాళ్ళపై తల ఆన్చి కన్నీరు కార్చింది.

"ఊర్కో నిర్మలా! ఊర్కో." మృదువుగా ఆమె వీపు రాస్తూ ఉండిపోయాడు.

## 36

రెండురోజులలో వచ్చి తీసుకుపోతానని, అన్న దగ్గర తల్లిని, తమ్ముళ్ళను, చెల్లెండ్లను ఉంచిపోయిన సుధాకర్

నెల అయినా అయిపు లేదు. ఆ ఇంట్లో పెత్తనం అంతా గొల్లమల్లిదే. పట్నంపోయి పాలమ్మిన లెక్కలు తెచ్చి చూపటమే ప్రసాద్ వంతు. వెనుకటి కాలంలో ధనవంతులు హోదా, సరదాకోసం తన గుప్పిట్లో ఆడవారిని ఉంచి పోషించేవారట. కాలం మారిపోయింది. ఇప్పుడదే విధంగా మల్లి ప్రసాద్‌ను పోషిస్తుంది. చుట్టూ గేదెలు, పేడ, ఈగలు, కుడితి తొట్లూ ఆ ప్రదేశం చూసి తలతిరిగిపోయింది భాగ్యలక్ష్మికి. ఓ గది చూపారు. అక్కడే పిల్లలతో కాలక్షేపం చేస్తుంది. వాకిట్లో మంచంమీద కూర్చుని చాని ఆకుల సరంజామా విప్పింది. ప్రతి అయిదు నిమిషాలకు ఒకసారి తాంబూలం సేవిస్తూ హిడింబిలా ఉంటుంది.

"ప్రసాదయ్యో! మీ అమ్మిచ్చిన కాడినుంచీ జరంత బాగుందయ్యా" అన్నది.

"మరి నేను తెచ్చింది అందుకే కదా!"

"నాకు ఇక చెప్పకు! మీ చిన్నయ్య పొమ్మంటే కాదు వచ్చింది" అన్నది పెద్దగా నవ్వుతూ.

"ఆనాడే మీ అన్నదమ్ములకు చెప్పితి. దూరమూర గంశెయ్యమాకండి. ఏకులు మేకయి మీపానాల మీదకి ఒత్తుందని. ఇంకా ఆయన దరమ పెబువు. పోలీసులకిచ్చి పులుసులోకి ఎముకలు లేకుండ తన్నిచ్చిండు."

"ఏందే నీకు తలమీద కొమ్ములొచ్చాయి!"

"రావూ! ఆల్లు మెత్తగా అందరిని పంపేశారు. పోసించుదువులే" అంది. నిర్లక్ష్యంగా రొట్టెలు కాలుస్తున్న



భాగ్యమ్మ సిగ్గుతో చచ్చిపోయింది. అక్కడే ప్రాణంపోతే బాగుండును అనిపించసాగింది. ఎంత గర్వంగా వాళ్ళను కన్నది, పెంచింది? ఫలిత మిదా? చుట్టూ పిల్లలను చూచి మురిసిపోయింది. భుజాలచుట్టూ శాలువా కప్పుకుని కర్రసాయంతో తిరిగే మరిది కళ్ళముందు తిరిగాడు. హృదయం ఆర్ద్రమయిపోయింది. కన్నీరు కారుస్తూ పనిపూర్తి చేసింది.

"నేను కొత్తపట్టు కొనుక్కోవాలి మల్లీ! అయిదేం సరిపోతయి?" గుణుస్తున్నాడు ప్రసాద్.

"నిన్న పది తీసుకుపోయావు."

"అందులోంచి నీకు పౌడరు తీసుకురాలే?"

"ఇట్ల ఖర్చు పెరిగితే ఎట్టా? అక్కడ గంపెడు పిల్లలతో మీ అమ్మ..."

"వాళ్ళిక్కడెందుకుంటారు? సుధాకర్ తీసుకుపోడూ?"

"ఏం? పిల్లలకందరికి దొంగతనాలు నేర్పటానికి కామోసు!"

"ఏదో ఒకటి తెద్దూ, బ్రతకవద్దూ?"

"యహ! సిగ్గులేదూ? దొంగతనం చేత్తారు!" కోపంగా అంది.

"ఒకరి సంగతి మనకెందుకే? పదిరూపాయలు ఇవ్వు" అదిచ్చిన పదిరూపాయలు అందుకుని వెళ్ళిపోయాడు. పిల్లలు అందరూ అన్నవాలకం చూసి అసహ్యించుకున్నారు.

"ఓ పిల్లా, ఇలా రా!"

"ఏమిటి?" పద్మ దగ్గరగా వెళ్ళింది.

"పాలచెంబులుతోము." మల్లి ఆకారం చూసి భయపడిపోయింది. వెంటనే పిల్ల చెంబులతో పరుగెత్తింది. మెల్ల మెల్లగా తవుడుతట్టలు నింపడం, కుడితి కలపడం, గేదెలను కడగటం అన్ని పనులు చెబుతుంది. మల్లి దుర్మార్గురాలు కాదు. పిల్లల చేతులలో రెండు పైసలుంచేది. కాస్త జ్ఞానం తెలిసిన పద్మ తప్పితే పిల్లలందరూ మల్లి చెప్పిన మాటలు వేదం అన్నట్టు వినేవారు. భాగ్యలక్ష్మికి బాధగా ఉంది. నిర్మల ఆమె పిల్లలూ కళ్ళముందు మెదిలారు. 'మరో జన్మకయినా అలాంటి పిల్లలను ప్రసాదించి దేవా!' అనుకునేది రోజుకో సారి. పద్మ భారతి పోలికయితే, ఉమ అచ్చా వసంతపోలిక. మల్లిని ఆరాధించటం, దానికి కొప్పుచుట్టడం వరకూ వచ్చింది. ప్రసాద్‌తో మాట్లాడి లాభంలేదని తెలిసిపోయింది. రాత్రింబవళ్ళూ ఒకటే ఆలోచన మిగతా పిల్లలను ఎలా రక్షించడం? చదువుకున్న వారిని హేళన చేసింది. ఈనాడు తనకు నాల్గు అక్షరాలు వస్తే? ఆగి ఆగి వచ్చే కన్నీటిని తుడుచుకుంది.

"ఏమో! అంగడికి పోతున్న, ఆలస్యం అయితే గేదలకు నీళ్ళపొయ్యి" అన్నది.

"సరే! తప్పతుందా?" విసుగ్గా అంది.

"ఏందమ్మో! ఏమో అంటున్నవు? యెవడికోసం చేస్తున్నావు? నీదె గంప సంతానం. నా కోసం కన్నావా?"

"నేనేం అనలేదు. పోమ్మా నీ దారిని" బ్రతిమాలి పంపేసింది.

"పద్మా!"



"ఏమ్మా?"

"జీవితంలో యెవరినీ అవహేళన చెయ్యొద్దే. అసూయతో అన్న మాటలకు ఫలితం చూడవే ..." అంటూ ఏడ్చింది.

"ఊర్కో అమ్మా! వేసవిలో నందిని అక్కయ్య పెళ్ళట."

"నిజమా అమ్మా! యెవరు చెప్పారే?"

"శ్రీపురం నుండి పాలకని మనుష్యులు వచ్చారు."

"కానియ్యమ్మా! ఏమిటో జీవితాలు ఇలా అయిపోయాయి"

"వాసు అన్నయ్యకు చెల్లెలు అంటే యెంత ప్రేమ అమ్మా."

"ప్రతి అన్నకు తన చెల్లెలు అంటే ప్రేమే వుంటుందే వెర్రిదానా! నేను పిచ్చిభ్రమలోపడి కొడుకులంటే వంశోద్ధారకులని మురిసిపోయి, వారిని పెడదారి పట్టించాం" అన్నది, గతం తలచుకుంటూ.

"అమ్మా! భారతక్క, సుగుణక్కకు మనం జ్ఞాపకం రానేరామా అమ్మా?"

"వచ్చినా ఏం లాభమే. ప్రపంచంలో అందరూ స్నేహం, బంధుత్వము సరిసమానంగా వున్నవారితో కలవాలనుకుంటారు. వాళ్ళువస్తే మనదగ్గరేముందే పెట్టడానికి? వాళ్ళే నాల్గు రూపాయలు వదులుతాయి."

"ఊఁ!" అని వెళ్ళిపోయింది. పనులన్నీ పూర్తిచేసి వుంచాలి. మళ్లీ కచ్చితమైన మనిషి,

## 37

నందిని వివాహంతో పాటు పద్మదికూడా చేశారు. అది ఊహించని భాగ్యలక్ష్మి హృదయం సంతోషంతో పొంగి పోయింది. వరుడు నాగార్జున సాగర్‌లోనే పనిచేస్తు న్నాడు. రెండు వేలు కట్నం ఇచ్చారు.

"అదేమిటే అమ్మా! నందినికి పదివేలు యిచ్చినప్పుడు పద్మకు అయిదు వేలు ఇవ్వరా?" అంది సుగుణ.

"సుగుణా! మీకు దండం పెడతానే. మీరు అసూయతో అంటున్నారే ఆ మాట. ఆ మాత్రం ఎవరు చేస్తారు? నందిని పెళ్ళికి వస్తూ నాలు చీరలు తెచ్చుకున్నావు. ఒక్కటి చెల్లికంటూ తేలేదేమే? అనవసర విషయాలలో తల దూర్చి యింతవరకు తెచ్చుకున్నాను. ఆడపిల్లలు బజారున పడకుండా రక్షించారు, అదేచాలు" అన్నది, చేతులు జోడిస్తూ, సుగుణ అక్కడి నుండి వెళ్ళిపోయింది. స్త్రీసహజమైన గుణం ఆమెది. నందిని భర్తముందు తనభర్త బట్టి పల్లెటూరి మనిషిలా వున్నాడు. తనకు పట్టుమని నాలు చీరలు లేవు. అడగకుండానే నందిని అత్తవారు యొన్నో కొన్నారు. వాసు ఇష్టపడ్డవి కొన్ని.

"నందీ! కూతురి వస్తువులు సర్ది, మరో ట్రేలో చీరలు, జాకెట్టుగుడ్డలు సర్ది కూతుర్ని పిలిచింది.



"అమ్మా!" నందిని దగ్గరగా వచ్చింది. "ఏమయినా చెప్పాలా అమ్మా?"

"ఏం లేదు, నందీ! నీకు చెప్పాల్సినవి ఏం లేవు. భగవంతుడు ఒక్క విషయములో నన్ను ఆశీర్వదించాడను కుంటాను. నా ఆశయాల కనుగుణంగా మీరు పెరిగారు. అదే సంతోషం, తల్లీ! ఈ చీరలు భారతికి, సుగుణకు బొట్టుపెట్టి పెట్టమ్మా!"

"వాళ్ళు రేపుంటారుగా?"

"అవును. నా చేతులమీదగా వారికేం ఇవ్వలేను. ప్రసాద్, సుధాకర్ అంతా దోచుకుపోయినా క్షమించే దాన్నమ్మా మీ నాన్నను...వద్దు. నందీ! వద్దు!" ఆమె కళ్ళు వర్షిస్తూనే వున్నాయి. ఆ కన్నీరు ఆరిందెప్పుడు? భర్త కోసం నవ్వుతుంది. నటిస్తుంది. తల్లి కన్నీరు ఒత్తింది.

"వద్దమ్మా! మనము అదృష్టవంతులం. నాన్నగారు బ్రతికారు."

"అవునమ్మా!" తల్లి చెప్పినట్లు అందరికీ తాంబూలం ఇచ్చింది. అందరి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది నందిని. ఆ సాయంత్రం అందరూ భారంగా తిరిగారు.

మర్నాడు కొడుకులిద్దరిని పిలిచింది నిర్మల. వాసు, చందు తల్లికిరువైపులా కూర్చున్నారు. అక్కడే వాలు కుర్చీలో భాస్కర్‌రావు కూర్చున్నాడు.

"వాసూ! మీ ఇద్దరూ పెద్దవారయ్యారు. ఇంట్లో ఒక తల్లికి పుట్టినా, మీ అభిరుచులు - ఆచ...

వేరు బాబూ ! అందుకే ఇదిగో పొలం రెండు భాగాలు చేశాం. మీది మీరు అజమాయిషీ చేసుకోండి."

"అమ్మా !"

"అమ్మనే చెబుతున్నాను నాయనా ! ఉమ్మడికుటుంబం వుండాలని తాతయ్య పడ్డ తాపత్రయం చూశావా ? ఒకరిని ఒకరు ద్వేషిస్తూ బ్రతకాల్సి వచ్చింది."

"ఇప్పుడు మీకు వయసు మళ్ళిందా ? మతి పోయిందా ?" చందు అరిచాడు.

"అవి రెండూ అందుబాటులోనే వున్నాయి. మా ఇద్దరికీ వచ్చే పెన్షన్‌తో మా జీవితం గడుస్తుంది నాయనా ! మీ పొలాలు అజమాయిషీ చెయ్యమంటే చేస్తాం."

"ఇదేమిటమ్మా ? మీ మా అంటూ భేదాలు." వాసు బాధగా చూశాడు. అతనికి తల్లి గాయపడ్డ మనసు అలా చేయిస్తూందని తెలుసు. అప్పటికి మాట్లాడి లాభం లేదని ఊర్కొన్నాడు.

"నేను రెండు నెలలు సెలవు పెట్టాను. ఇంకా నెల పది రోజులుంది. బహుశః ఉద్యోగం చెయ్యననుకుంటాను. పెన్షన్ అప్లయి చేస్తాను."

"అలాచేస్తే మాకంటె సంతోషించే వారెవరూ వుండరమ్మా !"

"మాకు సంతోషం, నిశ్చింత కలగాలంటే మీరు …గా వుండాలి వాసూ ! చందు హౌస్ సర్జన్ చేస్తూ …ను సంపాదించుకోగలడు. నీ బాగోగులు చూసే …యుండాలి."

పచ్చీరల



"అందుకే నువ్వూ, నాన్నా నాతో రండమ్మా!"

"అది జరగని పని వాసూ ! ఈ గడ్డమీదే తన ప్రాణం పోవాలని మీ నాయనమ్మ కోరిక. ఈనాడు ఆమెకు తెలియదని అన్యాయం చేయరాదు."

"మరెలా ?"

"నీవు వివాహం చేసుకోవాలి. ఫలానా అమ్మాయే కావాలని మాకేం పట్టింపులేదు. నీకిష్టమయిన అమ్మాయి పేదరాలయినా, ధనవంతురాలయినా ఫరవాలేదు."

"అమ్మా ! యెంత మొహమాటం లేకుండా చెబుతున్నావ్ ? మాకు నీకు తెలియని అమ్మాయిలు తెలుసా ? అమ్మా !"

"తెలుసు అన్నానా? మా సమ్మతి తెలిపాం. మిమ్మల్ని చూడటానికి వస్తాం. మా జీవితాలు ఈ గడ్డమీదే గడిచి పోనీ."

"నాన్నగారూ ! వింటున్నారా ?"

"అమ్మ అన్నమాటలో తప్పేం ఉందిరా? మీరిద్దరూ దూరం వున్నా మీ మనసులో అన్నా, తమ్ముడు అనే బంధముతో దగ్గర వుండాలి. నీ వివాహ విషయము మాకే వదిలినా ఆనందమే,"

"ఇప్పుడేం తొందర..."

"నిజమే. కాని, వేరు పరిస్థితులలో మీఅమ్మ ఉత్తరం వ్రాయగానే వచ్చేది. ఇప్పుడలా కాదు. నేను..." అతను మాట్లాడలేక పోయాడు.

"అలాగే నాన్నగారూ! మీ ఇష్టప్రకారమే మీరు తారీఖు నిర్ణయించి రాయండి వస్తాను" లేచి పోబోయాడు వాసు.

"అదేం కుదరదు." అతన్ని ఆపింది నిర్మల. "మేం చూచినా నువ్వు చూచినా ఆమోదం తెలిపేవరకు ముహూర్తం పెట్టలేము."

"అలాగే ఎక్కడుందో చూపు మరి."

"చూచారా గడుసుతనం" హృదయపూర్వకంగా నవ్వింది.

"మామయ్య తీసుకు వెళ్ళిన దగ్గరకు వెళ్ళు. అన్నీ ఆయనే చూపుతారు" కుటుంబ విషయాలు పరిష్కరించానని ఆ రాత్రి ఎంతో నిశ్చింతగా నిదురబోయింది. మర్నాడు ఇద్దరికొడుకులు ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

"నిర్మలా! నిజంగా పెన్షన్ పుచ్చుకుంటావా?"

"నిజమేనండీ! యాంత్రిక జీవితంతో విసిగిపోయాను. కొన్నాళ్ళు మళ్ళీ నూతనదంపతులమవుదాం. ఒకరి ఎదురుగా ఒకరం కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాలం గడుపుదాం." అన్నది.

అతను తేలికగా నిట్టూర్చాడు.

## 38

పనిచేసిచేసిన అలవాటు. అటు, ఇటు, ఎటు దొర్లినా నిదుర రావటంలేదు నిర్మలకు. భాస్కరరావు నిశ్చింతగా



నిదురబోయాడు. నెమ్మదిగా లేచి, తలుపులు జేరవేసి బయటకు వచ్చింది. వర్షం వచ్చేలా ఉంది. ఉక్కగా వుంది. నెమ్మదిగా వెళ్ళి పొలాలు పర్యవేక్షించింది. తమ పొలం పనులు మందకొడిగా సాగుతున్నాయి. సుధాకర్ పొలం సాగుచేసే వారు అతిచురుకుగా చేసుకుంటున్నారు. భుజాలమీదికి కొంగు లాక్కుని కూర్చుంది, దగ్గరలో వున్న బండపైన. గతించిన జీవితం గుర్తుకువస్తుంది. ఎక్కడో అసంతృప్తి. అదే ఆమె కర్థం కావటం లేదు.

"నిర్మలా!"

వెనుతిరిగింది నల్గురిపిల్లలతో భాగ్యలక్ష్మి నిల్చుంది. ఆమె శోకదేవతలా వుంది.

"ఏమక్కయ్యా! ఏం జరిగింది?"

"ఇప్పటివరకేం జరుగలేదే. ఇక ముందున్నది." అంటూ ఏడ్చింది. ఉమ అపరాధిలా ప్రక్కకు తప్పుకుంది.

"ఏం జరిగింది ఉమా?"

"పిన్నీ! అన్నయ్య నన్ను సినిమాలో చేర్పిస్తానంటే -"

"వల్లకాట్లో చేర్పిస్తే పీడా పోయేది" భాగ్యలక్ష్మి కూర్చుంది.

"ఈ పిల్లలు నీ పుణ్యమా అని ఓ దారిన పడ్డారు. నిర్మలా! వాసు, చందులాగ పెద్దచదువులు చదవకపోయినా పెద్ద బుద్ధులు నేర్చుకుంటారని ఎంత సంతోషించానో అంతా ఏట్లో కలుపుతున్నారు. ఈ పిల్లలకు నీ చేత్తో ఇంత విషమిచ్చినా సంతోషమేనే." నిర్మల రెండుచేతులూ పట్టు

కుంది. "ఉమను అడ్డమైన మొగాడికి చూపిస్తాడు. సినిమాలో చేరుస్తాడట."

"నన్నేం చేయమంటావక్కా ?"

"ఏదో ఏర్పాటు చూడు చెల్లీ ! నా తప్పు లేదనను. నా కళ్ళముందే ముగ్గురు పిల్లలు యెందుకూ పనికిరాకుండా పోయారు. నువ్వు కాదంటే వీళ్ళకింత విషం ఇస్తాను."

"అక్కయ్యా !" నిర్మల తల వంచుకుంది. "సానుభూతి చూపటం తప్పితే ఏం చెయ్యను. నన్ను క్షమించు." ఆమె కళ్ళు నిండుకున్నాయి. "ఇప్పుడిప్పుడే జరిగింది మరచిపోవాలని చూస్తున్నాను. ఈ పిల్లలు నాదగ్గరుంటే ఏ బలహీనమైన క్షణంలో ఏం చేస్తానో నాకే తెలియదు."

"చంపు. ఇలా రోజూ చచ్చేకన్నా అదే నయం."

"వద్దక్కా ! ఈ పొలం ఇదంతా నాది కాదు. మేము మా పెన్షన్‌తో బ్రతికడమే కష్టం."

"ఏదయినా ఆశ్రమము లాంటిది చూడు నిర్మలా !"

"చూడక్కయ్యా! ముగ్గురు అల్లుళ్ళు ఉన్నారు. ఎవరో ఒకరు సాయం చేస్తారు. వెళ్ళండి" ఖచ్చితంగా చెప్పింది. భాగ్యలక్ష్మి నిరాశగా వెనుదిగింది. ఏదో ఆశతో మూడ మైళ్ళు నడిచివచ్చింది. కూతుర్లను అమ్మా, తల్లీ అంటే కదా ! ఎప్పుడూ ఆడముండలు అంటూ ఎద్దేవ చేయటమే నాయె ఈరోజు వారుమాత్రం ఏం గౌరవిస్తారు ?"

నిర్మల ముందు యిల్లు విడిచే నాటి వెంకటరా మూర్తి ప్రత్యక్షం అయింది. రెండుచేతులతో ముఖము



కప్పుకుంది. తను ఏం చేస్తూంది? ఒకరితప్పు మరొకరినెత్తినరుద్ది బాధ్యతలు వదిలించుకోవాలని చూస్తుంది. తన విద్యా, తన విజ్ఞానం అంతా ఇంతేనా ? చక్కగా పెరిగే లతలకు నీరు పెట్టక ఎండపెట్టడం న్యాయమా ? సంఘర్షణ అనంతరం స్వార్థాన్ని, కోపాన్ని వివేకమే జయించింది.

"అక్కయ్యా !" అప్పటికే భాగ్యలక్ష్మి చాలాదూరం వెళ్ళింది.

"ఒరేయ్, ఎవర్రా అక్కడ ?" ఇంజన్ గదిలోంచి సత్తయ్య వచ్చాడు. ఏమిటన్నట్టు చూచాడు.

"అదుగో ఆ డొంక దిగుతుంది పెద్దమ్మగారు, వెళ్ళి పిలుచుకురా. నేను పిలుస్తున్నానని చెప్పు."

"అలాగే నమ్మా" సత్తయ్య తలగుడ్డ గట్టిగా చుట్టుకుని పరుగెత్తాడు.

## 39

రెండు రోజులనుండి వాన పడుతూంది. అన్నమ్మకు ఒకటే ఆయాసం. నిర్మలకు కాళ్ళూ, చేతులు ఆడటంలేదు. భార్యాభర్తలు చెరోప్రక్క కూర్చున్నారు.

"ఈ వర్షంలో డాక్టరుగారు వస్తారంటారా ?"

"చూద్దాం." అంటుండగానే డాక్టరుగారు వచ్చాడు. అతనో ఇంజక్షన్ ఇచ్చాడు.

"కొన్ని నిమిషాలలో తెలివి రావచ్చు" అని వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోతుండగానే చందూ, నందిని వచ్చారు.

"యెలా వుందమ్మా ?"

"మామూలే !" చందు పరీక్ష చేశాడు. అమ్మమ్మ కళ్ళు విప్పింది.

"నాయనమ్మా ?" నందిని ముందుకు వంగింది.

"నందినీ..." అస్పష్టంగా గొణిగింది.

"యెలా ఉంది ?"

"ఆ...యా...సం"

"అమ్మా..." భాస్కరరావు పిలిచాడు.

"యెవరూ...? భాస్కర్...అన్నయ్య ఏడి ?"

"వస్తాడమ్మా..." అంతే మళ్ళీ తెలివి తప్పింది. నిర్మల లేచింది. పిల్లలకోసం వంట ప్రయత్నం చేయసాగింది.

"అమ్మా !" నందిని వచ్చింది.

"ఏం నందీ యెలా వుందమ్మా అత్తవారిల్లు ?"

"అలా అడక్కపోతే ఒకసారి రాకూడదూ ?"

"వచ్చేరోజులు ముందున్నాయి."

"పో అమ్మా !" నవ్వింది. అంతట్లోకి గంభీరంగా మారిపోయింది నందిని ముఖం.

"అమ్మా! మళ్ళీ ఉద్యోగం చేస్తున్నావట ఎందుకు?"

"యెందుకేమిటమ్మా ? తోచక" అన్నది.



"కాదమ్మా ! డబ్బు ఇబ్బంది కదూ ?" తల్లి మాట్లాడక పోవటం చూచి మళ్ళీ తనే ప్రారంభించింది.

"అన్నయ్య చాలా బాధపడ్డాడమ్మా. వాళ్ళకు ఎలా సంతోషంగా వుంటే అలాగే ఉండనీ అన్నాడు."

"వాడొట్టి బావుకుడు" తనూ నవ్వుకుంది. తనకు తెలియని అప్పులున్నాయా ? ఎంత ఆలోచించినా నందినికి తల్లి ఉద్యోగం చెయ్యటంలోని అర్థం కనిపించలేదు.

మర్నాడుదయము అన్నమ్మ పోయిందీలోకంనుండి. వృద్ధురాలని ఆమె కర్మ చాలా బాగా చేశారు. నందిని పర్యవేక్షణలో చకచకా అన్ని పనులు జరుగుతున్నాయి. ఆమె కోసం కన్నీటిబొట్లు రాల్చింది భాస్కరరావు ఒక్కడే.

"తమ్ములు, ఉమ బాగా చదువుతున్నారా పెద్దమ్మా ?" నందిని అడిగింది భాగ్యలక్ష్మిని.

"ఏమోనమ్మా! వాళ్ళను చూచి నెల అయింది. ఉమ నారాయణ గూడా గర్ల్స్‌హాస్టల్లో ఉంది. మొగపిల్ల లిద్దరూ పేరు రావటంలేదే ... ఆ హాస్టల్లో ఉన్నారు." అన్నది. నందినిని ఉదయమునుండి వేధిస్తున్న ప్రశ్నకు జవాబు దొరికింది. తల్లి మళ్ళీ వుద్యోగం యెందుకు చేస్తుందో అర్థం అయింది. తను అనుమానపడటం లేదుకదా! వెంటనే చేస్తున్న పని వదిలి గదిలోకి వెళ్ళి ఖర్చు పుస్తకం తీసింది. ఆమె అనుమానమే నిజం అయింది.

"నందినీ! నాన్నగారు పిలుస్తున్నారు." తల్లి కేక విన్పించింది. నోటు పుస్తకం మూసి ముందు హాల్లోకి వెళ్ళింది

ఆ రోజు నాయనమ్మ పెద్దకర్మ. కుడిచేయి లేవని భాస్కర్ రావు ప్రతిదానికీ కొడుకులనో, కూతురునో పిలుస్తాడు. బయట భోజనాలు చేస్తున్న వారికి వడ్డనలు చేస్తున్నారు కొడుకులు. హాల్లో పరిచిన జంపఖానాపై కూర్చుని భుక్తాయాసం తీర్చుకున్నారో పదిమంది సాధువులు.

"పిలిచారా నాన్నా !"

"అవునమ్మా! విడి నోట్లుంటే ఓ పదిరూపాయలు పట్రా. వీళ్ళకు గంజాయి ఖర్చులు కావాలట !" అని భుజం మీద శాలువా సరిచేసుకున్నాడు. తన అవిటిచేయి కనబడకుండా నందిని తెచ్చిన డబ్బు ఒక్కరొక్కరికే యిచ్చి నమస్కరిస్తూ ఆగిపోయాడు. ఆఖరున కూర్చున్న సాధువు కేసి అనుమానంగా చూచాడు. అతను భావయుక్తంగా నవ్వాడు.

"అన్నయ్యా !" భాస్కరరావు చేతిలోని నోటు జారిపోయింది. దాన్ని అతను పదిలంగా పట్టుకుని భాస్కరరావు తలపై చేయి వేశాడు.

"భగవంతుడు నిన్ను పుణ్యలోకాలకు పంపుతాడు నాయనా! పదండి హరి ఓం..." లేచాడు అతను.

"ఆగండి." నందిని అతనిచేయి పట్టుకుంది. "మీరు పిరికివారిలా పారిపోయి మా నాన్నను ఈ బాధ్యతలలో ఇరికించారు. ఇప్పటికయినా వారిని విముక్తులను చేయండి."

"నేనెంతటి వాడిని బిడ్డా! ప్రతివాడిని విముక్తి కలిగించేది ఆ పరాత్పరుడే."



"బాధ్యతలకు దూరం అవమనికూడా ఆ పరాత్పరుడే చెప్పాడా? మీ పిల్లలకోసం — మీకోసం — మా అమ్మ మళ్ళీ ఉద్యోగం చేస్తూంది..." నందినికి దుఃఖం ఆగలేదు.

"కర్మను యెవరూ తప్పించుకోలేరు. వస్తామండీ ..." మిగతా వారితో కలిసిపోతూ నందిని చేతిలోవున్న చేయి విడిపించుకున్నాడు, నందిని ఒక అడుగు ముందుకు వేసింది.

"నందినీ —" తండ్రి పిలుపు విని వెనుతిరిగింది.

"పోనివ్వమ్మా. బలవంతంగా కట్టి ఉంచలేము, ఈ రోజు గొడవ కావటం నా కిష్టం లేదు."

నందిని ఏం మాట్లాడలేదు. కళ్ళు తుడుచుకుని ముందుకు పోబోయింది.

"నందినీ !"

"మీ అమ్మ ఉద్యోగానికి ఏవో కారణాలు చెప్పావు."

"మీకు తెలియదా ?"

"లేదు. తోచలేదు అన్నది. సరే అన్నాను."

"పెద్దనాన్నగారి ముగ్గురు పిల్లలకు చదువుచెప్పిస్తూంది. ముగ్గురూ హాస్టల్లో చేరారు." విసురుగా అక్కడినుండి వెళ్ళిపోయింది నందిని.

భాస్కరరావు ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుండిపోయాడు. సాయంత్రం ఆరు గంటలకు అతనికి భోజనానికి పిలుపు వచ్చింది. అందరూ ఇంటివారు కూర్చున్నారు. నందిని భర్త వడ్డనకు వచ్చాడు. అతను గారెలు మామగారి పళ్ళెంలో వేశాడు.

"నాకు కాదయ్యా, అల్లుడూ! మీ అత్తగ
వెయ్యి. ఆమెకు ఇంకా శక్తి నిమ్మని భగవంతుణ్ణి ప్రా
చాలి" అన్నాడు. అతని ముఖంలో యెప్పుడెరగనంత తృ
కన్పించింది. అతను నాల్గు తీసి అత్తగారి విస్తట్లో వేశా

"ఆయన తమాష చేస్తుంటే నువ్వు నిజమే అనుకుం
న్నావా బాబూ!" నవ్వుతూ తన కిరుప్రక్కల కూర్చు
కొడుకుల విస్తళ్ళలో వేసింది.

"చూచావా, పక్షపాతం! ఆడపిల్లంటే యె
దూరమో?" నందిని ఉడుక్కుంది.

"వడ్డించేవాడు మీ ఆయనే అని లేవే" చందు సవ
ధానం చెప్పాడు. అందరూ నవ్వారు. వాసు మౌనం
భోజనం చేస్తున్నాడు.

"ఏరా! మాట్లాడవు? కోపమా?" నెమ్మదిగా అ
గింది.

"కోపమా! లేదమ్మా. నీ కొడుకుగా పుట్టానని గ
స్తున్నాను."

"బంతిలో గుసగుస లేమిటన్నయ్యా!" నందిని అం

"నువ్వు బావగారిని యెంత ఏడిపిస్తున్నావో అమ్మత
చెబుతున్నాను."

"అమ్మ నమ్ముతుందనా?" అందరి నవ్వులతో, కేరిం
లతో భోజనాలు ముగిశాయి. భాస్కర్ కూతుర్ని పి
చాడు.



"నందినీ! ఉపయోగం లేని విషయాలు చర్చించక పోవటమే మంచిదమ్మా. పెదనాన్నను చూశామని పెద్దమ్మతో అనకు. ఎంతయినా భార్య కదా!"

"అలాగే నాన్నా!" అన్నది, బయటికి చూస్తూ. దూరంగా కొండలు కనిపిస్తున్నాయి.